# ఆంధ్రపత్రిక

సచిత్ర వార పత్రిక

RECD No. M4479



4 అణాలు
19-9-'51

ANDHRA PATRIKA ILLUSTRATED WEEKLY

శ్రీమదాంధ్ర

# మహాభారతము

## ఉద్యోగ పర్వము

వెల ఒకరూపాయ

---

త్వరలో వచ్చుచున్నది.

# టామ్ సాయర్

(పిల్లల నవల)

రచన:

మార్క్ ట్వేన్

అనువాదం:

నండూరి రామమోహనరావు

వెల రు. 2/- పోస్టుఖర్చులు ప్రత్యేకం

ఆంధ్రపత్రిక సచిత్రవారపత్రికనుండి పునర్ముద్రితము.

---


కాపీలకు:

ఆంధ్రగ్రంథమాల,

నెం. 7 తంబుచెట్టివీధి, మద్రాసు 1.


మాడర్న్ థియేటర్స్‌వారి
సర్వాధికారి
తెలుగు
పూర్ణా పిక్చర్స్ రిలీజ్....
డైరెక్షన్
T.R. సుందరం
త్వరలో వచ్చుచున్నది

# ఆంధ్రపత్రిక

సంవత్సరచందా
రు. 12-0-0
విడిపత్రిక
4 అణాలు

ప్రతి బుధవారము
ప్రకటింపబడును
Founder: K. NAGESWARA RAO

సంపుటము 43
సంచిక 53
19-9-51

ఖర సంవత్సర భాద్రపద బహుళ చవితి బుధవారము


# ఆంధ్రరాష్ట్ర విభజన సంఘ నివేదిక: రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ తీర్మానం

[సూర్యనారాయణ]

ఆంధ్రరాష్ట్ర సాధనకోసం స్వామి సీతారామ్ మొదలైనవారు ప్రాయోపవేశ దీక్ష పూని అప్పుడే నెల దాటింది. ఈ సమస్య గురించిన ప్రసక్తి పార్లమెంటులో రెండుమార్లు వచ్చింది. ఆలిండియా కాంగ్రెస్ కమిటీ ఆంధ్రప్రతినిధులలో కొందరు ముఖ్యులు ఢిల్లీలో పండిట్ నెహ్రూను కలుసుకొని ఈ విషయమై ప్రస్తావించారు. రాష్ట్ర నిర్మాణం పట్ల పండిట్ నెహ్రూ సుముఖత చూపినట్లు తెలుపుతూ, ప్రాయోపవేశం విరమించవలసిందని స్వామీజీకి వారు తంతివార్తలు పంపారు.

ఆంధ్రరాష్ట్ర కాంగ్రెస్ కమిటీ 14 వ తేదీని నెల్లూరులో సమావేశమై, 1950 జనవరి ఆంధ్రరాష్ట్ర విభజన సంఘ నివేదిక ప్రాతిపదికపైన ఆంధ్రరాష్ట్ర నిర్మాణానికి అవసర చర్యలు తీసుకోవలసిందని భారత ప్రభుత్వాన్ని కోరుతూ ఒక తీర్మానం చేసింది. ఆంధ్రరాష్ట్రసాధనకోసం సత్యాగ్రహం చెయ్యరాదని కాంగ్రెస్ వాదులను హెచ్చరిస్తూ మరొక తీర్మానం చేసింది.

ప్రాయోపవేశదీక్ష విరమించవలసిందిగా కోరవద్దని స్వామి సీతారామ్‌గారు నాయకులను విన్నపం చేసుకున్నారు. మద్రాసు నగర భవితవ్య నిర్ణయానికై పరిష్కర్తనియామకానికి భారతప్రభుత్వం సమ్మతించాలని కోరుతూ, అంతవరకూ ప్రాయోపవేశం విరమించబోనని స్వామీజీ తెలియజేశారు.

పార్లమెంట్‌లో శుక్రవారం నాడు కామత్ గారి ప్రశ్నకు పండిట్ నెహ్రూ సమాధానమిస్తూ నెహ్రూ-పటేల్-పట్టాభి కమిటీ నివేదికలో ఇవ్వబడిన వాగ్దానాలను పాటించగలరన్నారు.

మద్రాసు నగర భవిష్యన్నిర్ణయానికి పరిష్కర్తృత్వం ఏర్పాటు చేయాలని పట్టుబట్టి స్వామీజీ దీక్షను విరమించకపోయినప్పటికీ, ఆంధ్రరాష్ట్ర కాంగ్రెస్, తమిళ, కర్నాటక కాంగ్రెస్‌లు, మద్రాసు ప్రభుత్వమూ లిఖితపూర్వకంగా 1950 ఆంధ్రరాష్ట్ర విభజన సంఘ నివేదికను ఆమోదిస్తున్నట్లు తెలియపరిచినట్లయితే ఎన్నికల తరవాతనైనా ఆంధ్ర రాష్ట్ర నిర్మాణానికి భారత ప్రభుత్వం ఏర్పాటు చెయ్యగలదా అని వెంకట్రావుగారు ప్రశ్నించారు. పండిట్ నెహ్రూ ఇలా సమాధానమిచ్చారు: "దీనితో ప్రమేయం కల వివిధ సంస్థలు, సకల సమస్యలనుగురించీ ఒప్పందానికి వచ్చినట్లు తెలిపినట్లయితే స్వామీజీ ప్రాయోపవేశంతో నిమిత్తం లేకుండా భారతప్రభుత్వం తగు చర్యలు తీసుకోగలదు."

మద్రాసు శాసన సభలోని ఆంధ్ర ప్రతినిధులు కొందరు పంపిన తంతివార్తకు సమాధానమిస్తూ పండిట్ నెహ్రూ ఈక్రింది విధంగా తెలియచేశారు. "ప్రధానాంశాలపైన విస్పష్టమైన ఒప్పందం కుదరనప్పుడు, మద్రాసునగర భవిష్యత్తువంటి వివాదగ్రస్త అంశాలపట్ల ముఖ్యులైన నాయకులు కొందరు నాయక వర్గాలు కొన్ని (groups) వివాదాన్ని రెచ్చగొడుతూనే ఉన్నప్పుడు భారత ప్రభుత్వం ఎట్టిచర్యనూ తీసుకోడం కష్టమని మీరు గ్రహించేఉంటారు. వివాదాంశాలను తిరిగి రెచ్చగొట్టినట్లయితే పరిస్థితి మరింత కష్టతరం కాగలదు. మేము (భారతప్రభుత్వం) మా అభిప్రాయాన్ని ఇదివరకే స్పష్టపరిచాము. ఇంక ఆంధ్ర నాయకులు మనస్సంకోచాలు మానుకుని సమీపప్రాంతాలనాయకులకు కూడా సమ్మతమైన ఒక పథకాన్ని తయారుచేసి ఇవ్వడమే మిగిలి ఉంది. ఈ విషయంలో (రాష్ట్రనిర్మాణ విషయంలో) సమీప ప్రాంతాలవారికి కూడా ఆంధ్రనాయకులకున్నంత శ్రద్ధా ఉంది. ముఖ్యాంశాలను పరిష్కర్తృత్వానికి విడిచిపెట్టవలసివచ్చే ఏ పథకమూ భారతప్రభుత్వానికి తృప్తికలి

[illegible]



[illegible]

## సరిహద్దుల సమస్య:

[illegible]

చెప్పబడింది. సరిహద్దుల విషయమై కర్నాటక కాంగ్రెస్ కమిటీ, ఆంధ్ర కాంగ్రెస్ కమిటీల మధ్య సమాధానం కుదరనట్లు, బళ్లారి జిల్లాగురించి ఆవేశాలు పెరుగుతున్నట్లు భారతప్రభుత్వం గమనించింది. ముఖ్యంగా తుంగభద్రా ప్రాజెక్టు బళ్ళారి జిల్లాలో ఉన్నందువల్ల ఈ వివాదానికి మరింత ప్రాధాన్యం కలుగుతోంది...... ఈ విభేదాలు పరిష్కరించబడనంతవరకూ, పైన సూచించబడిన సమస్యలు పరిష్కరింపబడనంతవరకూ ఆంధ్రరాష్ట్ర నిర్మాణానికి భారతప్రభుత్వం సమ్మతించబోదు.

"తిరిగి ఈ సమస్యను భారత ప్రభుత్వం ఎత్తుకోవాలంటే ఈ విభేదాలు, సమస్యలు పరిష్కరించబడాలి.''

1950 జనవరిలో 26 వ తేదీలోగా రాష్ట్రాన్ని సాధించాలనే ఆత్రుతలో విభజన సంఘమూ, మద్రాసుప్రభుత్వమూ సరిహద్దు నిర్ణాయక సంఘం అవసరం లేదని సూచించిన మాట అందరికీ తెలిసినదే. ఆనాడు సరిహద్దు నిర్ణాయక సంఘ నియామకానికి పట్టుదలచూపిన భారత ప్రభుత్వం ఈనాడు ఎందుకు వెనుదీయాలో బోధపడదు. మద్రాసునగరాన్ని గురించిన నిర్ణయాన్నిమాత్రం అన్యభాషారాష్ట్రాల నిర్మాణం జరిగేవరకూ ఆంధ్రులుతలపెట్టి తేము ప్పే కొని ఉపకారం వీసమైనా ఉండదు.

ఈనాడు ద్విభాషాప్రాంతాలు విస్తీర్ణంగా ఉన్నందువల్ల ఆయా ప్రాంతాలలో అల్పసంఖ్యాకవర్గాల పట్ల పరిపాలకులు తమవిధానాన్ని మార్చుకోడం ఏనాటికైనా అవసరమే. పలుభాషాప్రాంతాలలో అన్ని భాషావర్గాలకూ న్యాయం చేకూర్చడానికి భారతదేశమంతటా సమరసమైన ఒకవిధానాన్ని పరిపాలకులు అవలంబించేటట్లు కేంద్రప్రభుత్వం సమగ్రమైన కొన్ని సూచనల్ని చేసి ఉన్నట్లయితే, భాషాప్రాంతాలను గురించి ఇంత ఆవేశాలకు, అక్రమాలకు తావుండక పోయేది. అప్పుడు సరిహద్దుసమస్యలకు నెహ్రూగారు భయపడనవసరం లేకపోయేది. భాషారాష్ట్ర నిర్మాణోద్యమాన్ని పాకిస్తాన్ ఉద్యమంతో పోల్చ నవసరం లేకపోయేది. ఆంధ్రప్రజానీకానికీ నాడింత హృదయావేదన కలిగేది కాదు. మద్రాసునగరంకోసం పట్టుదలకు పోవలసిన అవసరం లేకపోయేది. ఇప్పటికైనా భారతప్రభుత్వం పలుభాషా ప్రాంతాలలో వివిధభాషా వర్గాలవారి అవసరాలను గమనించి సమగ్రమైన విధానాన్ని రాష్ట్ర పాలకులచేత అనుసరింపచెయ్యగలిగినట్లయితే, నెహ్రూ ఉద్దేశంలో దేశైక్యతకు గల ఈ ముఖ్య ప్రతిబంధకం సులువుగా తొలగిపోతుంది. భాషారాష్ట్ర నిర్మాణ కర్తవ్యం సుకరమౌతుంది.

ఈ సమస్యల్ని పరిపాలనా సమస్యలుగా పరిగణించినట్లయితే ఈనాడీ క్లిష్ట సమస్యలు వచ్చేవికావు. ప్రభుత్వం అశ్రద్ధవల్లనే వచ్చిన ఈ సమస్యల్ని సక్రమంగా పరిష్కరించడానికి పూనుకోక, ఈనాడు వివాదాలు సంభవిస్తే ప్రజలను, కొన్ని వర్గాలను నిందించడం అక్రమమని చెప్పక తప్పదు. మద్రాసు నగరసమస్యని కేంద్ర ప్రభుత్వం ఈ దృష్టితో పరిగణించి ఉన్నట్లయితే ఆంధ్రులకీ హృదయవేదన ఆవేశాలూ రాకపోయేవి. ఇప్పుడైనా, సమస్య ఇంత తీవ్రరూపం ధరించిన తరవాతకూడా, ఈ సమస్యకు ఆంధ్రులను నిందించి ప్రయోజనం లేదు. ఉపవాసాలు చేస్తున్నారని కోపగించినందువల్ల ప్రజల సమస్యల నెంత అర్థం చేసుకోలేకపోతున్నారో బోధపడుతుంది.

కాని, మద్రాసుకోసం ఆంధ్రదేశ భవితవ్యాన్ని బలిచెయ్యడం కార్యదక్షత అనిపించుకోదు. ఎన్నికలు సమీపించినా, ప్రాజెక్టుల విషయమై ఆంధ్రదేశంలో ఆందోళన అసంతృప్తి బయలుదేరినా ఇంతవరకూ మిన్నకున్న ఆంధ్ర కాంగ్రెసు నాయకులకు స్వామీజీదీక్ష కర్తవ్యం బోధించిందనే సత్యాన్ని గుర్తించాలి. ఆంధ్రరాష్ట్ర కాంగ్రెస్ తీర్మానంవల్లనే స్వామీజీ ప్రాయోపవేశదీక్ష ఈసమయంలో ఎంతగా అవసరమయిందో తెలుస్తున్నది. వారు దీక్ష వహించిఉండకపోతే ఆంధ్రరాష్ట్ర కాంగ్రెస్ ఎప్పటిమాదిరిగా మిన్నకుండేదనే విషయం ఆంధ్రదేశానికి తెలుసును. విభజనసంఘ నివేదికను ఆమోదిస్తూ రాష్ట్ర కాంగ్రెస్ తీర్మానించి, రాష్ట్రం సాధించినట్లు తాము తృప్తిచెంది అందరినీ తృప్తి పడాలంటున్నారు. ఈ తీర్మానంవల్ల రాష్ట్రం రాదని నెహ్రూ సమాధానాలవల్లనూ, కేంద్ర ప్రభుత్వం ఇదివరలో మద్రాసుప్రభుత్వానికి పంపిన లేఖవల్లనూ స్పష్టపడుతోంది. కాబట్టి ఇప్పుడు రాష్ట్రాన్ని సాధించాలంటే, భారత ప్రభుత్వం కోరుతున్న షరతులను ఏ విధంగా తృప్తిపరచాలి, అవి తృప్తిపరచజాలనివైతే ఆంధ్రనాయకుల కర్తవ్యమేమిటి అనే విషయాలను గురించి ఆంధ్రదేశనాయకులందరూ ఆలోచించాలి. నిస్పృహలోపడి మణిగిపోయిన ఆంధ్ర రాష్ట్రోద్యమాన్ని ఉద్ధరించిన స్వామి సీతారామ్ గారు ఇంకా దీక్షను సాగించినట్లయితే, రాష్ట్రసాధనకు ప్రతిబంధకాలే ఏర్పడతాయో, లేక మరే విషమస్థితి ఏర్పడుతుందో గమనించవలసిన అవసరం ఉంది. కార్యదక్షత దృష్ట్యా పరిస్థితులను పరిశీలించకుండా, కేవలం ప్రజల్ని ఆవేశపరిచినంతమాత్రంచేత రాష్ట్రాన్ని సాధించవచ్చునంటే అది పొరపాటవుతుంది. ఒక అన్యాయాన్ని అందరిచేతా గుర్తింపచెయ్యడానికి వహించే దీక్షకూ, అనుకూల వాతావరణం లేకపోయినా ఆవేశం కలిగించి కార్యం సాధించాలనే ఉద్దేశంతో పూనే దీక్షకూ వ్యత్యాసం ఉంది. రెండోరకం దీక్షవల్ల ప్రజలకు క్షేమం ఉండదు. మొదటిరకం దీక్ష అయితే ఇప్పటికి వారి సంకల్పం నెరవేరిందని తృప్తిపడి దీక్ష విరమించడం అవసరమౌతుంది. ★

# కౌంట్ ఆఫ్ మాంట్ క్రిస్టో

## అలెగ్జాండర్ డ్యూమా

## 59

బారోయ్ వెళ్ళినతరవాత వృద్ధుడు మనుమరాలివంక ప్రేమ, కృతజ్ఞత ఉట్టిపడేభావంతో చూశాడు. ఈ చూపుల అర్థం వాలంటిన్‌కీ, విల్‌ఫర్ట్‌కీ కూడా స్పష్టంగా బోధపడింది. విల్‌ఫర్ట్ కోపంతోనూ శంకతోనూ ముఖం ముడుచుకుని మౌనంగా వృద్ధుని ప్రక్కనే ఒక కుర్చీలో కూర్చున్నాడు. అరగంటలో ఒక న్యాయవాదిని వెంటబెట్టుకుని బారోయ్ తిరిగి వచ్చాడు. న్యాయవాది రాగానే అతనితో విల్‌ఫర్ట్ ఇలా అన్నాడు:

"మా తండ్రిగారు మీకోసం కబురు పంపారు. వీరి స్థితిని మీరే స్వయంగా చూడండి. పక్షవాతంవల్ల చేతులూ కాళ్లూ స్వాధీనం తప్పాయి. మాటకూడా పోయింది. ఆయనకి ఏమి కావాలో, ఏమి తెలియపరచదలుచుకున్నారో కనుక్కోడం మాకే దుర్ఘటంగా ఉంది."

విల్‌ఫర్ట్ మాట ఇంకా పూర్తికాకముందే నయర్‌టైర్ ఆందోళనతో వాలంటిన్ వంక చూశాడు. వాలంటిన్ వెంటనే అందుకుని "ఆయ నేది చెప్పదల్చుకున్నారో నాకు స్పష్టంగానే తెలుస్తుందండి" అంది.

"నిజమండి" అన్నాడు బారోయ్ "ఈమాట దారిలో మీతో చెప్పానుకదా!"

న్యాయవాది క్షణంసేపు ఆలోచించి ఇలా అన్నాడు: "ఇప్పు డీయన విషయంలో చిక్కులున్నందువల్ల నేను జాగ్రత్తగా ఉండాలి. మాట్లాడలేని వ్యక్తి సమ్మతి తెలుపుతున్నారో, నిరాకరిస్తున్నారో తెలుసుకోడం కష్టం వాస్తవంగా ఆయ నేం చెయ్యగోరుతున్నారో స్పష్టంగా తెలుసుకోడం కష్టం కాబట్టి, నావల్ల ఇప్పుడు ఏ ప్రయోజనమూ ఉండదని నా ఉద్దేశం. న్యాయశాసనాలకు అనుగుణంగా వ్యవహారం జరపలేం."

ఇలా చెప్పి న్యాయవాది వెళ్లిపోడానికి లేచి నిలబడ్డాడు. నయర్‌టైర్ చూపులలో ఈమారు కోపం దుఃఖం కానవచ్చాయి. వాలంటిన్ న్యాయవాదిని ఆపి, ఇలా చెప్పింది. "నే చెప్పేమాట వినండి. తాతగారితో మాట్లాడేపద్ధతి నేర్చుకోడం చాలా సులువు. మీరు క్షణంలో చూసి తెలుసుకోగలరు. మీకు సందేహం తీరిపోవాలంటే ఏంచెయ్యాలో చెప్పండి."

"వ్యవహారం శాసనాలకి అనుగుణంగా, సక్రమంగా జరగాలంటే, ఆయనకి ఒప్పుదల ఉన్నదీ లేనిదీ ఆయన స్పష్టంగా తెలుపగలగాలి." అన్నాడు న్యాయవాది.

"అయితే అది సులువే. తాతగారికి మాట పోయిందన్నమాటే కాని మేధాశక్తి రవంతైనా క్షీణించలేదండి. ఒప్పుదల చూపించడానికి ఆయన కళ్లు మూసుకుంటారు. ఒప్పుదల కాకపోతే కన్నులు రెపరెప లాడిస్తారు. మీరుకూడా సులువుగా అది గ్రహించవచ్చు. ప్రయత్నించి చూడండి."

తృప్తిసూచకంగా వృద్ధుడు వాలంటిన్ వంక చూశాడు. వృద్ధుని చూపు గమనించి న్యాయవాదికూడా దాని అర్థం గ్రహించాడు. "ఇప్పుడు మీ మనుమరాలు చెప్పిందంతా మీకు స్పష్టంగా తెలుస్తున్నదా?" అని న్యాయవాది వృద్ధుని ప్రశ్నించాడు. వృద్ధుడు తెలుస్తున్న దన్నట్లు కన్నులు మూసి తెరిచాడు. "అయితే ఆమె చెప్తున్నది మీకు సమ్మతమేనా?" అని అడిగాడు. అవునన్నట్లు మళ్లీ కన్నులు మూశాడు.

"మీరే నాకోసం కబురు పంపారా?"

"అవును" అన్నాయి వృద్ధుని కళ్లు.

"ఎందుకు? వీలునామా వ్రాయించడానికా?"

"అవును."

"అయితే సరే, ఇదేలా ఒనగూడుతుందో ప్రయత్నం చేద్దాం. ఈ అమ్మాయని మనకి సహాయంగా ఏర్పాటుచేసుకుందామా?"

"సమ్మతి సూచకంగా వృద్ధుడు కళ్ళుమూశాడు.

"ఇది చాలా చిత్రంగా ఉందండి. ఆయన చక్కగా తన అభిప్రాయాలు ప్రకటిస్తున్నారు" అన్నాడు న్యాయవాది విల్‌ఫర్ట్‌తో

"చిత్రంగానే ఉంది" అన్నాడు విల్‌ఫర్ట్. "ఆయన వ్రాయించబోయే వీలునామా ఇంకా చిత్రంగా ఉంటుందిలెండి వాలంటిన్ సహాయం చేస్తేగాని వీలునామా వ్రాయించలేరు. ఈ వీలునామాలో ఆయన తన కున్నదంతా ఆమెకే ఇవ్వాలనుకోవచ్చు. నిజానికి ఏది కావాలో ఏది అక్కర్లేదో నోటితో చెప్పలేని ఈ వృద్ధుని సంకేతాల్ని ఆమెద్వారా అర్థం చేసుకుని ఆమెకే ఆస్తి ఒప్పగిస్తే, అదెంత న్యాయమో సక్రమమో నాకు బోధపడదు."

"కాదు కాదు" అన్నట్లు వృద్ధుడు కన్నులు రెపరెపలాడించాడు.

"అదేమిటి?" అన్నాడు విల్‌ఫర్ట్. "అంటే మీరు వీలునామాలో మీకు చెందిన ఆస్తిని ఆమెకు వ్రాసి ఇవ్వరా?"

ఇవ్వనన్నట్లు వృద్ధుడు కన్నులు రెపరెపలాడించాడు.

దీని అర్థమేమిటో విల్‌ఫర్ట్‌కి బోధపడలేదు. ఆలోచించుకుంటూ మరొక న్యాయవాదినికూడా పిలిపించడానికి వెళ్లాడు. సంగతంతా భార్యకు వివరించాడు.

పావుగంటలో తిరిగి అందరూ వృద్ధునిగదిలో చేరారు. రెండో న్యాయవాది వచ్చాడు. వీలునామా నమూనా ఎలా ఉంటుందో ఒక న్యాయవాది వృద్ధునికి చదివి వినిపించాడు. తరవాతవృద్ధుని విషయగ్రహణప్రజ్ఞను పరిశీలించాలనే ఉద్దేశంతో ఇలా అన్నాడు:

"ఒకరు వీలునామా వ్రాస్తున్నారంటే, అది ఎవరికో ఒకరికి చెందాలనీ, ఒకరికి చెందకూడదనీ వివరిస్తారు. అది తెలుసునా?"

"తెలుసును" అన్నట్లు వృద్ధుడు కన్నులు మూశాడు.

"మీ ఆస్తి విలువెంతో సరిగ్గా తెలుసునా?"

"తెలుసును."

సీతారామ్

"అయితే నే నొక్కొక్కటే మొత్తం సంఖ్యలు చెప్తూ ఉంటాను. సరైన సంఖ్య రాగానే తెలియచెయ్యండి. సరేనా?"

"సరే."

గది అంతటా నిశ్శబ్దత ఆవరించింది. అందరూ వృద్ధుని చుట్టూ మూగారు. రెండో న్యాయవాది కలం కాగితం పట్టుకుని వ్రాయడానికి సిద్ధంగా ఉన్నాడు.

"మీ ఆస్తివిలువ మూడు లక్షలకు పైగా ఉంటుందా?"

"ఉంటుంది."

"4 లక్షలు? 5 లక్షలు, 6 లక్షలు, 7 లక్షలు, 8 లక్షలు, 9 లక్షలు?"

ఆగమన్నట్లు వృద్ధుడు సంకేతం చేశాడు.

"అయితే మీ ఆస్తివిలువ తొమ్మిదిలక్షలుంటుందా?"

"అవును."

"ఏ రూపంలో ఉంది? బాంకులోనా, ప్రభుత్వ ఋణ పత్రాలలోనా..."

ఆగమన్నట్లు వృద్ధుడు సంజ్ఞ చేశాడు.

"ప్రభుత్వఋణ పత్రాలలో ఉందా?"

"అవును." అన్నట్లు కళ్లు మూసి తెరిచి వృద్ధుడు హాలోయ్ వంక సాభిప్రాయంగా చూశాడు. హాలోయ్ వెంటనే గ్రహించి, ప్రక్క గదిలోకి వెళ్లి తాళంవేసిన చిన్న చేతిపెట్టె తీసుకు వచ్చాడు.

"పెట్టె తెరిచి చూడమంటారా?"

వృద్ధుడు సమ్మతి సూచించాడు. పెట్టె తెరిచిచూస్తే తొమ్మిదిలక్షల ఫ్రాంకుల విలువగల ప్రభుత్వఋణపత్రాలు కనపడ్డాయి.

"సరిగ్గా ఆయన చెప్పినంతే ఉంది" అన్నాడు న్యాయవాది. "మేధాశక్తి క్షీణించలేదని స్పష్టపడుతూనే ఉంది." తరవాత వృద్ధునివంక తిరిగి "ఇది మీరు ఎవరి కివ్వదల్చుకున్నారు?" అని అడిగాడు.

హీలాయ్ విల్ ఫర్ట్ ఇలా అంది.

"ఆయనకి మొదటినించీ మనుమరాలే సంరక్షణ చేస్తోంది. ఆమెపట్ల ఆయనకుకూడా ఆపేక్ష అధికం. ఆయనసొత్తు ఆమెకు సంక్రమించడం న్యాయమే."

కాని నయర్ టైర్ కన్నులవంక చూసేసరికి వాలంటిన్‌కి ఇవ్వడం ఆయన కిష్టంలేదని స్పష్టపడింది. అంతేకాదు. హీలాయ్ వంక 'నువ్వెందుకిలా అంటున్నావో నాకు తెలుసులే' అన్నట్లు కోరచూపులు చూశాడు.

"అయితే మీరు మీమనుమరాలి కివ్వరా?" అన్నాడు న్యాయవాది.

ఇవ్వనన్నట్లు వృద్ధునికళ్ళు స్పష్టపరిచాయి.

"మీరు పొరపడటం లేదుకదా? మీ అభిప్రాయం ఆమెకివ్వకూడదనేనా?"

"అవును."

హీలాయ్‌విల్ ఫర్ట్‌కి ఈమాట కొద్దిగా ఆశ పొడచూపింది. మెల్లిగా వృద్ధుని సమీపించి మృదువుగా "అయితే ఎడ్వర్డ్‌కి ఇవ్వాలని మీ ఉద్దేశమా?" అంది.

వృద్ధునికన్నులు రెపరెపలాడాయి. అంతేకాదు అతని కళ్లలో ద్వేషంకూడా ఉట్టిపడింది.

"మీమనుమడికీ ఇవ్వరా? అయితే మీ కుమారుడు విల్ ఫర్ట్‌కి ఇస్తారా?" అన్నాడు న్యాయవాది.

వృద్ధుడు మళ్లీ అసమ్మతి సూచించాడు. విల్ ఫర్ట్ దంపతులిద్దరూ తెల్లబోయారు.

"మేమందరం నీకేం అపకారంచేశాం తాతా?" అంది వాలంటిన్. "నాపైన నీ కింక ఆపేక్షపోయిందా?"

వృద్ధుడు ఆమెవంక జాలిగా చూసి, తరవాత ఆమెచేతివంక చూశాడు.

"ఏమిటి? నా చెయ్యా? అంటే?"

"అదే" అన్నట్లు చూశాడు వృద్ధుడు.

"ఓ! అదా!" అంది వాలంటిన్. "తెలిసింది. నా పెళ్లి గురించా మీ అనుమానం?"

"అవును." తన అభిప్రాయం గ్రహించగలిగినందుకు ఆనందంతో ఆమెవంక చూశాడు.

"నాకు ఈ సంబంధం నిశ్చయించారని మీకు కోపంగా ఉందా?"

"అవును."

"ఫ్రాంజ్‌ని నేను పెళ్లిచేసుకోడం మీ కిష్టంలేదా?"

"లేదు"

"ఆ సంబంధం చేసుకోడానికి ఒప్పుకుంటేని ఆమెకు మీ ఆస్తి ఇవ్వనంటున్నారా?" అన్నాడు న్యాయవాది.

"సరిగ్గా అదే" అన్నట్లు వృద్ధుని కళ్లు ప్రకటించాయి.

"ఈ పెళ్ళి జరక్కపోతే మీ తొమ్మిదిలక్షలూ ఆమె కిస్తారా?"

"అవును."

విల్ ఫర్ట్ అడ్డు వచ్చాడు: "కాని ఈ పెళ్లి నిర్ణయించవలసింది నేను. నా కూతురికి ఏ సంబంధం మంచిదో, ఏది మంచిది కాదో నిర్ణయించే అధికారం నాది. ఆమె ఫ్రాంజ్ నే పెళ్లి చేసుకోవాలని నే నంటున్నాను—అతనినే ఆమె పెళ్లి చేసుకోవాలి."

వాలంటిన్ ముఖం పాలిపోయింది. దుఃఖంతో ముఖం చేతులతో మూసుకుని విలపించనారంభించింది.

"ఆమె ఫ్రాంజ్ నే పెళ్లిచేసుకుంటే, మీ ఆస్తి నేం చేస్తారు?" అన్నాడు న్యాయవాది.

వృద్ధుడు ఎటువంటి సమాధానం ఇవ్వలేదు.

"మీరేం చెప్తారు?" అన్నాడు న్యాయవాది విల్ ఫర్ట్‌వంక తిరిగి.

"నేను చెప్పేదేమీ లేదు. నాతండ్రి పట్టుదల ఎటువంటిదో నాకు తెలుసును. నే నీ పెళ్లిచేస్తే ఆయన తన తొమ్మిదిలక్షలూ ఏ వైద్యాలయానికో దానం చేస్తారు చెయ్యానివ్వండి. ఇటువంటి ముసలివాని చిత్తచాపల్యానికి లొంగడం అవివేకం. పెళ్లి నా ఇష్టం ప్రకారమే జరుగుతుంది."

విల్ ఫర్ట్ ఇలా చెప్పి విసుగుదలతో లేచి వెళ్లిపోయాడు. వృద్ధుడు ఈ పెళ్లి జరిగినట్లయితే తన సొత్తును తన అనంతరం దానం చెయ్యాలని వీలునామా వ్రాయించి న్యాయవాదికి ఒప్పగించాడు.

## 6)

విల్ ఫర్ట్ ముందు సావడిలోకి వెళ్లేసరికి అక్కడ మాంట్ క్రిస్టో వేచిఉన్నాడు. విల్ ఫర్ట్ ముఖంలో విలక్షణాన్ని గమనించి ఇలా అన్నాడు: "ఏమలా ఉన్నారు? మీ రెవరికైనా ఉరిశిక్ష విధిస్తూ తీర్పు వ్రాసి ఇలా వస్తున్నారా?"

"అదేమీ కాదండి. ఈ కేసులో శిక్ష నాకే."

"దేన్ని గురించి చెప్తున్నారు? ఏదైనా చిక్కులో పడ్డారా?"

"ఏం చెప్పమంటారు? నా తండ్రి సంపాదించిన తొమ్మిది లక్షల సొత్తూ మా కుటుంబానికి చెందకుండా చేశాడు. సొత్తు నాకు లేకపోయినా నేను లక్ష్యపెట్టను. కాని పాపం నా కూతురుకి రావలసింది పోగొట్టాడు. దీనికంతకీ మతిచెడ్డ ఆ వృద్ధుడే కారకుడు. ఆయన ఇప్పుడు వీలునామా వ్రాయిస్తున్నాడు."

"వీలునామా వ్రాయించాలంటే, ఆయన మాట్లాడ గలగాలి కదా?"

"మాటలతో పనిలేకుండా చూపులతో అంతకంటె ఎక్కువే చేశారు."

"అదెలాగ?"

"ఆయనకి పూర్వం బుద్ధిలో కల ప్రజ్ఞ అంతా ఇప్పుడు చూపుల్లోకి వచ్చింది. చూపుల్తో ఆయన మనుష్యుల గుండెలు చీల్చగలరు."

హిలాయ్ విల్‌ఫర్ట్ అప్పుడే సావడిలోకి వచ్చింది "అలా కాదు. జరిగిన దానికంటె ఎక్కువ హాని ఉందని మీరు పొరపడుతున్నారు" అంది.

"ఇదేమిటి ఇలా చెప్తున్నారీయన? ఇది నిజమేనా? ఇదేమో అర్థం కావడంలేదే?"

"అర్థం కాకపోవడానికేముంది లెండి" అన్నాడు విల్‌ఫర్ట్. "వృద్ధునికి మతి చెడింది."

"ఆయన మనస్సు మార్చడానికింక వీలులేదా?"

"లేకేం! ఉంది." అంది హిలాయ్ విల్‌ఫర్ట్. "కోరితే ఆ ధనాన్ని వాలంటిన్ పేర వ్రాయించుకోవచ్చు—ఆయన మాట వింటే."

విల్‌ఫర్ట్ ఇలా అన్నాడు: "ఈ యింట్లో నా మాటకి గౌరవం ఉండాలి. వృద్ధునికీ వాలంటిన్‌కీ కూడా తెలియనితనం. ఎపినే కుటుంబంతో సంబంధం కలుపుకోడం మనకి అన్ని విధాలా మంచిది."

"అయితే ఆయనా వాలంటిన్ కలిసి కుట్ర పన్నుతున్నారంటారా?" అంది హిలాయ్ విల్‌ఫర్ట్ భర్తతో "ఏదో అటువంటిది జరిగి ఉంటుంది. ఇప్పుడు ఆయన చేస్తున్నదంతా ఒక నాటకంలాగుంది."

"వాలంటిన్ సంగతేమో నాకు తెలియదు. అంత సులువుగా తొమ్మిది లక్షలు విడిచిపెట్టుకుంటుందా?" అన్నాడు విల్‌ఫర్ట్.

"విడిచి పెట్టకేం?" అంది హిలాయ్ విల్‌ఫర్ట్. "ఏడాది కిందట అసలు పెళ్ళే చేసుకోననీ, క్రైస్తవమతంలో ప్రవేశిస్తాననీ వాలంటిన్ చెప్పేదికదా?"

"ఏమైనా చెప్పనీ" అన్నాడు విల్‌ఫర్ట్. "ఈ పెళ్లి జరిగి తీరాలి. నా తండ్రి పట్ల నాకెప్పుడూ గౌరవం ఉంది. కాని ఆయన ప్రస్తుత పరిస్థితిని బట్టి ఆయన ఉద్దేశాల్ని సక్రమమైనవని మన్నించలేను. ఆమెకి ఫ్రాంజ్‌తో పెళ్లి జరిగి తీరాలని నేను నిశ్చయపరిచాను. దీనికి తిరుగులేదు."

మాంట్ క్రిస్టో ఆశ్చర్యపడి "ఏమిటి? ఫ్రాంజ్‌ని ఆమె పెళ్లి చేసుకుంటే తన ఆస్తి ఆమెకివ్వనంటున్నారా?" అన్నాడు.

"అవునండి, అదే కారణం" అన్నాడు విల్‌ఫర్ట్.

"ఫ్రాంజ్‌ని నాకు తెలుసు. అతను జనరల్ క్వెస్నెల్ కుమారుడు కాదూ?"

"అవును."

"కాని ఫ్రాంజ్ పట్ల మీ తండ్రిగారి కోపానికి కారణమేమైనా ఉందా? రాజకీయ విరోధాలుంటేవా?"

"ఫ్రాంజ్ తండ్రీ నా తండ్రీ కూడా విప్లవకాలంలో ముఖ్య రాజకీయ నాయకులు."

"మీ తండ్రి బోనపార్టిస్టు అని మీరొకసారి నాతో అన్నట్లు గుర్తు."

"నా తండ్రి గిరాంటిస్ట్. ఆయన రాజకీయాల్లో చేరి కుట్రలు పన్నారంటే నెపోలియన్ చక్రవర్తిని ఉద్ధరించడం కోసం కాదు; రాజరికవాదుల్ని తరిమివెయ్యడం కోసమే. ఆయనకి పెద్ద భ్రమలేవీ ఉండేవి కావు. దేశాన్ని ఉద్ధరించడం ఆయన ఉద్దేశం కాదు. తన రాజకీయ నాయకత్వం కోసం దేనికీ వెనుదీసేవారు కారు."

"నేనూ అదే అనుకున్నాను. జనరల్ క్వెస్నెల్ నెపోలియన్ కింద పనిచేసినా, ఆయనకి మహారాజులపట్ల భక్తి ఉండేది. బోనపార్టిస్టులు ఆయన్ని హత్యచేశారు కాదూ?"

"అవును" అంది హిలాయ్ విల్‌ఫర్ట్. "ఆ పాత విరోధాల్ని మాపు చెయ్యడంకోసమే ఈ సంబంధం నిశ్చయపరిచాం."

"ఈయన తొమ్మిది లక్షలూ లేకపోయినా వాలంటిన్‌కి లోటులేదు" అన్నాడు విల్‌ఫర్ట్. "ఆమెకి తల్లితండ్రికి చెందిన ఆస్తి సంక్రమిస్తుంది. ఫ్రాంజ్ కూడా తొమ్మిది లక్షలు పోయినందుకు అన్యథా భావించే వ్యక్తి కాడు."

"అవును" అంది హిలాయ్ విల్‌ఫర్ట్. "ఆమెకి తల్లితరఫున సెంట్ మిరాన్ ఆస్తి వస్తుంది. సెంట్ మిరాన్ దంపతులు కూడా వాలంటిన్ పట్ల చాల ప్రేమతో ఉంటారు. ఇంక వాలంటిన్ నిత్యం ఆ వృద్ధుని సంరక్షణలో మునిగిపోవలసిన అవసరం ఉండదు. సెంట్ మిరాన్ దంపతులు ఒక మాసంలో ఇక్కడికి వస్తారు."

మాంట్ క్రిస్టో ఇలా అన్నాడు: "వాలంటిన్ పెళ్లి ఆయనకిష్టం లేకపోతే ఆయన తన ఆస్తిని మనుమడు ఎడ్వర్డ్‌కి ఇవ్వకూడదా?"

"అవును. మీరే చెప్పండి" అంది హిలాయ్. "అది అక్రమం కాదూ? పాపం ఎడ్వర్డ్ మాత్రం ఆయనకి వాలంటిన్‌తో సాటి రాడా?"

మాంట్ క్రిస్టో విని మాట్లాడ కూరుకున్నాడు.

హిలాయ్ ఒక్క క్షణం ఆలోచించి ఇలా అంది. "పోనీ ఈ సంగతి ఫ్రాంజ్‌కి చెప్పి అతనేమంటాడో వినడం మంచిదేమో. వాలంటిన్‌కి ఇంత నష్టం వస్తే ఈ పెళ్ళి మానుకుంటాడేమో."

"అలా వీలుపడదు" అన్నాడు విల్‌ఫర్ట్. "ఒకసారి నిశ్చయమైన సంబంధం తిరిగి పోవడం పనికిరాదు. అలా అయితే మన వాలంటిన్‌కి మన వంశానికి అప్రతిష్ఠ వస్తుంది. ఫ్రాంజ్ నీతివంతుడైతే తొమ్మిది లక్షలకోసం మాట తప్పడు."

"మీరు చెప్పింది బాగుంది" అన్నాడు మాంట్ క్రిస్టో. "ఈ విషయంలో నా సలహా అడిగితే, తొమ్మిది లక్షలు పోతేపోయింది ఈ పెళ్ళి చెయ్యడం మంచిదంటాను. ఫ్రాంజ్ త్వరలోనే తిరిగి వస్తాడు. నేను కూడా అతనితో ఈమాటే చెప్తాను."

విల్‌ఫర్ట్ ముఖం వికసించింది. హిలాయ్ ముఖం పాలిపోయింది. "అవును. అదే మంచిదిలెండి" అంది కొంత అనిష్టంగా.

మాంట్ క్రిస్టో వెళ్లిపోడానికి లేచాడు. "అప్పుడే వెళ్ళిపోతున్నారా?" అంది హిలాయ్.

"అవును వెళ్లాలి. నాకు మరొక పనుంది. శనివారంనాడు నా యింట్లో విందుమాట మళ్ళీ మీకు జ్ఞాపకం చెయ్యాలని వచ్చాను."

(47-వ పేజీ చూడండి)

# దెబ్బకి దెయ్యం జడుస్తుంది;

## శ్రీ భమిడిపాటి రామగోపాలం

వంటింటోంచి సామానుగదిలోకి విసురుగా వెళ్తోంది అమ్మ. నాన్న కుర్చీలో కూచుని అటువేపన్నా చూడలేదు. అమ్మకి ఉడుకుమోత్తనం వేసింది.

"ఇంక నే నీ కాపరం, చెయ్యలేను." అంది.

"ఏం? అంత చెయ్యలేని పరిస్థితేమొచ్చింది?" అన్నారు నాన్న వేళాకోళంగా.

"మీకంత వెక్కిరింతగానూ వెటకారంగానూ వుంది మరి. ఉండండి, మధ్యాన్నం కాఫీ తాగుదురు గాని!"

"ఏమొచ్చిం దిప్పుడూ?"

"మామూలు గిన్నెగదా అని పొయ్యిమీద పాలు పెట్టి నీళ్లు తోడుకొచ్చేల్లోగా సగం పాలు నిప్పులో కలిసిపోయేయి."

"అదేం జేస్తోందక్కడ? పొంగుతూంటే చూస్తూ కూచుందా?"

చెల్లి గోడవారనించి బైటికొచ్చి "పొంగలేదు నాన్నా! గిన్నెకి కన్నం వుంది; కారిపోయినాయి." అంది.

"ఆ చిన్న గిన్నెందుకు పెట్టేరూ? కారుతుందని తెలీదా? కొత్తా యేమిటి రోజురోజుకీను!"

"ఆ గిన్నె పెట్టేదు నాన్నా! పెద్దగిన్నె పెట్టేం."

"పెద్దగిన్నెకూడా కన్నంపడ్డదీ?"

"ఒక్క పెద్దగిన్నెకే యేమిటి? ఇంట్లో వున్న ప్రతీ గిన్నెగిండీ, ముంతా తప్పేలా అన్నీ! కన్నాలు లేనిదీ చెడిపోనిదీ ఒక్కటి లేదు; ఏనాటి సంసారం చెప్పండీ! నా పెళ్లినాటి గిన్నెలవి. కన్నాలు పడకేంజేస్తాయ్? కొనండీ అంటే కొనరు!"

"కొను కొనంటే యెక్కణ్ణించొస్తుంది డబ్బు? తిండికే చాలకండా వుంది ఎక్కడ లేందీను!" అని నాన్న పెరట్లోకి వెళ్లారు.

తమ్ముడు బజార్నించి ఇప్పుడేవొచ్చాడు.

"ఏమిటి తెచ్చేవురా?" అంది అమ్మ.

"అరిటికాయలు పావలాకి మూడు-బాగులేవని వంకాయలు పట్టుకొచ్చేను వీశ అయిదణాలనర. తక్కినవన్నీ నువ్వు చెప్పినవి తీసుకొచ్చేను." అన్నాడు తమ్ముడు.

"ఆ వెనక సెవరు?" అన్నాడు వీడు.

"ఇత్తడిగిన్నెలూ కళాయి గిన్నెలూ అతుకుతాట్ట. అవతల వీధంట వెళ్తూంటే తీసుకొచ్చేను."

"ఎందుకూ?"

"గిన్నెలన్నీ కన్నాలు పడిపోయేయంటున్నావు రోజూ! నాన్న కొత్తగిన్నెలు కొనడానికి డబ్బు లేదంటారు. పోనీ మరామత్ చేయిద్దామని!"

"ఎంతా బావుందిరా!" అంది అమ్మ.

"మన వీధిలోకూడా కేక వేశాట్ట. వినపడలేదేమో ననుకుని తీసుకొచ్చేను."

"ఆ! మీ నాన్నగారికి సంసారంమీద ఆ మాత్రం శ్రద్ధేవుంటే యిలా వుండడమేం?"

ఇంతలో నాన్నొచ్చేరు.

"ఇంకా యెంత శ్రద్ధ కావాలే?" అన్నారు.

"ఊరుకుందురూ చాలు! ఒక్క పిసరు పట్టించుకోరు! వాడు నయం మీకంటేను! అవతల వీధిలోంచొస్తూంటే తీసుకొచ్చేట్ట, బిందెల మరామత్తుల వాణ్ణి!"

మరామత్తులవాడు లోపలికొచ్చి వాడి చేతులో అదివరకునించీ వున్న గిన్నె నక్కడ పెట్టి "హాయ్ బాపా!" అన్నాడు.

"మరైతే ఆ గిన్నెలూ అవీ పట్రండే, చూస్తారేమిటి?... ముక్కలు తీసి ముక్కలు వెయ్యాలి కొన్నిటికి. వెయ్యగలవా?"

"యేస్తాం బాబూ! సూపియ్యండి."

అమ్మ చెల్లీ లోపలికెళ్లేరు.

"ఎక్కడ పెట్టేవు మకాం?" అన్నాడు వీడు.

"చెరువుగట్టుమీద బాబూ:"

"ఎందరు మీరు?"

"ముగ్గురమండి."

"నీ పేరు?"

"గౌతం లచ్చుమయ్యబాబూ."

"రాయరా చిన్నా ఆ పేరు!

తమ్ముడు రాశాడు.

"కళాయి వెయ్యడానికెలా పుచ్చుకుంటావ్?" అన్నాడు వీడు.

"గిన్నెనిబట్టుంటది బాబూ!"

చెల్లి ఓచేత్తో దస్తాగిన్నె ఓచేత్తో గంగాళమూ పట్టుకొచ్చింది. అక్కడ పెట్టి మళ్లా వెళ్ళబోతూంది.

ఆ గంగాళ మెందుకే?" అన్నారు నాన్న.

"అమ్మ పట్టికెళ్లమంది." అని చెల్లి వెళ్లిపోయింది.

"అమ్మ పట్టికెళ్లమనదూ మరీ! ఆలోచన వుంటే యింకేం కావాలి? వెర్రి కుదిరింది రోకలి తే తలకి చుట్టుకుంటా నన్నాట్ట!"

అమ్మ ఓచేత్తో ఇత్తడిగిన్నెలు రెండూ ఓచేత్తో బిందె పట్టుకొచ్చింది.

"ఆ గంగాళం దేనికే పట్టికెళ్ల మన్నావుట? వేషం వొచ్చినట్టుగాను!"

"బావుంది. గంగాళం ఉండొద్దుటండీ? నీళ్లు దాంట్లోనే వాడుకుంటున్నామాయె. సగం పొయ్యగానే సరి అక్కడో కన్నం. కారిపోతూను!"

ఈలోగా మరామత్తులవాడు గంగాళాన్ని పరిశీలించి, "దీనికి రూపాయిన్నరా తది బాబయ్యా?" అన్నాడు.

"సరిపోయింది. అలా అయితే ఈ గిన్నెలన్నిటికీ కలిపి నా సెలజీతం చాలదేమో! అదివెనక్కి పెట్టే! చాలు!" అన్నారు నాన్న.

"వెనక్కి పెడితే యెలాగండీ, నీళ్లు తోడిపెట్టేందుకేం లేకుండాను!"

"కాగు ఏమయింది?"

"కాగు మరి పొయ్యిమీద ఉండొద్దేమిటి?"

"అంతలా పొయ్యిమీద కొకటిపై కొకటి పెట్టిందుకు మనం కాదు. నీకొడుకులు ఉద్యోగాలు చేస్తున్నప్పుడు చూద్దాంలేదు. తియ్యవే అమ్మాయి అది!"

చెల్లి దాన్ని వెనక్కి తియ్యబోతోంది. అమ్మ మధ్యదాన్లో పట్టుకుని "దీనికి రూపాయిన్న రెందుకోయ్?" అంది మరామత్తులవాడితో.

వాడు గంగాళం పుచ్చుకుని "ఇక్కడ ఒకటి అతకాల బాబూ, ఇక్కడ సిన్న కన్నం వుంది. రెండతుకులైనయి. ఇదిగో ఈ అడుగుని ముక్క తీసి ముక్క

# కాని పారిపోతుందా?

య్యాల బాబూ. మొత్తం మూడు.” అన్నాడు.

“మూడింటికీ రూపాయిన్నరా?” అన్నాడు తమ్ముడు.

“అవుతాది బాబూ.”

“చాల్చాలు వెనక్కుంచు. రూపాయిస్తే గోలెం వొస్తుంది దాంట్లో దాచుకుందాం నీళ్లు.” అన్నారు నాన్న.

“బాగుంది బాబు; గోలెంకొంటే మా తరం గంగానం సాటొస్తదా?” అన్నాడు మరమ్మత్తులవాడు.

“ఒస్తే వొచ్చింది లేకపోతే లేదు. ఉంచు.”

“బాగుందండీ మంకుపట్టు?” అంది అమ్మ.

“కళాయికూడా యేస్తాం రూపాయిన్న ఇచ్చీండి బాబయ్యా!”

“కళాయీ వొద్దు ఏమీ వొద్దు.”

“అమ్మాయిగోరికి పెళ్లౌతది; పులు పొందుతారు. యేయించుకోండి బాబూ!”

“బాగా చెప్పేవు!” అంది అమ్మ.

“పెళ్ళయితే అప్పుడు చూసుకుందాంలే. ఉందది వొదులు. లేకపోతేరూపాయిస్తాను దాన్ని మూడుకన్నాలూ కప్పి కళాయి పెసెయ్.” అన్నారు నాన్న.

“అరణా లిప్పించండి బాబూ!”

“రూపాయిమీద మరోదమ్మిడీ లేదు!”

“పోనీ పావలిచ్చీండి.”

“ఊఁహుఁ.”

“సరే యిలాగియ్యండి.”

“అవును దానికా మూడోకన్నం ఎలా పడిందర్రా ఆఅడుగునీ?” అన్నారు నాన్న అందర్తోనూ కలిపి.

“చిట్టిగాడు నేల పెట్టి ఈడ్చేడు నాన్నా!” అంది చెల్లి.

“వెధవ! దున్నపోతులా ఈడ్చులెందుకో! అయినా వాడికా గంగాళంతో పనేమొచ్చిందీ? మీ అందరికీ బద్ధకాలయి!”

“ఊఁ, ఊఁ, ఈ గిన్నెలు చూడు!” అని అమ్మ ఒక శేరు గిన్నె దస్తాగిన్నె యిచ్చింది.

“కలాయిగిన్నె లేనండి.”

“అవును. కన్నాలున్నాయి చూడు.”

“ఈశేర్గిన్నె పాడైపోయిందమ్మా.”

“మరిబాగుపడదంటావేమిటి?” అన్నాడు తమ్ముడు.

“ఎందుకు బాగుపడదూ? డబ్బెక్కువౌతుందనడానికి ఫస్టుసైప్ అది!” అన్నారు నాన్న.

“బాగా చెప్పేరు!” అంది అమ్మ.

తమరలాగంటే యెలా బాబూ! ఈ గిన్నోకపాలిసి త్తగించండి. ఈ యడుగంతా జల్లెడ నాగుంది. శేకంతా తీసి మరోశే కెయ్యాల. శేరు పిరుమయిపోనాది బాబూ.”

“అదంతా నాకు తెలీదు. దాన్ని బాగు చెయ్యడానికెంతవుతుంది?”

“అరణా లొద్దె బాబూ.”

“హూఁ అరణాలేనా?” అన్నాడు తమ్ముడు.

“తాణాకినా తాంబూర ! నీకేం తెలుస్తుంది? ఒక్కదమ్మిడీ సొంతంగా ఆర్జిస్తే అప్పుడు తెలుస్తుంది. పావలా చేసుకో అబ్బి.”

“కుదర్దు బాబూ, తమ రిలా తగ్గిస్తారనే బేరమాడకండా సెప్పీశాను.”

“ఆ దస్తాగిన్నో?” అన్నాడు వీడు.

దస్తాగిన్నెలో తలదూర్చి చూశాడు మరమ్మత్తులవాడు. “దీనికేం లేదు బాబు!” అన్నాడు.

“పైనించిచూడు. మైనం ముద్దవుంటుంది” అంది చెల్లి.



వాడు పైనించి చూసి "అబ్బో! పెద్ద కన్నమే బాబూ!" అన్నాడు పైనం ముద్ద తీస్తూ.

"అదే, సెత్తి కెక్కడం అంటే! పెద్ద కన్న మెక్కడ?"

"కన్నం సిన్న దేగాని పగులు గూడండి బాబయ్యా, సుట్టు సుట్టేసినాది. ముక్కాల్యాల."

ప్రతిదానికి ముక్కాల్యాలంటా వేం?" అంది చెల్లి.

"ముక్కాస్తే డబ్బెక్కువౌస్తుంది!" అన్నాడు తమ్ముడు.

"దాని కెంతౌతుంది?" అన్నాడు వీడు.

"అర్ధ రూపాయాద్ది బాబయ్యా."

"ఈబిందె చూడు. దీనికి అడుగునో చిన్న కన్నం ఈమెడదగ్గ రోటి. మరి దీనికి వేరే బేరం ఆడక, మొత్తం అన్నిటికీకలిపి ఎంతౌతుందో చూడు." అంది అమ్మ.

మరామత్తులవాడు బిందె చూసి కింద పెట్టాడు. తరవాత లెక్కపెట్టుకుని "అంతా రెండున్నుప్పావలౌద్దిబాబయ్యా." అన్నాడు.

"ఎంతా?"

"పావల్తక్కువ మూడు!"

"రెండ్రూపాయ లిస్తాను."

మరామత్తులవాడు నవ్వాడు. "అన్నీ ఎరిగున్నోరు తమరే అలాగంటె లా బాబయ్యా?"

"కాపోతే మరో పావలా వేసుకో. అంతే." అంది అమ్మ.

"కిట్టదమ్మా, గంగాళానికి రూపాయిస్తామని తమరే గదా అంటిరి! మరి మిగిల్ని యియ్యన్నిటికీ కలిపి రూపాయి పావలా?"

"ఏం, చాల్దా?" అన్నాడు వీడు.

"రెండున్న రిచ్చిండి బాబయ్యా!"

"సరే పట్టికెళ్లనిండి?" అంది అమ్మ. మళ్లా ఎన్ని గంటల కొస్తావు?"

"ఓగంటలో యిచ్చేను బాబూ!"

"ఏంరా చిన్నా, ఎడ్రస్ రాశావా?" అన్నాడు వీడు.

"రాసేను నాన్నా!"

"ఏమని రాసేవు?"

"యాతం లచ్చుమయ్య, బిందెల మరామత్తు వాడు; చెరువుగట్టుమీద. అని రాశాను."

"గంగరాయిసెట్టుకింద అని కూడా రాసుకోండి బాబయ్యా."

"ఆఁ. రాయరా - ఇదుగో ఒక బిందె; ఒక దస్తాగిన్నె, ఓ గంగాళం, ఓ రేకుగిన్నె, ఒక కూరగిన్నె మొత్తం ఐదు. ఇవికూడా రాయి. ఇవ్వవలసిన డబ్బు రెండున్నర అని కూడా రాయి." అన్నారు నాన్న.

అమ్మా చెల్లీ లోపలి కెళ్లేరు.

మరామత్తులవాడు నిలబడి తలకి దస్తాగిన్నె బోర్లించుకున్నాడు. అది తలని పూర్తిగా మూసింది. కిందపెట్టి కర్రకి రెండుపక్కలా రెండు బిందెలు తగిలించి బుజాన వేసుకున్నాడు. చిన్నగిన్నెలు రెండూ గంగాళంలో పడేసి రెండో చేత్తో పట్టుకున్నాడు. "బాబూ! ఆ గిన్నె బుర్ర మీద బోర్లించండి." అన్నాడు.

తమ్ముడు అవకతవగ్గా దాన్ని బోర్లించాడు. అనుకోకుండా అది ఏటవాలుగా పట్టింది. దాంతో తలకి ఫిట్‌గా ఉందది. "మా మంచిటోపీ బాబయ్యా!" అన్నాడు.

"టోపీలాగే వుందిలే ఆ అంచూ అదీని!" అన్నాడు తమ్ముడు.

* * * *

సైకిలు ఇంట్లోపెడుతూ తమ్ముడు నాన్నని చూసి "సాయింకాలం అయిదింటికి వొస్తా నన్నాడు నాన్నా!" అన్నాడు. జేబురుమాలుతో చెమట తుడుచుకున్నాడు.

"ఇప్పుడు రమ్మనలేకపోయినావా, సైకిలుమీద?"

"రమ్మన్నానుగాని పనుందిట. రాలే నన్నాడు.... అవునుగాని చెరువుగట్టుమీద గంగరావిచెట్టుకింద ఎవరూలేరు నాన్నా!"

"అంటే?"

"బిందెల మరామత్తువాడు నాన్నా! అక్కడ లేడు!"

"అందుకా యింకా తేలేదు! ఓ గంటలో యిస్తానన్నవా డింకా రాలేదేమా అని చూస్తున్నాను." అంది చెల్లి.

"అదికా దిపుడు ప్రశ్న! వా డివి పట్టుకుని ఎక్కడికేనా ఉడాయించేసేడేమో అని!"

"ఏమో!" అన్నాడు తమ్ముడు.

"ఛఛ, అలా పట్టుకుపోతాడా?" అన్నాడు వీడు.

"నీ కేంతెలుసు, వెధవలు! పట్టుకుపోయినా పోతారు."

"అయితే వాడు దొంగా?" అంది చెల్లి.

"దొంగ అని ముఖం మీద రాసి వుంటుందా ఏమిటి? దొంగలు మటుకు మనుషులు కారా?" అన్నారు నాన్న.

"అంత ధైర్యం ఉంటుందా నాన్నా?" అన్నాడు తమ్ముడు.

"ఏమోరా వెధవలు! అవును గాని చెరువుగట్టు అంతటిమీదా లేరా లేక ఆ చెట్టుకిందే లేరా?"

"ఏమో, చెట్టు ఈ కొసనికదూ వుంది; తిన్నగా సైకిలు తొక్కుకుంటూవొచ్చి అకాత్తుగా అక్కడ జ్ఞాపకమొచ్చి చూసే సరికి అక్కడ పిట్టమనిషి లేడు! అధమం వాళ్లొచిపోయిన ఆ నమాళ్లూ లేవు."

"పోనీ మరోమాటు ఆసైకి లేసుకువెళ్లి గట్టంతా ఓమాటు చూసి అక్కడ వాడు లేకపోతే పోలీసు స్టేషన్లో వాడి పేరూ అదీ చెప్పిరా!

"వాడి పేరుమాత్రం తప్పుడు పేరు కాకూడదాయేమిటి?" అన్నాడు వీడు.

"అదీ నిజమే నాన్నా! అలాటివాడయితే పేరు కరెక్టయింది చెప్తాడేమిటి?" అన్నాడు తమ్ముడు.

అమ్మ, చిట్టిగాడూ వొచ్చారు.

"ఏమిటి? ఎక్కణ్ణించి వుత్తరం?" అంది అమ్మ.

"ఉత్తరం కాదమ్మా!" అంది చెల్లి.

"ఉత్తరమంటా వేం వీడూ?" అని చిట్టిగాడిమీద చెయ్యి ఆచింది అమ్మ.

"ఉత్తరమూ కాదు పత్తరమూ కాదు. ఆ గిన్నెలూ బిందెలూ పట్టికెళ్లేడే, వాడు ఆ చెప్పినచోట లేడు!" అన్నారు నాన్న

"అయ్యొ పాపమా! అయితే ఎక్కడికి పోయినట్టు?"

"ఏమో తెలీదు. ఆడే పోలీస్‌స్టేషన్లో చెప్పి రమ్మంటున్నాను. అంటే పేరు తప్పుది చెప్పేడేమో అంటున్నాడు."

"దొంగవెధవ! ఎంతపని చేసేడండీ! దిక్కుమాలిన వెధవ! తీరిగూర్చుని సంసారమంతా వీడి మొహాన మంట పెట్టాను! అయ్యొ నా తెలివా! ఎటుపోయినాడో ఓమాటు చూడండర్రా! ఏమిరా పెద్దవాడా అలా నించుంటావు - వెళ్లి ఓమారు చూడ్రాదురా?" అంది అమ్మ.

"ఏం జెయ్యమంటావమ్మా!" అన్నాడు వీడు.

"ఏం జెయ్యడ మేమిట్రా, ఓమారు అల్లా వెళ్లరా ఆ సైకిలుమీద!"

"వెళ్లొచ్చినవాడు చెబుతున్నాడు గదుటమ్మా!"

"అప్పుడే ఓమాటు వెళ్ళి రావడం అయిందా ఏమిటి?"

"వెంకటేశ్వర్లుని పిల్చుకురమ్మని పంపించేను. అలా చెరువుగట్టుమీం చొచ్చేట్ట. ఆ గంగరావి చెట్టుకింద లేట్ట."

"ఎవరు వెళ్ళేరు?"

"నేను." అన్నాడు తమ్ముడు.

"ఒరే చిన్నా!" నాన్న పిల్చారు.

"ఆఁ."

"మరిక్కడ డిస్కవర్ వల్ల లాభం

(42-వ పేజీ చూడండి)

# అమ్మ

నాన్న ఆఫీసునించి వొచ్చేసరికి చెల్లి తమ్ముడూ దెబ్బలాడుకుంటూ వీధి ముంగిట్లో [illegible] చేశారు. నాన్న యింట్లోకెళ్లి కొత్త కడుక్కొచ్చేసరికి చెల్లి మోకాళ్లలో [illegible] దెబ్బలు [illegible] కుంటుంది. తమ్ముడు [illegible] మీద [illegible]. [illegible] నాన్న [illegible] యింట్లోకి [illegible] "[illegible]! ఎంత [illegible] చేసుకున్నారో, [illegible]!" అన్నారు.

అక్క [illegible]. [illegible] లేదు. [illegible] భయపడుతున్నామని చెప్పగలను.

నాన్న [illegible] "ఎలా [illegible] తల్లి!" అన్నారు [illegible]. [illegible] "[illegible]! [illegible]! [illegible]!" అన్నారు.

[illegible] నాన్న [illegible] చేతులు [illegible] అలా [illegible]. తమ్ముడు [illegible] ఏడుస్తూ [illegible] చెల్లి వొచ్చింది.

వంటింట్లోకి [illegible] అక్క "[illegible]! [illegible] వొచ్చేసరికి ఎలా [illegible]!" అంది [illegible].

నాతో [illegible] "[illegible] కష్టపడి [illegible] కంటి [illegible]?" అంది.

"[illegible]" అన్నాను [illegible].

నాకో [illegible] అమ్మ జ్ఞాపకం వొచ్చింది. అమ్మ చచ్చిపోయిందని [illegible] చెప్పారు. [illegible]

ఆయన ఓనాడూ సరదాగా వుండటం లేదు. సంవత్సరం అయింది. నాన్న అమ్మని మర్చిపోతా రంటుంది అక్క. మరిచిపోకుండా వున్నారాయన.

తమ్ముడు ఏడుస్తూ మోచెయ్యి చూపించాడు. ముందుకి అంతా నల్లగా అయి, పొంగింది.

"అమ్మయ్యో! రక్తం గూడుకట్టేసింది!" అంది అక్క. "ఇంకో అలవ్యమేమిటే. గట్టిగా పట్టుకున్నారుగా, ఆ కోపంలో ఒళ్లు తెలియక చాలా గట్టిగా పట్టుకొనుంటారు; ఓయి బాబో! ఎలా అయిపోయిందో!–మాధవా డాక్టరు దగ్గరికి తీసికెళ్లు నాయనా! ఏదన్నా మందు రాస్తారు!"

చెల్లి మోకాటి చిప్పలూ మోచేతి చిప్పలూ చూసుకుంటోంది. వాటిలో [illegible] తొక్క లేదు. రక్తం రావడం లేదు గాని ఎర్రగా తడిగా వుంది. అమాంతంగా నన్ను చూసి అక్కకూడా అటు చూసింది.

"ఓరి బాబోయి – ఎలా చెక్కుకుపోయిందో! ఇంకేమన్నా ఉందా! ఎలా చెక్కుకుపోయిందో!... మాధవా, పిల్లద్దర్నీ ఎలాగో మందు [illegible] తీసికెళ్లరా నాయనా!" అంటోంది అక్క; యింటిలోకే నాన్న వచ్చారు. ఎక్కడివాళ్లక్కడ వున్నాం.

నాన్న కళ్లు ఎర్రగా వున్నాయి. మాకేదో భయం వేస్తోంది.

దగ్గరికి వొచ్చి [illegible] తమ్ముడి చెయ్యి చెల్లి మోకాళ్లు అంతా చూశారు. "గొడ్డుని బాదినట్టు బాదాను కదూ!... [illegible] ఇన్నాళ్లనో పెద్దపాపం చేసుకున్నారా నాయనా, యిలా నా యింట్లో పుట్టడానికి! ... ఎంతపని చేశానురా బాబూ!" అన్నారు.

ఆయన గొంతుకని అక్క [illegible] నుంది.

నాకూ చెప్పలేనంత దుఃఖం వొచ్చింది.

"ఇంతేరా నాయనా, తల్లిలేని పిల్లల గతి!... మా అమ్మ వుంటేనా?" అంటూ నాన్న కూలబడిపోయారు.

ఆయన ఏడుస్తున్నారని తెలియగానే చెల్లి తమ్ముడూ ఏడుపులు మొదలు పెట్టారు. అక్క నాన్నను [illegible] కాని ఆయన మరీ తీవ్రంగా ఏడ్చారు. నాకూ గొంతుకలో ఏదో అడ్డపడింది. అందుకే [illegible] అన్న మాటలు సరిగా రాలేదు.

* * * *

పిన్నిని [illegible] నాన్న ఉత్తరం రాశారు. అది గాక ఆయన [illegible] అడిగారట. పిన్ని పిల్లలూ వొచ్చారు.

[illegible] అక్క [illegible] లేదు. ఎంత [illegible] కుంటోంది. ఈ సంగతి పిన్నికి తెలియడానికి కట్టే కాలం పట్టలేదు. [illegible] అక్క [illegible] సంగతి [illegible]. అక్కను పిన్ని [illegible] ఉంది. అక్క [illegible]. [illegible] వెళ్ళింది. [illegible] పిన్ని [illegible] తెలిసిపోయిందని [illegible] మొదలు పెట్టింది.

అక్కకు [illegible] చెల్లి [illegible] లేదు నాన్న. నాన్నప్పుడూ ఆ సంగతి గురించి అనుకోలేదని పిన్నికి తెలియదు [illegible]. అందుచేత అది నాన్న [illegible] అక్క [illegible] పిన్ని [illegible]. అలా [illegible] పరమ [illegible].

అప్పుడప్పుడు నాన్న పిన్నిని [illegible]. తల్లి లేని మా [illegible] అన్నం [illegible] ఆయన [illegible] వుండకపోయినా [illegible] అంటూండేవారు. అక్కకి అది [illegible] – "[illegible] మాధవా, [illegible]! [illegible] అమ్మ [illegible] ఉపకారం [illegible] – ఇంకో [illegible] నయం [illegible]! [illegible] అంతా [illegible] ఉండేవాళ్లం [illegible]! [illegible] ఎప్పటికప్పు [illegible]

శ్రీ తారానాథ్

టికి నేనుఉమనీ కిష్టుణ్ణీ వెనక్కి లాగకపోతే ఎంతెంత గల్లంతులయ్యేవో! అవన్నీ నాన్నకి తెలుస్తే ఇలా పిన్నిని పొగుడుతారేమిటి!" అంది ఒకసారి.

నాకు అక్క అనేక సంగతులు చెప్పింది. అవన్నీ యెలా మనసుకి హత్తుకున్నాయో ఇదీ అలాగనే హత్తుకుంది.

పిన్నీ పిల్లలూ వొచ్చిన నెల్లాళ్ళకి ఒకనాడు ఉమానూ పిన్ని కూతురుపద్మానూ కలిసి వీధి చివరిదాకా సరదాగా షికారు వెళ్లిన వాళ్లు అట్నుంచి ఒకరు ఏడ్చుకుంటూనూ మరొకరు తరుముకుంటూనూ వొచ్చారు. చూస్తుంకదా, ముందు ఏడుస్తూ పరుగెత్తుతున్నది ఉమ. వెనక ఓ బెత్తంపుచ్చుకుని పద్మవొచ్చింది.

కిష్టుడు ఉమనుగుమ్మం ఎక్కనిచ్చాడు; పద్మను మెట్లదగ్గిరె అడ్డి "పో! మాయింటికి రాకు!" అన్నాడు.

"ఉం, మీ యిల్లేం?" అంది పద్మ, పక్కనించి రావడానికి ప్రయత్నిస్తూ ఉక్కురోషంతో.

"కాదేం?" అంది ఉమ కిష్టుడిపక్కనే నించుని.

పద్మ బెత్తం కిష్టుడిమీదికి ఆ చింది.

"కొడుతావేమిటి?" అన్నాడు కిష్టుడు బెత్తం పట్టుకుని.

ఇంతట్లో అక్కయింట్లోంచి వొచ్చింది. సంగతిచూసి "ఏంట్రా మాధవా. యిదీ? అలా మాస్తూ ఊరుకున్నావేం? ఆవిడ చూస్తే తిట్టగలదు!" అంది. నేను బిత్తరపోయాను.

కిష్టుడూ పద్మా బెత్తం చెరిరెండు చేతులా పుచ్చుకుని కుస్తీపడుతున్నారు. చివరికి కిష్టుడు పద్మని కిందికి తోసేశాడు. దాంతో అది పడవలిసిందేగాని స్తంభం పట్టుకుని ఉండిపోయింది. చేతులో మిగిలిన బెత్తంతో కిష్టుణ్ణి గట్టిగా ఆచి కొట్టింది. కిష్టుడు ఏడుపు మొదలెట్టాడు.

పద్మ యింట్లో కెళ్లబోతూంటే ముందు ఉమ అడ్డుపడి బెత్తం లాక్కోబోయింది. విదిలించుకుని పద్మ ఉమ చేతిని గిల్లేసింది. అక్క వెళ్లి ఛటాలున పద్మని పట్టుకుని. "ఏమిటే నీ యిదీ?" అంది. పద్మ కొట్టడానికి వీల్లేక గిజగిజలాడుతోంది.

"పల్లెటూరి కొయ్యలు! ఓయబ్బో! చూసేమమ్మా జబ్బులు! ఇలాటి జబ్బులు చాలా చూశాం!...చూశావురా మాధవా దీని డిప్పకాయతనం! మనిద్దరం యిక్కడుండంగానే యిద్దర్నీ కొట్టి నంగనాచిలా వెళ్తోంది!" ఇలా అంటూండగానే పద్మ వొంగి అక్క చేతిని కరిచింది, "అమ్మో! కొట్లె కుక్కపళ్లు దీనికెవరిచ్చారమ్మా!" అని అక్క చెయ్యి విడిపించుకుని పద్మ వేపు కోపంగా చూస్తోంది.

పద్మ కదలక ఒక్కక్షణం నిలబడ్డది. ఈలోగా కిష్టుడొచ్చి దాని చేతులోని బెత్తం లాక్కున్నాడు. ఉమవెళ్లి పద్మ వీపుమీద రెండు కొట్టింది. కిష్టుడు బెత్తంతో పద్మని కొట్టాడు.

పద్మ మొదట ఉమమీద పడ్డది. గలాటా చేస్తూంటే కిష్టుడు కలిశాడు. అక్క చెయ్యి చూసుకుంటూంది; నేను కుర్చీలోంచి లేవలేదు. ఇంతట్లో పిన్ని వొచ్చింది. రౌద్రంగా కిష్టుణ్ణీ ఉమనీ తీసి విడిపించి విసిరికొట్టి, పద్మను చేత్తో పుచ్చుకున్నది.

"కొయ్యబొమ్మల్లా అలానించోకపోతే వొచ్చి విడిపించరాదూ? దాన్ది శరీరం కాదేం?" అంది లోపలికి వెళుతూ.

"మేం కొయ్య బొమ్మలం కావడం బాగానే వుందిగాని - ఆ పిల్ల పెద్ద రౌడీలా నలుగుర్నీ చావమోదిందమ్మా!" అంది అక్క. కాని ఆ మాటలు పిన్నికి వినబడేట్టు అనలేదు. అసలీవరకు ఆవిడ వంటింటికి పోయివుంటుంది.

అలా అంటూనే అక్క ఉమని లేవదీసింది. గోడకి గట్టిగా ఎత్తుకోవడం వల్ల వీపు గీసుకు పోయింది. దానికి నేనూ అక్కా విచారించేలోగానే కిష్టుడి దెబ్బలుకూడా చూశాం. ఇక వాటిని గురించి అనుకోవడం కూడా అనవసరమే గాని, అదంతా అయిన వెనక పిన్ని కూతుళ్లిద్దరూ బైటికి వచ్చారు.

అక్కవాళ్లిద్దర్నీ మొఖానే తిట్టింది. వాళ్లూ చీదరించుకుని వాళ్లిద్దర్లో వాళ్లే ఆడుకోడానికి నిశ్చయించారు. ద్వారం దాటి మెట్టుదిగి అవతలికి వెళ్లారు. మళ్లా మూడునాలుగు నిమిషాల్లోనే వొచ్చేశారు. వాళ్ల చేతుల్లో రెండు బెత్తాలున్నాయి. పొరుగింటి వాళ్లు పడదోయించుకున్న చింతచెట్టువి అవి.

రాంగానే వాళ్లని మేం ఏంచేసినా కొడతామన్నారు. దాంతో అక్కకి కోపంవచ్చి "కొడతారేం? ముందు ఆ రువ్వలు అవతల పారేయండి; లేకపోతే వీపులు చిట్లుతై!" అంది. అనడమేమిటి - చేతుల్లోవున్న రెండు రువ్వలూ తీసుకుంది.

దాంతో వాళ్లిద్దర్లో చిన్నపిల్ల ఏడుపు మొదలు పెట్టింది. "ఏడుస్తే ఏడవనీ గాని రువ్వలు మాత్రం యివ్వక క్కాయ్." అన్నాను.

ఆ పిల్ల మరీ యేడుస్తోంది.

ఇంతట్లో నాన్నొచ్చేరు. ఈ ఏడుపు చూడగానే అక్కవాళ్ల నేమిటో చేసిందనుకుని చీవాట్లేశారు. ఇంతట్లో ఉమ "నాన్నా! పద్మే, గిల్లేసింది నాన్నా!" అని చూపెట్తోంది.

"ఛట్! బడుద్ధాయిల్లారా!" అని నాన్న ఉమ చెంపకు కొట్టారు.

"నన్ను బెత్తం పుచ్చుకు కొట్టింది నాన్నా!" అన్నాడు కిష్టుడు నాన్న తన వేపు చూడగానే. వాడికీ ఒక చెంప పెట్టిచ్చి లోపలికి వెళ్లారు నాన్న.

రాత్రి భోజనాలయినాక అక్క నాన్నతో "పిన్నిని పంపెయ్యండి నాన్నా!" అంది. నాన్న సంగతేమిటని అడిగారు. అక్క చెప్పింది. దాంతో నాన్న కిష్టుణ్ణీ ఉమనూ పుచ్చుకుని ఎంతో విచారిస్తూ చివరికి పిన్నిని పంపెయ్యడానికి ఒప్పుకున్నారు.

* * *

సంవత్సరాలెన్నో గడిచాయి. మాకు జ్ఞానాలూ వొచ్చేయి. ఈలోగా పెద్ద

వాళ్లమూ అయినాం. నన్ను కలకత్తాలో చదివించుకు పంపారు నాన్న.

ఒకసారి సరిగ్గా సాయంత్రం ఏడున్నర వుతుంది; నేను నా గదిలో ప్రవేశించి లాంతరు వెలిగించి చదువు మొదలు పెటు తున్నాను; ఇంతలో రొప్పుతుంటూ ఒక వ్యక్తి నా గదిలో కొచ్చింది. తేరి చూస్తే ఎవరో కాదు; మా పక్కింటి బిమల్ ముఖర్జీ గారి దాసీది.

గబగబా బెంగాలీలో నేను వెంటనే రావాలన్నది. వాళ్ల అమ్మగారు ఆత్మ హత్య చేసుకుంది కేదో ప్రయత్నం చేసిం దట. బాబుగారన్నా ఊళ్లో లేరట. దాని కేమో భయం వేస్తోందట.

నాకూ భయం వేసింది. ఆత్మహత్యల్ని గురించి వినడమే గాని యింత సమీపంలో ఎన్నడూ చూడలేదు. అస్తవ్యస్తంగా బైలుదేరాను. గదిద్వారందగ్గిరకొచ్చి "ఛీ. బనీనుతో ఏమిటి? షర్టేసుకొస్తాను." అన్నాను.

"ఫరవాలేదు బాబూ! యిలాం టప్పుడా?...?"

నేను తువాలు తీసుకుని మీదవేసుకుని రూమ్‌కి తాళం వేసి బయటికొచ్చాను. బిమల్ ముఖర్జీ గారింట్లోకి నేనెన్నడూ వెళ్లలేదు. వెళ్లాను. ఓ రూమ్‌లో మంచం మీద పడుకుని ఉన్నారావిడ. చేతులు రెండూ కిందికి వ్రేలాడుతూ ఉన్నాయి. దాసీదానితో "ఆ చేతులు రెండూ మంచంమీద పెట్టు. నేను డాక్టరు దగ్గిరికి పోయివస్తాను" అన్నాను.

"పోయిరా అక్కర్లేదు బాబూ! ఫోను.." అని చూపింది.

నేనటు చూశాను. అదృష్టవశాత్తూ నాకు తెలిసిన ఓ పెద్ద డాక్టరుగారి ఫోన్ నెంబరు జ్ఞాపకం ఉంది. మ్రోగించాను. డాక్టరే పలికారు. విరుగుడొకటి చెప్తూ అది యిచ్చిన తరవాత తీసుకురమ్మన్నారు. తనకు తీరిక లేదట.

వెంటనే విరుగు డిచ్చాము. దాంతో ఆవిడ వెక్కుతూ ఏడుస్తూ మరేం మాట్లాడకండా పడుకోబోతోంది.

"టోంగా...అర్జంటుగా తీసుకురా!"

"ఎక్కడికి బాబూ!"

"పటల్‌డాంగా వీధికి!"

"అంతదూరం టాంగా వెళ్తుందాబాబూ! ఈలోగా ఏమౌతుంతో!"

"పోనైతే టాక్సీ తీసుకురా! అర్జంటుగా రావాలి."

టాక్సీలో ఆవిడను ఎక్కించే వరకు బ్రహ్మప్రయత్నమైంది. చివరికి రోదిస్తూ ఆవిడ ఎక్కింది. వెనకసీటులో పడుకున్నది. దాసీది ఊరుకోబెట్టటానికి ప్రయత్నిస్తోంది. టాక్సీ జోరుగానే పోతోంది.

విరుగుడు సంగతీ ఆవిడ చేష్టలసంగతీ డాక్టరుతో చెప్పాను. మరేమీఫరవా లేదనీ బ్రతుకునించి తప్పించుకోలేదని చెప్తూ ఒక అరగంట ఆగమన్నాడు.

ఆతరవాత వచ్చేశాం టాక్సీ వాలాకు డబ్బిమ్మనడానికి లోనికి వెళ్లాను. దాసీది తాళాలు తెచ్చి యిస్తూ బీరువా చూపెట్టింది.

భయంగా తెరిచాను. డబ్బుపెట్లో ఎంతో మూలుగుతూవుంది. టాక్సీవాలా బాకీ యిచ్చేసి తాళం భద్రంగా వేసి దాసీదానికిచ్చాను.

ఇంతవరకూ ఆవిడ నాతోగాని నేను ఆవిడతో గాని ఒక్కమాటకూడా మాట్లాడలేదు. మాట్లాడాలన్న ఉద్దేశం నాకులేదు. ఇంతకూ ఆవిడ దుఃఖిస్తున్నట్టుంది. మాట్లాడకుండానే యివతలికొచ్చేసి దాసీదానితో వెళ్తున్నానని చెప్పి గుమ్మందిగాను. దాసీది కృతజ్ఞతా సూచకంగా నవ్వింది.

* * *

గదిలో కొచ్చానేగాని చదవాలని ఏమీ కోరిక కలగలేదు. పుస్తకం విప్పి ఊసుపోని వాడిలా కాయితాలు తిరగ వేస్తున్నాను. ముఖంలో చిరునవ్వు, ందనీ, కళ్లల్లో తృప్తేదానికి కారణమనీ అప్పుడప్పుడు చూస్తున్న అద్దం చెప్తోంది. నాటిసాయంకాలపు సంఘటన అంతా నెమరువేసుకుంటున్నాను.

ఆత్మహత్యల్ని గురించి పుస్తకాల్లో చదవడమే గాని ప్రత్యక్షంగా మనుష్యులు ఒకొక్కప్పుడు తమ నీడలు చూసి తామే భయపడేటంతపిరికివాళ్లు. జీవితం అంటే ఏమిటి? ఇవాళ అనేది నిన్నటికి ఒకరోజు ముందునడుస్తుంది. నిన్నటివరకూ గల చరిత్ర యివాళ్లికి నీడే. ఆనీడ చూసుకుని, అమ్మో, ఇంత భయంకరమైందా జీవితమంటే?-యింత నీచమూ, యింత నలుపా, అని జడుసుకునేవాళ్లు ఆత్మహత్యా ప్రయత్నాని కొస్తారు. ఆత్మహత్యనుగురించిన వార్తలన్నిట్లోనూ జీవితం విసుగనిపించో, అసహ్యమనిపించో జరిగిన ప్రయత్నమనేది ఉంటోంది. అంటే? మనుష్యులు తమ నీడల్ని చూచుకు తామే భయపడేస్థితికి వచ్చారన్నమాట!

అమ్మ ఆత్మహత్య చేసుకుందని అక్క అంటుండేది. అవును మరి. నాన్నను అమ్మ చచ్చిపోయిందా నాన్నా అని అడిగితే లేదని నమ్మకంగా చెప్పేవారు. అమ్మ ఎక్కడికి వెళ్లిందని అడిగితే వొస్తుంది. ఏనాటికైనా తిరిగి రాకపోదు. ఆ మహా తల్లి-అనేవారు. తద్దినం పెట్టరు. కాని ప్రతీయేడూ చైత్రమాసం చివర ఓ

ముత్తయిదువకి చీరా రవికల గుడ్డా యిస్తారు. ఏమిటిదీని అర్థం? అమ్మ ఆత్మహత్య చేసుకునే చచ్చిపోయిందని అక్క చెప్పిందాయిరి. ఆత్మహత్య చేసుకున్న వాళ్లు తిన్నగా స్వర్గానికి వెళ్లరు; స్వర్గంలో ఉంటేనేగాని తద్దినం పెట్టిన ఫలం దక్కదు-అన్న నమ్మకంమీద నాన్న అలా చేస్తున్నారని తెల్తూనే ఉంది.

ఇలాగే ఏదో గొలుసులాగ ఒకదానిమీద యింకొకటి చొప్పున ఆలోచనలు వర్షంలా పట్టుకుని వొదలలేదు. ఆఖరికి ఆత్మహత్యతో ఆరంభమైనవి పూర్తిగా దూరమై ఏకంగా యింకో పథంలోకే వెళ్లిపోయాయి.

ఎనిమిదిన్నర అయింది; తలుపు చప్పుడైంది. తీస్తే మళ్లా పొరుగింటిదాసీది. ఆత్రంగానే వుంది.

"ఏంసంగతి? మళ్లా ఏమిటి?" అన్నాను ఆత్రంగానే.

"రావాలి. ఆవిడ చాలా కోపంగా వున్నారు."

"ఎందుకూ?"

"ఆవిడ చచ్చిపోతుంటే బ్రతికించామనిట! ఒక్కసారి మీరొస్తే..."

నాకు ఇదివరకటికంటె ఎక్కువ ఆశ్చర్యం కలిగింది. చేసిన పొరపాటును నూతిలో పడ్డావిడ చలెయ్యగానే గ్రహించినట్టు ఈవిడ కూడా గ్రహించి బ్రతికించినందుకు నాకూ దాసీ దానికీ యావజ్జీవమూ కృతజ్ఞత చూపించవలసింది; ఏమిటిదీ? ఇప్పుడా కోపంలో ఆవిడ తిట్టే తిట్లు తినడానికి వెళ్లనా?

"బాగానే వుంది." అంటూ చొక్కా వేసుకుని తాళంపెట్టి వచ్చాను.

ఇల్లంతా ఓపిక తెచ్చుకుని కలయజూస్తూ లోనికి నడిచాను. మహల్‌లావుంది. ముఖర్జీగారెంత ధనవంతులో ఎరక్కపోలేదు. కాని ధనవంతుల యింట్లో ఏమేముంటాయో అంత బాగా ఎరగను.

ఆవిడ గదిలోకి అడుగు పెట్టేపెట్టడంతో కాలికి జిగురులా అంటుకుంది. విదిలించుకునేవరకు ఒక పళ్లెంతగిలింది. ఇదేమిటని తలఎత్తి చూసేసరికి గది అంతా నానా హంగామాగానూ ఉంది. ఎదురుగా బెడ్ మీద ఆవిడ కూచున్నది. రెండు చేతులూ ముఖానికి ఎత్తిపట్టుకుని మూసుకుంది. ద్వారం దగ్గిర దాసీది నిలబడి "చూశారా బాబూ యీ పని?" అంది. "అన్నం పట్టుకొచ్చి పెట్టాను; విసిరేశారు!"

నాకేం పాలుపోలేదు. ఏం మాట్లాడనూ?

"ముందు నువ్వు అవతలికి వెళ్లబ్బాయీ! మా దుఃఖాలు మాకు చాలు. ఇంకేమీ చెయ్యనక్కర్లేదు -" అంది ఆవిడ బెంగాలీలో. ఆవిడస్వరం విరక్తిని ధ్వనిస్తోంది. కళ్లుమాత్రం విప్పలేదు.

నేను నిలబడే ఉన్నాను.

"బాబుగారు ఆగ్రావెళ్లి వారం రోజులైంది బాబూ! యివాల్టివరకూ ఉత్తరం లేదని చాలా కోపంగానే ఉన్నారు అమ్మగారు. ఇవాళ ఏదో ఉత్తరం వచ్చింది. మరి ఆ వుత్తరంలో ఏం రాసివుందో - సాయింత్రమల్లా కంటనీరుపెట్టుకున్నారు. నేను వంట గదిలో ఉండటంచూసి విషం పుచ్చుకున్నారు..." అని యింకా ఏమో చెప్పబోతోంది దాసి.

ఆవిడ తిన్నగా నాదగ్గిరకొచ్చి "నువ్వుపో!" అని ఆజ్ఞాపించింది.

నాకు భయంవేసి కదిలాను. వీధిగుమ్మం దగిరకొచ్చేసరికి దాసీది వెనకనే వస్తోందని తెలిసింది. "బాబూ! బాబుగారెప్పుడొస్తారో యిందు ఉంటుందేమో; కొంచెం చూసి అమ్మగారి కిలా వుందని రాయండి! మీ మేలు మరచిపోను." అంది ఓకవరు అందిస్తూ.

ఆత్రంగా దానిలోని కాగితాన్ని తీసి, మడతవిప్పి చదివేసరికి నాకు సంగతి అర్థమైంది. "మీ బాబుగారింక తిరిగిరారు. ఆస్తంతా అమ్మగారి పేర పెట్టేసిపోయారు. వీలునామా రేపేవస్తుంది" అన్నాను నిస్పృహతో; కాగితాన్ని అప్రయత్నంగా దాసీ దానికిస్తూ.

"ఆఁ!" అని తెల్లబోతూ కాగితం అందుకుంది దాసి.

* * *

పొద్దున్నే ఏడున్నరకి ప్రాక్టికల్ క్లాసుంది. తెల్లవారుజామున నాలుగుకి అలారం పెట్టుకుని ఆరింటివరకూ చదివాను. ముఖం కడుక్కుని స్నానంచేసే వరకు ఆరున్నర అయింది. మాష్టర్ చేత ప్రశ్నలడిగించుకుని తెల్లముఖంవేసే ఆవశ్యకత రాకుండా చూసుకుంది కని మరొకమాటు పుస్తకం తెరిచి చదువుతున్నాను. అది ఏడుదాకా సాగింది.

అప్పుడు పొరుగింటిదాసీది వచ్చింది. చచ్చానురా బాబూ, వీళ్లు నన్నువదిలిపెట్టేట్టు లేదే అనుకున్నాను. ఇంతలో చల్లగా "బాబూ! అమ్మగారు పిలుస్తున్నారు"అంది.

"ఎందుకూ?"

"పొద్దుటే లేచి ముహంకడుక్కొని, తిన్నగా డ్రాయింగ్ రూం కొచ్చేశారు బాబూ, అందుకే నేను ఆశ్చర్యపోతుండగా నన్ను పిల్చి, రాత్రి హాస్పిటలుకినన్ను తీసుకెళ్లిన కుర్రాడి యిల్లెక్కడే అని అడిగారండి. అంటే యిక్కడేనని చెప్పాను. నేను రమ్మన్నానని చెప్పి తీసుకురా అన్నారు. రాత్రి కోపానికి కొంచెం నొచ్చుకుంటారేమో నమ్మ అని నేను జంకుతుంటే ఫరవాలేదు తీసుకురా అన్నారు."

"కోపం లేదు?"

"ఎబ్బే! చాలా ఉషార్‌గా వుంటే!"

"తమాషాగా వుందే!

"రండిబాబూ!"

"నేనిప్పుడు క్లాసుకు పోవాలే! టైం లేదు; మధ్యాహ్నం వస్తానని చెప్పు.

"కాదు బాబూ, యిప్పుడే రావాలి. మీకు ఏ అదృష్టం పడుతుందో ననిపిస్తోంది." అన్నది దాసి.

దాని వెనకాలే నడిచివెళ్లాను.

డ్రాయింగ్ రూమ్ అంతా ఫస్తు ఐరోపీయంగా అలంకరించబడక పోయినా చాలవరకూ అంతే. ఇంటావిడ సోఫాలో కూచుని పత్రిక చూస్తోంది. కాని అది కేవలం ఊసు పోవటాకేనని చెప్పవచ్చు.

"అమ్మగారికి ప్రేమతో నమస్కారం." అన్నాను బెంగాలీలో.

తలెత్తి యిటు చూసి ఓ కుర్చీ చూపించి కూర్చోమంది. దాసీ దానితో టీ తీసుకు రమ్మని చెప్పింది.

"రాత్రి నేను చాలా కోపగించుకున్నాను. ఏమీ అనుకోకండేం ?" అంది.

"ఛాఛా? ఎందుకనుకుంటానూ? మొదట్లో అనుకున్నా అమ్మాయిగారు రాసిన ఉత్తరం చదివాక అంతా అర్ధమైంది. దుఃఖంలో మరేమన్నా అది మీ తప్పు కాదు." అన్నాను.

"అవునండి... ఒకొక్కప్పుడు ఆలోచనల వేగం ఎంత పని చెయ్యగలదో చూశారా మరి! తీరా ఆలోచిస్తే రాత్రి నేను చేసినపని మూర్ఖత్వమని నాకే యిప్పుడు సిగ్గుగా వుంది. మీరు నాకు రక్షకులు..."

"సర్వరక్షకుడు భగవంతుడు పైన ఉన్నాడు!"

"అది ఒట్టి తెలివితక్కువ. మనకున్న శక్తినంతట్నీ కాదని తూలగొట్టేసుకుని, మన అపారమైన యీ శక్తిని కంట్రోల్ చెయ్యటానికి వేరే ఓ మానవాతీతమైన శక్తి వుందనీ, దానిపేరు భగవంతుడనీ అనుకోడముందే, అది వొట్టి తెలివితక్కువ. నేను చచ్చిపోతూంటే మీరు రక్షించారుగాని ఆ భగవంతుడు నోరుమూసుకు కూర్చున్నాడే! మరి..."

"లేదండి. ఆ భగవంతుడే నాలో మిమ్మల్ని బ్రతికించాలన్న వుద్దేశాన్ని పెట్టి ఉంటే ?" అన్నాను.

"అదే! మీరు చేసినపనీ, మీ ఒరిజినాలిటీ, యివన్నీ భగవంతుడి కాళ్లమీద పడేసి చేతులు దులుపుకుని అంతా అయనే అనటం తెలివితక్కువ కాదూ మరి!"

"కాదులెండి."

"కాకపోయినా యిప్పుడు మీతో అందుగురించి వాదించేందుకు నేను అంగీకరించను. మరో అప్పుడు వాదనవేసుకుందాం లెండి."

నేను నవ్వి ఊరుకున్నాను. లోపల ఈ అకస్మాత్పరిచయం దేనికి దారితీస్తుందా అనుకుంటూ టీకోసం ఎదురుచూస్తున్నాను.

"—ఆయన తనదారి చూసుకున్నారా మరి! ఇంక యీ విశాలమైన "లోగిలీ"లో నే నొక్కర్తెనూ ఉన్నాను. యిలాగే ఉండాలన్న మాట. దుర్భరమనిపించింది. మీరు నా కొడుకులాంటివారు - మీతో నిజం చెప్పగలను. ఈ జీవితంలో నేను చేసిన వాట్లో ఒక్క మంచిపని కూడా లేదండి. ఎందుకింక, ఈ పాప చరిత్ర యింతటితో ముగిద్దామని పించి విషం పుచ్చుకున్నాను. రాత్రంతా ఏమైందో, చివరికి నేను చచ్చిపోవడానికి ప్రయత్నించడం వొట్టి తెలివితక్కువ అని తేలింది. నన్ను మృత్యు ముఖంలోనించి తీసుకువచ్చిన మీకు ఎలా నమస్కారం చెయ్యగలనా అని చూస్తున్నాను." అంది ఆవిడ; కొంచెం బాధలోంచొచ్చిన స్వరంతో.

"అబెబ్బే, అదేమిటీ ? నేను మీకన్నా ఎంత చిన్నవాణ్ణి!" అన్నాను.

దాసీది టీ తెచ్చింది.

"నేను మీకొకటి సజెస్ట్ చెయ్యవచ్చునా ?" అన్నాను.

"ఏమిటదీ ?"

"ఒంటిగా ఉండిపోవడం కష్టంగా తోచింది గనుక, ఆగ్రాలో వున్న మీ అమ్మాయిగార్ని పిలిపించుకోండి. లేకపోతే మీరే అక్కడికి వెళ్లిపోండి. మిగిలిన జీవితం అంతా హాయిగా గడపవచ్చు."

"అంతి సదుపాయాలు లేవండి. ఆ అమ్మాయి నాకూతురుగాదు!"

నేను లోపలే సవితికూతురుగా బోలను కొంటూ టీ తీసుకొంటున్నాను. ఆవిడా తీసుకొంటోంది. అంతా అయ్యాక "అమ్మగారూ! ఏడున్నరకి క్లాసుంది. వెళతా, మళ్లా వొస్తాను. శెలవిస్తారా ?" అన్నాను లేస్తూ.

"క్లాసా ? మీరీ వూళ్ళో చదువుతున్నారా ?"

"అవునండి."

"ఓహో, అయితే వెళ్లిరండి మధ్యాన్నం భోజనం యిక్కడ చెయ్యడానికి మీకేమీ అభ్యంతరం ఉండదనుకుంటాను!" అంది ఆవిడా లేస్తూ.

నేను తడబడ్డాను.

"ఫరవాలేదు. మరే చీకూ చింతా లేకండా వొచ్చేయండి."

తలవంచుకుని సరే నన్నాను.

*　　*　　*　　*

"మీది ఏ పరగాణా ? - యిలా అడిగానని మరోలా అనుకోకండి సుమీ! లాడ్జిలో ఉండి హోటల్లో భోజనం చేస్తూవుంటే అడిగాను."

"అన్నీ బాగానే ఉన్నాయిగాని పొద్దుట్నించీ నన్ను మన్నిస్తున్నారు. ఇది ఏమీ బాగులేదు. నాకు ఆయుక్షీణం కలగాలని మీ ఉద్దేశమా?" అన్నాను నవ్వుతూ.

"ఛఛ-పోనీ మన్నించవద్దంటే మానెయ్యగలను. మీది ఏ పరగణా?"

"ఎందుకులెండి; నేను బంగాళీవాణ్ణి కాను. తెలుగు దేశం వాణ్ణి."

ఒక్కమారు ఆవిడ ముఖంలో ఆశ్చర్యం చూశాను. "తెలుగువాడివా? అబ్బ! ఎన్నాళ్లకి మళ్లా నోటమ్మట తెలుగొచ్చింది!" అందావిడ తెలుగులో.

"అరి! మీరూ తెలుగువాళ్లే నన్నమాట. చిత్రంగా వుందే!"

"చిత్రం కాదూ మరి ? అయితే తెలుగు దేశంలో మీది ఏవూరు?"

"గోదావరి జిల్లాలో సామర్లకోట."

(47-వ పేజీ చూడండి)


# ప్రాప్తకాలజ్ఞుడు

వాస్తవంగా ఇందు శేఖరశాస్త్రి ఒక మాదిరిగా చదివే ఘటం. ఒక మాదిరిగా ఏం కర్మం? బాగానే చదువుతాడు. తప్పకుండా ప్యాసు కావలసినవాడు కూడా. అదీగాక ఇతర వ్యవహారాలేవీ అతనికి పట్టవు, అతని విషయాలు అతనికి తప్ప. కావాలని ఏ విషయాలలోనూ జోక్యం కలుగజేసుకోడు. ఒక వేళ అటువంటి గడ్డు సమస్య లేవైనా తనను ఎదుర్కొన్నా తుడుచుకుపోయే రకం.

ఇంటర్మీడియేటు ఫస్టు క్లాసు రావటం వల్లనే ఆనర్సు క్లాసులో సీటు దొరికింది. ఫస్టు క్లాసు రాకపోతే లాభంలేదు. నాకు ఆనర్సు చదువుదామని ఎంత అభిలాష ఉన్నా అది అలా చచ్చిపోవలసిందే. ఎందుచేతనంటే ఇంటర్మీడియేటులో నా కర్మ అలా కాలింది కనుక. అసలు శాస్త్రి చదువుతాడు, తప్పకుండా ప్యాసవుతాడనుకొనే ఇంటి దగ్గరవాళ్లు కొన్ని వందల మైళ్లు పంపించారు అతనిని.

ఇందుశేఖరశాస్త్రి మొట్టమొదటగా కాలేజీలో అడుగుపెట్టాడు. పెదవి విరిచాడు. ఎందుకో అతనికే అర్థం కాలేదు. ఆ పెద్దపెద్ద బిల్డింగులు, అడవిలా పెరిగిపోయిన చెట్లు, చుట్టూరా కొండలు - అన్నీ ఒక్కసారి తనవంక గుడ్లురిమి చూస్తున్నట్లనిపించింది. ఇక్కడ మూడు సంవత్సరాలుండాలి కాబోలు. గుండె అతివేగంగా కొట్టుకోసాగింది. తను మునుపు చదివిన కాలేజీ గుర్తుకొచ్చింది. సముద్రపు అరుపులు వినాలి కాబోలు మూడు సంవత్సరాలు, ప్రతిరోజు, ప్రతి నిముషంకూడా! ఇక్కడ ఊరికే ఉండటమైతే ఎన్ని సంవత్సరాలైనా ఉండవచ్చు. కాని చదవాలి గదా ప్రాణంపోయేలా,

అనుమానిస్తూనే కాలేజీలో చేరాడు. అన్నీ క్రొత్తపరిస్థితులు. అంతా క్రొత్త




వాతావరణం. ఏమిచేయాలన్నా తోచటం లేదు. బజారుకు పోదామంటే అది ఒక ఊరుకూడా కాదు. లైబ్రరీ ఉన్నదిగదా అనుకొని పోయాడు. ఆ పుస్తకాలు, బీరువాలు, దానిలో పనిచేసే మనుష్యులు, వాటన్నిటినీ చూసేసరికి శాస్త్రి కలవరపడ్డాడు. వెంటనే బయటకు వెళ్లిపోదా

మనిపించింది. కాని కొత్త పేపరు చూదామనే ఉద్దేశ్యంతో కూర్చుని, మధ్యాహ్నం రెండు గంటలకు వచ్చినవాడు సాయంత్రం అయిదు గంటలవరకు ఉండిపోయాడు.

రూముకు పోయాడు. మమ్మల్ని ఇక్కడకు తెచ్చి పడవేశావేమన్నట్లు చూస్తున్నయ్ రేక్ లోపలి పుస్తకాలు. చెప్పులు విడిచి కూర్చున్నాడు కుర్చీలో రెండు చేతుల మధ్యా తల ఇరికించుకొని. నేసీ కొండరాళ్లలో నడవలేనన్నట్లుగా ఉన్నదా చెప్పులజత.

మెల్లగా లేచి భోజనానికి పోయాడు. అబ్బె! వెధవ భోజనం అన్నం తింటున్నంతసేపు, ఇంటిదగ్గర భోజనం గుర్తుకు వస్తూనే ఉన్నది. ఇటువంటి అన్నం తింటూ మూడు సంవత్సరాలు గడితకాలి. పైగా రేషనింగు. వీళ్ళందరూ ఈ అన్నం తిని ఎలా జీవించగలుగుతున్నారూ? అని తన్ను తానే ప్రశ్నించుకొన్నాడు. ఇతరులను ప్రశ్నిస్తే వచ్చే సమాధానం అతనికి తెలుసు గనుక.

ఆరాత్రి అవిశ్రంగా ఆలోచిస్తూనే నిద్రపోయాడు. ప్రొద్దున్నే లేచాడు. కాలకృత్యాలు తీర్చుకోవాలన్న విషయం

# "అమరశ్రీ"

మాత్రం అతను మర్చిపోలేదు. స్నానాలగదిదగ్గరకు పోయాడు. ఒక్కొక్క బాత్ రూమ్ ముందు పాతిక సబ్బుపెట్టెలున్నయ్. వెధవ క్యూ. స్నానంచేసే చోటకూడ 'క్యూ' యే. తన ఇంటిదగ్గర విషయం వెంటనే గుర్తుకొచ్చింది. రోజూ, ప్రొద్దునా సాయంకాలం కూడా అను ఇరవై బిందెల నీళ్లు పోసుకొనేవాడు. ఇక ఆఆట సాగదు. అంతవరకూ ఎందుకు? స్నానం లేకుండా ఎన్ని రోజులు గడపాలో! ఏ విషయం కూడ నచ్చలేదు ఇందుశేఖరశాస్త్రికి. ఆ విధంగా ఆలోచిస్తూనే బాత్ రూమ్ ముందర కూర్చున్నాడు. లోపలనుంచి బయటకు వస్తున్నారు. బయటనుంచి లోపలకు పోతున్నారు.

ఎనిమిదిన్నరయినా కూడ తనవంతు వచ్చేలా కనుపించలేదు. పైగా తొమ్మిది గంటలకు నీళ్లు కట్టివేయటం కూడా జరుగుతుందట. కాళ్లు పీక్కు పోతున్నయ్. మరో నాలుగు కట్టించకూడదూ? వాళ్ల సొమ్మేం పోయింది? 'ఎస్టాబ్లిష్ మెంట్' ఛార్జి కాజేస్తున్నారుగా.

అసలే బాధగా ఉంది. బాత్ రూముల నుంచి వినవచ్చే పాటలు శాస్త్రిని మరీ చికాకు పరుస్తున్నయ్. లోపలకు పోయిన వాళ్లు మెల్లగా స్నానం చేసిరాక, ఏదో జీవితంలో పెద్దదానిని సాధించినట్లుగా ఫీలయి, ఈలపాటలు జోలపాటలు పాడుకుంటుంటే ఇందుశేఖరశాస్త్రికి తలకాయ నొప్పి మరీ హెచ్చింది. కనీసం అమృతాంజనండబ్బాలన్నా దొరకవు కొనుక్కోటానికి. గుండుసూది కొనాలన్నా నాలుగు మైళ్లు పరుగెత్తాలన్న విషయం ఇందుశేఖరశాస్త్రికి అదివరకే తెలుసు.

"బ్రతుకలేనే నినూ బాసీ ప్రేయసీ" అంటున్నాడు బాత్ రూములోనుంచీ ఒక పురుషుడు. మరోదానిలోనుంచీ "ఓ దూర్ జానేవాలే" పెద్దగా వినిపిస్తోంది. స్నానం లేకపోతే పోయింది. లేచి రూముకు పోదామనుకున్నాడు ఇందుశేఖరశాస్త్రి. కాని రోజుకు మూడు నాలుగుసార్లు స్నానంచేసే ప్రాణిగా మరి! 'ఈ ప్రేమ' అన్నేది, ప్రపంచంలో ఉన్న జీవులందరకూ' ఎప్పుడూ, ప్రతిచోటా కూడ ఎందుకు పట్టుకుంటుందో అర్థం కాలేదు నేటివరకూ శాస్త్రికి. ఇకముందైనా అర్థమవుతుందన్న ఆశకూడ లేదు. మరొక రూమునుంచీ "యే జిందగీకి మేలా" ఖంగున మ్రోగుతూంది. స్నానం చేయగలగటంకూడ ఏరోజు కారోజు అదృష్టంక్రింద మారింది.

ఇటువంటి విషయాలెన్నో ఆలోచిస్తూ కూర్చున్నాడు. ఎనిమిది గంటలయింది. నీళ్లు రావటంలేదు. ఆవురుమని ఒక్కసారి ఏడుద్దామనుకున్నాడు శాస్త్రి. అంతగా బాధపడ్డాడు పాపం. ప్రొద్దున లేచినప్పటి నుంచి కావలి కాస్తేనే దిక్కు లేదు. ఇక ప్రతిరోజు స్నానంచేసే దెలాగూ అర్థం కాలేదు. నిజానికి తనకు రావటానికి ఖష్టు కాసే వచ్చింది.



మెల్లగా సబ్బుపెట్టె, అర్ధరూపాయి పెట్టి కొన్న డబ్బా పట్టుకొని రూముకేసి నడిచాడు. గుడ్డలు మార్చుకొని బయటపడే సరికి ఎనిమిదిన్నరయింది. 'మెస్' వైపు నడిచాడు కాఫీ అన్నా ఇస్తారేమోనన్న ఆశతో. కాని ఇస్తారనే నమ్మకం మాత్రం లేదు. అనుకున్నంత పనీ జరిగింది. 'కాఫీలేదు' అన్నాడు అయ్యర్ మర్యాదగా. మళ్లా రూముదారి పట్టాము.

ఇందుశేఖరశాస్త్రికి ఇప్పుడొక పెద్ద సందేహం కలిగింది? ఇటువంటి కొళ్లులో జీవిస్తూ చదవటం ఎలాగు? ఏ మాత్రమూ చదువు సాగదు. కాబట్టి టి. సి. తీసుకొని ఇంటికి నడవటం మంచిది. లక్షణంగా బి.ఏ. చదువుకొని ప్రాప్తముంటే ఎమ్.ఏ.కు మరో యూనివర్సిటీకి పోవటం మంచిదనుకున్నాడు. హోల్డాలు చుట్టివేశాడు. పెట్టెకూడ సర్దిపారేశాడు. కాని పోతే ఏం జరుగుతుంది? వెధవ ప్రశ్న! ఇటువంటివే వెలుగుతుంటయ్ ఇందుశేఖర శాస్త్రికి ఎప్పుడూ కూడ. 'లాజిక్'లో ఏమాత్రం ప్రవేశం లేకపోయినప్పటికీ, ఇస్త్రీకి వేసిన గుడ్డలు ఉతకనివ్వకుండానే డబ్బిచ్చుకుంటూ తిరిగి తీసుకొని పెట్టెలో కుక్కాడు.

టి. సి. తీసుకోవటం ఒక్కటే మిగిలిపోయింది. ఆఫీసుకు బయలుదేరాడు. 'క్లర్కు' అడిగాడు వెళ్లిపోవటానికి కారణమేమిటని. ఏదో కారణం కల్పించాడు శాస్త్రి "మళ్లీవస్తే చేర్చుకోరు" అన్నాడు 'క్లర్కు'. "మళ్లా ఎవడు రాబోయాడోయ్" అని మనసులో అనుకుంటూనే తల ఊపాడు. "ప్రిన్సిపాలుగారు వచ్చిన తరువాత ఇస్తాము" అన్నాడు. శాస్త్రి తెల్లబోయాడు.

మధ్యాహ్నం మెయిలుకు వెళ్లిపోదామనుకున్నాడు. కాని పోనిచ్చేలా కనుపించలేదు. టి. సి. కావాలంటూ ఒక అప్లికేషను వ్రాసి 'క్లర్కు' కిచ్చి ప్రిన్సిపాలు వచ్చిన తరువాత మాట్లాడి కాగితాలన్నిటినీ సిద్ధంగా ఉంచమని మరిమరీ ప్రాధేయపడి భోజనానికి బయలుదేరాడు. అదే చివరిసారి భోజనమనుకుంటూ ముగించుకొని మళ్లా ఆఫీసుకు వచ్చాడు.

ప్రిన్సిపాల్‌గారు రాలేదు. అసలు వస్తారా? ఎవడు చెప్పగలడా విషయం. రోజూ మామూలుగా వస్తూఉంటారా? ఎవడూ చెప్పలేరు వస్తుంటాడో, లేదో. పోనీ ఈ ఒక్కపూట క్లాసుకు పోదామని పోయి కూర్చున్నాడు. అప్పటికే మరొక పెద్దమనిషి కూర్చున్నాడు. అనర్సు ఇంగ్లీషువాళ్లు ఇంతే కాబోలు ననుకొని తనుకూడ చదికిలబడ్డాడు. గంట కొట్టారు. ప్రొఫెసర్ వచ్చాడు. మరోవైపునుంచీ నలుగురు లేడీ స్టూడెంట్స్ వచ్చారు. శాస్త్రికి ముచ్చెమటలు పోసినయ్. అనర్సు ఇంగ్లీషు క్లాసులో నలుగురు ఆడవాళ్లు ఇద్దరు మొగవాళ్లు అని తెలిసిన తరువాత శాస్త్రికసలు అక్కడ కూర్చో బుద్ధిపుట్టలేదు.

ప్రొఫెసర్ ఏదో చెప్పుకుపోతున్నాడు. శాస్త్రి తన ఆలోచనలో తను పడిపోయాడు. ఆలోచనాశక్తి ఎక్కువగా ఉన్న మానవులు జీవితంలో ఎక్కువ బాధలపాలు కావాలి. శాస్త్రికి మాత్రం ఇటువంటివేమీ వినపడవు.

ఒక్కొకపుడు శాస్త్రికి చాల వింతవింత ఆలోచనలు కలుగుతయ్. ఆ 'లేడీ స్టూడెంట్స్'ను చూడగానే 'ఇదంతా సమానత్వం కాబోలు' ననుకున్నాడు శాస్త్రి. పార్కుల్లో, క్లబ్బుల్లో, కాలేజీలలో ఉద్యోగాలలో స్త్రీకి పురుషుడికున్నంత ప్రాతినిధ్యమూ ఉండాలి. బాగానే ఉన్నది అంతవరకు. కాని శాస్త్రికి పెద్దపెద్ద అనుమానాలు కలగటం మామూలు. పార్కులు చాల ఊళ్లలో స్త్రీల కొకరోజు ప్రత్యేకించబడతయ్. ఆ రోజు స్త్రీలు తప్ప మరెవరూ పార్కులో అడుగు పెట్టటానికి వీల్లేదు. కాని వారంలో మిగిలినరోజులలో స్త్రీలు రాగలిగితే రావచ్చు. చాల పట్టణాలలో కూడా ప్రస్తుతం అమలులో ఉన్న ఆచారం ఇది. స్త్రీలు అన్నిరోజులూ పార్కులో తిరగవచ్చు. కాని స్త్రీలకు ప్రత్యేకించబడిన రోజున మాత్రం పురుషుడు వెళ్లటానికి వీల్లేదు. దానిలో 'సమానత్వం' అనేది ఎంతవరకూ ఉన్నదో శాస్త్రి సులభంగా గ్రహించగలిగాడు. ఈ సమాజం, ఇరవైయవశతాబ్దపు సమాజం, ఇటువంటి 'సమానత్వాల'తో నిండికుళ్లుతో ఉండికూడ, ఇదంతా 'నాగరిక త'ని ఏ విధంగా అంటుందో బోధపడలేదు శాస్త్రికి. ప్రతి విషయంలో కూడ ఇటువంటి అవకతవకలే. కాగా ఇది కూడ ఒక నాగరికతేనని రొమ్ము విరిచి చెప్పుకుంటారు, అందులో ఎక్కువగా ఆంగ్లవీరులు.

ప్రొఫెసరు అంతా చెప్పేసి, 'ఇప్పుడు నేను చెప్పినదంతా ఉపోద్ఘాతము'న్నాడు. శాస్త్రికి మరీ భయం పుట్టింది. "ఈ ఉపోద్ఘాతమే బంగాళాఖాతమంత ఉన్నదే.." తరువాత ఆలోచనకూడ పుట్టలేదు శాస్త్రికి.

గంటకొట్టారు. బయట పడదామనుకుంటున్నాడు. "ఏమండోయ్" అని పిలిచారు వెనకనుంచి ఎవరో. ఆ నలుగురిలో ఒకామె దగ్గరగా వచ్చింది. శాస్త్రి ఆశ్చర్యానికి అంతులేదు. "పుస్తకాలేం కొనాలో వ్రాసుకుంటే ఒక్కసారి ఇస్తారూ. వ్రాసుకొని రేపు తిరిగి ఇస్తాము" అన్నదామె. "లేదండీ వ్రాసుకోలేదు. అన్నాడు శాస్త్రి" తన ప్రక్కన అంతవరకూ కూర్చున్న సోదరుడు ప్రారంభించాడు మళ్లా. ఈమధ్య బయటపడ్డాడు శాస్త్రి. ఇదంతా ఒక క్రొత్తప్రపంచంలా కనుపిస్తోంది, శాస్త్రికి. చాల అగమ్యగోచరంగా ఉన్నది ఈ లోకమంతా. అంత తలనొప్పితో 'క్లర్కు'ను చేరుకున్నాడు. ప్రిన్సిపాల్ అప్పటికే వచ్చాడు కాని 'క్లర్కు' మాత్రం తన విషయం చూడలేదు. "దేవుడు వరమిచ్చినా పూజారి ఇవ్వ"డన్న

ట్లుగా ఉన్నది ఈ విషయం చూస్తుంటే.

"ఏముందీ నా విషయం" అన్నాడు శాస్త్రి వినయంగా. "ఇదుగో, ఇప్పుడే నీ విషయం అనుకుంటున్నానండీ. పోయొస్తాను." అంటూనే నా అప్లికేషన్ చేతబట్టుకొనిపోయాడు. ఆ పది నిముషాలు శాస్త్రి నానా అవస్థలూపడ్డాడు. ప్రిన్సిపాల్ ఎక్కడ పిలుస్తాడో, ఏమని అడుగుతాడో ఏమి సమాధాన మివ్వాలో, ఎలా మాట్లాడితే టి. సి. సంపాదించగలుగుతామో ననుకుంటుండగానే 'క్లర్క్' తిరిగివచ్చాడు. శాస్త్రి మాట్లాడకుండానే ప్రిన్సిపాల్ గది దగ్గరనుంచిఆయనకుర్చీవరకుఅనుసరించాడు.

'టి. సి.' 'కాన్డక్టు సర్టిఫికెట్' అన్నీ వ్రాసిస్తూ మళ్ళీవస్తే చేర్చుకోమని చెప్పమని చెప్పాడు' అన్నాడు క్లర్కు. "మళ్లా ఈ వెధవ నరకంలోకి చస్తే వస్తానా?" అందా మనుకున్నాడు. కాని వాటిని తీసుకున్న సంతోషంలో మునిగిపోయి మాట్లాడకుండానే సామానుతో పాటు స్టేషన్ చేరుకున్నాడు.

స్టేషన్ చేరుకున్నప్పటినుంచీ శాస్త్రి మనస్సు క్రమక్రమంగా మారసాగింది. చదువుదామని, అందరిలోనూ గొప్పగా కనుపించాలనే ఉద్దేశ్యాలతో వచ్చి తిరిగి పోవటమేమిటి? అర్థం ఉన్నదా ఏమైనా? తోచటంలేదు. ఇప్పుడేమనుకుంటే ఏం లాభం? మొదట్లోనే ఉండాలి, ఈమనస్సు. అంతా గతించినతరువాత ఏమనుకొంటే ఏమున్నది? పోనీలే, మనకీ చదువు ప్రాప్తం లేదు. లక్షణంగా బి. ఏ., చదువుకొని ఎమ్. ఏ. కు మద్రాసు యూనివర్సిటీకి పోవచ్చుననుకొని తన్ను తాను ఊరడించుకొన్నాడు.

బండి వచ్చింది. రైల్వేకూలీ వచ్చాడు. సామాను లోపల పడవేశాడు? తనుకూడ సామానులానే, సామానుప్రక్కనే కూలబడ్డాడు. సిగ్నలు ఇచ్చారు కాబోలు ఇంజను కూసింది ప్రాణమున్న జంతువులా. గార్డు జండా ఊపాడు. అటువంటపుడు బండి కదలక మానుతుందా?

ఇంతలో ఎవరో ఒకాయన పరుగెత్తుకుంటూ గేటులో నిలబడ్డ టికెట్ కలెక్టర్ ఆపుతున్నకొద్దీ, బండిలో మనుష్యులు అరుస్తున్నకొద్దీ వినకుండా బండి ఎక్కబోయాడు. కాని ఎక్కలేకపోయాడు. లోపలివాళ్లు పెద్దగా అరుపులు ప్రారంభించారు. అప్పటికీ ఊరుకోలేదు. వేగం హెచ్చిన తరువాతకూడ. ఎలాగైతేనేం? ఎక్కాడు ఆడవాళ్ల పెట్టెలో.

వెంటనే బండి ఆగిపోయింది. పాపం! అతనిని, దించి, నానాతిట్లూ తిట్టారు. ఆడవాళ్ల పెట్టెలోకి ఎక్కగూడదుట. అసలు బండి కదిలినతరువాత బండి ఎక్క ప్రయత్నించటమే తప్పు. అందులో ఆడవాళ్ల పెట్టెలో ఎక్కటమంత నేరం సహించరానిది, క్షమించరానిది కూడ. "నీకు ఆడవాళ్ళు లేరూ? తోబుట్టువులు లేరా?" అని ప్రశ్నించారు, కొందరతనిని. ఇంతలో గార్డు, వాళ్లందరూ వచ్చి ఏవేవో మాటలన్నారు. అతనెటువంటివాడో వీళ్లకేం తెలుసు.

అసలు ఏది న్యాయం? ఏది సభ్యత? ఆడవాళ్ల పెట్టెలోకి మగవాడు ప్రమాదవశాత్తునైనా ఎక్కగూడదు. కాని మగవాళ్ల పెట్టెలోకి ఆడవాళ్ళు, ఇష్టంవచ్చినప్పుడు, ఇష్టం వచ్చినట్లు దూరవచ్చు. కాని పురుషుడు మాత్రం ఆ పని చేయగూడదు. అదొక క్షమించరాని నేరం. ఇదే సమానత్వం. ఇదే సభ్యత. ఇదే అభివృద్ధి చెంది పూలు పూసి, కాయలు కాస్తున్న మన నాగరికతాచిహ్నం.

అందుచేతనే శాస్త్రి మాట్లాడకుండా కూర్చున్నాడు. తన విషయాన్నే తను సరిదిద్దుకోలేని పరిస్థితిలో ఉన్నాడు. కాని తను రేపు తన ఊరు జేరుకున్నమీదట ఏం చేయాలో ఆలోచిస్తున్నాడు శాస్త్రి. తండ్రి ఎదురువస్తే ఏంచెప్పాల? తల్లి నెలా సమాధాన పరచాలి? స్నేహితు లేమంటారు? తన నింతవరకు ఒక వ్యక్తిగా పరిగణించే వారేమంటారు? వీళ్లందరకూ ఏమని సమాధానం చెప్పాలి? తను వచ్చినందుకు ఏం కారణం చూపాలి? పైన పండుకొన్నవాడు కాస్తా లేచికూర్చున్నాడు.

మరునాడు ఇల్లు జేరుకున్నాడు. ఎవరితోనూ ఏమీ మాట్లాడలేదు. తండ్రి ఊళ్లో లేడు. ఊరికే 'వచ్చా'నని చెప్పి తల్లినుంచి తప్పించుకున్నాడు. కాలేజీలో ఉన్నపుడు రావటానికి ఎంతగా ఆరాటపడ్డాడో అంతగా ఆరాటపడుతున్నాడు మళ్ళీ పోవటానికి. కాని "మళ్ళీ వస్తే చేర్చుకోమని చెప్పమన్నాడని" 'క్లర్క్' చెప్పిన మాటలు శాస్త్రి చెవులలో గింగురుమంటూనే ఉన్నయ్.

ఆ పరిస్థితులలో మళ్లా మూటా ముల్లె సర్దుకొని బయల్దేరాడు. ఈసారి మళ్ళీ చేర్చుకుంటారా? చేర్చుకోరనుకుంటూనే బయలుదేరాడు. ఒక పని కాదనుకుంటూ కూడా దానినే సాధించటంకోసం బయలుదేరేవారిలో శాస్త్రి కూడ ఒకడు.

శాస్త్రి నిజానికి తెలివిగలవాడే. అందుచేతనే ఇంటర్మీడియెటులో ఫస్టు క్లాసు వచ్చింది. ప్రిన్సిపాల్ గారింటికీ, ప్రొఫెసర్ గారింటికీ తిరిగి, మళ్లా సీటు సంపాదించుకోగలిగాడు. హాస్టల్లో సీటుకోసమని వార్డెనుగారింటిచుట్టూ తిరిగాడు విసుగుపుట్టినా కూడా లెక్కచేయకుండా.

కాలేజీలో జేరాడు ఎలాగైతేనేం, చావు దప్పి కన్ను లొట్టపోయి. మన వాడి తెలివితేటలు చూసి వాళ్ళందరు శాస్త్రిని హాస్టల్ సెక్రటరీగా ఎన్నుకున్నారు. విద్యార్థుల తరఫున సంవత్సరమంతా హోరాహోరీగా పోరాడాడు. వార్డెనుకు శాస్త్రి అంటే గొంతువరకూ ఉన్నది. విద్యార్థులపట్ల అంత భక్తిశ్రద్ధలు కనుపరచినందుకు మరుసటిసంవత్సరం 'కాలేజీ విద్యార్థియూనియన్' సెక్రటరీగా ఎన్నుకున్నారు. ఈసారి ప్రొఫెసరుగారితో దెబ్బలాడాడు. విద్యార్థు లందరూ శాస్త్రికి బ్రహ్మరథం పట్టారు. విద్యార్థుల హక్కులకోసం పోరాడిన వీరుల 'లిష్టు'లో శాస్త్రి పేరు కూడా జేరింది.

అదిచూసి మరుసటి సంవత్సరం శాస్త్రిని 'ప్రెసిడెంట్' చేశారు. 'ఎలక్షన్'లో గెలిచాడు. 'ఎలక్షన్ మానిఫెష్టో'లో వ్రాసిన ప్రకారం రాత్రిపూట లైబ్రరీ తెరిపించాలని ఆందోళనచేసి తెరిపించాడు. ఇలాటివి ఎన్నో చేశాడు. ప్రొఫెసర్లతో ఎంతగా పోరాడాడో, అంత గౌరవాన్ని సంపాదించగలిగాడు విద్యార్థులలో. దీనికంతకూ తన తెలివే కారణం. అందుచేతనే అద్భుతంగా వ్రాశాననుకున్నాడు. వ్రాశాడు కూడా.

ఫష్టు క్లాసు వస్తుందనుకుంటూ ఇంటికి పోయాడు. ఎన్నో కలలుకన్నాడు. నిద్రపోతుంటే ఎవడో స్నేహితుడు వచ్చి 'రిజల్ట్సు' వచ్చాయని చెప్పి లేపాడు. కళ్ళు నులుముకుంటూ పోయి 'హిందూ' చూశాడు. నంబరు లేదు ఫష్టు క్లాసులో. మెయిలులో బాగా ఉంటాయని అనుకొని చూశాడు. 'రికమెండెడ్' బి. ఏ. ఇచ్చారు తనకు. ఒక్క పిచ్చినవ్వు నవ్వాడు! శాస్త్రి దీనికంతకూ ఒక్క తన తెలివితేటలే కారణమని గ్రహించగలిగాడు శాస్త్రి ఆ సమయంలో.

ఒక్కసారి ఆకాశంవంక చూశాడు. సూర్యుడివైపు చూశాడు. సముద్రంకేసి మరోసారి చూశాడు. చంద్రుడిలోకి చూశాడు. వీటి ముందు ఆ డిగ్రీ ఎంత? వీళ్ళ డిగ్రీలు కాదుగా తన విజ్ఞానానికి కొలతబద్దలు. ఈ డిగ్రీలు ప్రొఫెసర్లకీ మనకీ మధ్య ఉన్న సంబంధాన్ని మాత్రం తెలియజేస్తాయనుకుంటూ ఒక పిచ్చినవ్వు నవ్వుకున్నాడు. ఇంకా నవ్వుతూనే ఉన్నాడు కూడా. ★

# పాతబాకీ

శ్రీ తూములూరు వెంకటశాస్త్రి

ఆ రోజు ఆదివారము. సంత వుందని బావగారి వూరు బయలుదేరాడు రామన్న. దారిపొడుగునా యింటి యిబ్బందులు, పసిపిల్లడితో బాలింత అయిన తన భార్య యిబ్బంది, తలచుకుంటూ తొందర తొందరగా తిరిగిరావాలనే వుద్దేశంతో చరచరా పోతున్నాడు.

బావగారియింటికి చేరేటప్పటికి బారెడు ప్రొద్దున్నది. కాళ్లు కడుక్కోటానికి నీళ్లందించింది చెల్లెలు. కుశలప్రశ్నలు జరిగిన మీదట, 'బావ యెక్కడికి పోయాడమ్మా' అని అడిగాడు.

"ఇప్పుడే సంతదాకా పోయివస్తానని పోయాడు. పాడిగేదె మంచిది ఏమైనా దొరుకుతుందేమోనని."

"నేనూ సంతకెళ్ళాలి. అయితే పోయివస్తా" అంటూ మంచినీళ్లు త్రాగి లేచాడు.

బావమరదులిద్దరూ సంతలో కలుసుకొని మాట్లాడుకుంటూ సరైన బేరం కుదరనందున సంత అయిపోగానే యింటిముఖం పట్టారు.

"ఏం బావా...గేదె కోసమేనా? నేనిస్తానన్నాగా, మా యింటి గేదెను."

"సరే మంచిదే కాని, నిన్ననే వస్తానంటివే రాలేదేం?"

"వద్దామనుకున్నా. గేదె తప్పించుకుపోతే, దానికోసం తిరగడంతో సరిపోయింది, బావా."

అట్లా మాట్లాడుకుంటూనే యింటికి చేరారు.

సీనయ్యకు సంతానము లేకపోయిన చింత ఒకటే. కాని, ఇల్లు, వాకిలి, స్వల్ప భూస్థితి కలిగి, తనొక పలుకుబడిదారుగా వున్నాడు. కాని పైస అంటే పదహారు ముళ్లు వేసేరకం.

"ఇక నేను పోయివస్తా బావా" అని మూట సర్దుకుంటున్నాడు. సీనయ్య వినీ విననట్టు అటు తిరిగి ఏదో పనిచేస్తున్నాడు. ఇదంతా చెల్లెలు గమనిస్తూనే వుంది. కాని, వుండమని తను చెప్పడానికి స్వతంత్రము లేదాయె. అప్పు డేమనకపోయినా, తరువాత చీవాట్లు పడాల్సివస్తుంది. 'వెళ్ళివస్తా' అని పిలిచిన రెండవపిలుపు, విన్నట్టుగా బావమరదివైపు తిరిగి చూచాడు.

"ఏమంత తొందర. ఈపూట యిక్కడే వుండు. చీకటిపడుతూందికూడా. ఇప్పుడు పోకపోతే యేమంత మునిగింది; సరే కాని పనిమీద బజారుకు వెళ్లివస్తా యిప్పుడే. ప్రయాణము ఆపు," అంటూ పైపంచ వేసుకొని బైటపడ్డాడు.

ఆరోజే ఎంత ప్రొద్దుపోయినా వస్తానని చెప్పివచ్చాడు రామన్న. చెల్లెలి బలవంతముమీదనైతేనేమి, అప్పటికి ప్రొద్దు క్రుంకటవల్లనైతే నేమి, చెల్లెలి యింట్లో మకాం తప్పదనుకుంటున్నాడు.

భర్త బైటికి పోగానే, వంటింట్లోంచి వరండాలోకి వచ్చింది రంగమ్మ. అన్నను ప్రయాణం చేయవద్దని బ్రతిమిలాడింది. "ఆయన వుంటేగా పల్లెత్తుమాట మాట్లాడటానికి వీల్లేదాయె, యీపూట వుండిపో. బావగారుకూడా వుండమన్నారుగా! యింకేం యీపూట వుండిపోవచ్చు" అని బలవంతము చేసింది.

"ఉండటానికేమిగాని, బ్రహ్మాండంగా వాన వచ్చేటట్లుంది; ఇంట్లో యిబ్బందులు నీకు తెలియనివేమున్నవి. రెండునెలల పసికూనతో అదొక్కతే యింట్లో వున్నది. దాని ఒంట్లో కూడా సరిగాలేదు. ఇంట్లో పనికి-గొడ్డూ గోదా సవరించుకోటానికి ఎంత యిబ్బంది, రాత్రికి గేదెను పాలుతీసేవారు లేరు. 'చిన్ని' వుందనేకాని దానికేం తెలుసు పసిపిల్ల. వీళ్లతో ఎట్లా ఇబ్బంది పడుతుందో" అని యిబ్బందులు వెళ్లబుచ్చాడు.

సీనయ్య యింటికి చేరేటప్పటికి చాలా ప్రొద్దుపోయింది. బావమరదులిద్దరికీ నీళ్లు పోసుకోటానికి, నీళ్లు తోడియిచ్చింది. నీళ్లు పోసుకొని వచ్చేసరికి వడ్డించి సిద్ధంగా వున్నది రంగమ్మ. భోజనము చేస్తున్నప్పుడు మజ్జిగన్నం సమయానికి సీనయ్యకు, గేదె సంగతి జ్ఞాపక మొచ్చింది.

"మజ్జిగనీళ్లకు మరీ యిబ్బందిగా వుంది, బోడిగేదెను తోలుతానంటివే మరెప్పుడు?"

"గేదకేం భాగ్యం! రేపీ పాటికి తోలనూ...మళ్ళీ సంతకు వచ్చేటప్పుడు తోలుకవస్తా."

భోజనాలు అయినతర్వాత అరుగుమీద కూర్చొని చెరొక ఛటాకు చుట్ట వెలిగించి, మాట్లాడుకుంటున్నారు. పాలేరుచేత మిద్దె మీదికి మంచాలు పట్టించి, పక్కలు అమర్పించారు. పదిగంటలు దాటింది. తిన్నగా పైకి వెళ్లి పండుకున్నారు. మాటల సందర్భంలో రామన్న, తన కివ్వవలసిన డబ్బు సంగతి జ్ఞాపకం చేశాడు. అంటే గొడ్డూ గోదా మారుబేరారు చేసి సంపాదించినది. తనవద్ద వుంటే ఖర్చు అవుతుందని బావవద్ద వుంచమని ఆరేళ్లనాడు నోటుగానే యిచ్చాడు. పెండ్లిదగ్గరకు వచ్చిందని యిట్లా అన్నాడు రామన్న.

"చిన్ని పెండ్లి అనుకుంటున్నా. ఖర్చులకు చేతిలో చిల్లిగవ్వలేదు. వున్నది కాస్తా మొన్న పురిటికే అయిపోయింది. యిబ్బందిలో వున్నా. కొంత డబ్బుయివ్వాలి బావా? లేకపోతే నేనిబ్బందిపడవలసివస్తుంది."

"నెలరోజు లుందిగా...అప్పటికి పత్తి యింటికి వస్తుంది. అది అమ్మిఅయినా ఇస్తా సగమైనా."

ఇట్లా ఒక గంటకాలం మాటలతో కాలం వెళ్లబుచ్చి మాట్లాడుతూనే నిద్రలో నిమగ్నులైనారు.

.....................

కోడి కూసింది. అప్పటికింకా చంద్రుడు చిరునగవుతో తొంగి చూస్తున్నాడు. కోళ్ల కూతలకు, కుక్కల మొఱుగులకు రామన్న మేలుకొని నలువైపులా చూశాడు. బావగారు గుఱ్ఱుపెట్టి నిద్రపోతున్నాడు. తెల్లవారలేదు సరిగా. మరల పరుందామని తలవాల్చాడు. కాని అతని కెందుకో నిద్రపట్టట మటుంచి, యింటివద్ద యిబ్బంది జ్ఞాపకమునకు వచ్చి, తనొక్క క్షణమైనా నిలుచుటకు కాళ్లాడలేదు. వెంటనే లేచి కూర్చున్నాడు. చుట్ట వెలిగించి, గబగబా మెట్లు దిగి క్రిందికి వచ్చాడు. 'అమ్మాయి, అమ్మాయి' అని చెల్లెలిని లేపాడు.

ప్రొద్దస్తమానం యింటి పనులు చేసి చేసి మైమరచి గాఢ నిద్రలో వున్న రంగమ్మ, ఉలిక్కిపడి లేచింది. "ఎందుకు అన్నా! యింత చీకట్లో లేచావు, తెల్లారలేదుగా?" అన్నది.

"ఏమీ లేదమ్మా ... కోడి కూసింది, మెలుకువ వచ్చింది. మళ్లా నిద్రపోదా

మంటే నిద్రపట్టక, యింటికి పోదామనే ఆదుర్దా వున్నందున లేచివచ్చా. పోతేనే గాని కాదు" అని మాట ముల్లె సర్దుకొని బావనైనా లేపకుండా బయలుదేరాడు.

ఆవూరికి యీవూరికి మధ్య నాలుగు క్రోసుల దూరమైనా వుంటుంది. బండ్ల బాటన పోతే కొంచెం త్వరగా పోవచ్చు. కాని, బాట సరిగా లేక రాళ్లు రప్పలు ఎగుడు దిగుడుగా వుండి, ప్రయాణమునకు అనుకూలముగా వుండదనుకొని, కాలిబాటన బయలుదేరాడు రామన్న. అచ్చటచ్చట గుబురుగావున్న చెట్లమధ్యనుండి పోవలసి వస్తుంది. ఆ కాలిబాట అయినా నేరుగా లేక పొలాలమధ్యనుండి, ఫర్లాంగు దూరము చెరువుకట్టమీదుగాను పోయి పోయి బండ్లబాటలో కలుసుకుంటుంది. అంత చీకట్లో పోతున్నా నన్న ఆలోచన లేక త్వరితగతి నడక సాగిస్తున్నాడు.

ఊరుచేరుట కొక అరగంటయినా పట్టుతుంది. అకస్మాత్తుగా ఉన్నట్లుండి కాలుమబ్బు లేకమై, గాఢాంధకార మావరించింది చినుకులు ప్రారంభమై, రానురాను వాన ప్రారంభించి, బాటంతా జలమయమై సరిగా కన్పించక యున్నది. తనెటు పోతున్నదీ తెలియక అయోమయావస్థలోనే పోతున్నాడు. పావుగంటకు వాన వెలిసింది. తెల తెల్లవారునప్పటికి తిన్నగా వూరి పొలిమేర చేరుకొని కొంచెము తెప్పరిల్లి, యింటికి చేరుకున్నాడు.

ఇంట్లో అడుగు పెట్టగానే 'చిన్ని' ఎదురైంది. "అమ్మకెట్లావుంది నెమ్మదిగా వుందా?" అని కూతుర్ని అడిగాడు.

"నెమ్మదిగా వుంది. 'అమ్మా-అమ్మా' నాయన వచ్చాడే" అంటూ తల్లిని పిలిచింది చిన్ని.

ప్రొద్దుటనే లేచి, పొయ్యిరాజేసి నీళ్ళు కాగబెట్టుతూంది అప్పుడే. పిల్ల పిలుపు వల్ల భర్త వచ్చాడని బైటికి వచ్చింది.

"రాత్రి రాలే దెందుకూ, బావగారి బలవంతమా?"

"అవునే! బలవంతముమీదనే వుండాల్సి వచ్చింది. కాని యింటివద్ద ఎట్లా వుందో అనే దిగులుతోనే వున్నాను. ప్రొద్దున్నే లేచి వద్దామని అమకున్నవాడిని, కోడి కూయగానే మెలుకువవచ్చి, నిద్రపట్టక, మనస్సు వుండబట్ట లేక అట్లాగే బయలుదేరి వచ్చా."

"ఇంత తొందరపడి పోయినా, గేదెలు బేరం కాలేదా?"

"బేరం అయింది. కాని డబ్బు తక్కువయింది. దానికి తోడు బేరంలో తేడా వచ్చి తీసుకోవడం మానుకున్నా. వచ్చే వారపు సంతలో తీసుకోవచ్చులే" అన్నాడు.

"బావగార్కి పాడిగేదె కావాలన్నారంటివే, ఏమైనా బేరంచేశారా? అది సరేకాని, యిద్దరంకలిసి మారుబేరాలు చేస్తాము అంటివే, అదేమయింది?"

"రేపు వెళ్లినప్పుడు చెవినవేస్తా. తనేమంటాడో తెలుస్తుంది. మనింటి గేదెను తీసుకోవాలని వుంది. డబ్బుమాట అటుంచి తోలి పెట్టమంటున్నాడు బావ."

"చిన్ని పెండ్లి అనుకుంటున్నామాయె... డబ్బు యిస్తానన్నాడా లేదా? 'సంతకు కావాలి బయానా యిచ్చాను బేరానికి' అని తొందర పెట్టు."

"రేపు సంతకు వెళ్లినప్పుడు అడిగి చూస్తా. ఎప్పుడడిగినా, ఇదుగో అదుగో అంటుంటాడు. పైసా యిచ్చిన పాపాన పోలేదు. అవసరానికి యివ్వకపోతే యింకెందుకు? కాని తొందరపడి ఖచ్చితంగా అడుగుతే యిచ్చేబాపతు కాదు" అంటూ నీళ్లు పోసుకోటానికి దొడ్లోకి వెళ్ళాడు.

* * *

సంతకు వెళ్లిరావటానికి ప్రయాణమైనాడు. 'గేదెను తోలుకరమ్మన్నాడే. తోలుకుపోకుండా వూరికే నేపోతే అడిగితే ఏమి సమాధానం చెప్పాలి!' అనుకుంటూ నడుస్తూన్నాడు. 'మేత సరిగా లేక వారం రోజులనుండి పాలు సరిగా యివ్వకుండా వుంది, నిన్న యివ్వాళ్ల అసలే యివ్వటం మానేసింది' అని అందామనుకున్నాడు. మంచిమాటలతోనే తన కివ్వవలసిన డబ్బు వచ్చే మార్గం ఎట్లాగా అని ఆలోచిస్తూ ఈ ఆలోచనలతోనే వూరు చేరుకున్నాడు.

ఇంటికి పోతుండగానే దారిలో సీనయ్య అగుపించాడు.

'సంత అయిపోతుంది త్వరగా పోయి వద్దాము' అంటూ రామన్న బావను కలుసుకొని యింటిముఖం పట్టారు.

"ఇప్పుడు గేదెలకు మంచి బేరాలున్నాయి. యిప్పుడనంగ బేరాలు చేశామంటే మంచి లాభాలు వుంటవి" అని టూకీగా అందించాడు.

"మొన్ననే చూసివచ్చా. బండి, ఎద్దుల జత - బాగా వున్నవి. మీ ముసలి ఎద్దులకు తోడు అవి కూడా మారుబేరం చేశామంటే బాగుంటవి" అని మళ్లీ అన్నాడు రామన్న.

ఈ మాటలలో యింటి గేదెను తోలుతానన్నది. రామన్నను అడగటం మరిచాడు. అంతకుముందు తెచ్చిన ఎడ్లజత చౌకగానే తెచ్చాడు రామన్న. లాభాలు వచ్చే వ్యవహారాలు చెప్పేటప్పటికి 'లాభానికి లాభమొస్తుంది, పశువులను తెచ్చుకొని కొన్నాళ్లుపని గడుపుకొని, వాటిని మార్చి మరల మంచివి తెచ్చుకోవచ్చు" అని అనుకున్నాడు సీనయ్య.

బావమరదిని కలుపుకొని పశువుల బేరంలో డబ్బు సంపాదించాలనే ఆశ మొదటినుండీ, వున్నది సీనయ్యకు. 'డబ్బు పెట్టెలో దాచుకుంటే పిల్లలు పెడుతుందా? బావమరది వున్నాడాయె, తిరుగుడికి. తను హాయిగా యింటివద్ద కూర్చోవచ్చు.

తన స్వలాభం కొరకు వ్యాపారానికి పెట్టుబడి పెడితే, ప్రస్తుతం బావమరది కివ్వవలసిన డబ్బు అడగకుండా వుంటాడు; కొంతకాలం అట్లాగే గడపవచ్చు' అనుకొని "నేనూ అదే అనుకున్నా నీవు వచ్చాక చెపుదామని. సరే పద సంతకు పోయి వద్దాం" అంటూ లేచాడు.

"తనకు యిబ్బందిగా వుంది, డబ్బు కావాలంటే ససేమిరా లేదన్నాడు. యిప్పుడు తన స్వలాభంకోసం చెప్పితే, మూలవున్న మాట తెస్తున్నాడు. ఇటువంటి మొండివాళ్లకు తగిన శాస్తి కావాలసిందే" అనుకున్నాడు మనస్సులో.

ఆ రోజు సంతలో మంచి గేదెలున్నాయి. గంటలోనే నాలుగు గేదెలను బేరంచేశారు. ఒక కోడెదూడను కూడా అయిదువందల ఖరీదుకు బేరంచేశారు. 'కోడెదూడను మేపుకొని తయారుచేస్తే మంచి లాభానికి ఎప్పటికైనా పోతుందని' అనుకున్నారు.

పశువులను తోలుకొని యింటికి వచ్చారు. 'యిన్ని పశువులు తన అన్న ఎప్పుడూ బేరంచేయలేదే! ఈ రోజు ఇంత డబ్బు ఎక్కడిది' అని ఆశ్చర్యపోయింది చెల్లెలు. చివరికి అన్న ద్వారా అన్ని విషయాలు తెలుసుకున్నది.

"సాయంత్రానికే యింటికి పోవాలి. మంచిబేరాలు కుదిరిందాకా, అక్కడక్కడికి వెళ్లి మాట్లాడాలి. మళ్ళీ త్వరగానే వస్తా" అని బావతో చెప్పి ప్రయాణమైనాడు.

"సరే మంచిది. ఆలస్యమైనా బేరం సరిగా చెయ్యి. నీకష్టం వుంచుకోను. నీకూ నాకూ నాలుగు పైసలు వచ్చేటట్లు చూచుకో"

అన్నం తినకుండా అడావిడిగా పోతున్నాడని, అదివరకే చేసివుంచిన కుడుములు రెండు తింటానికి యిచ్చి, నాలుగు మూటకట్టి యిచ్చింది చెల్లెలు.

పశువులతో బావమరది ఒక్కడే అవస్థపడలేడని, పాలేరును కూడా తోడుయిచ్చి పంపాడు.

పశువులనూ తోలుకొని బయలుదేరి దీపాలు పెట్టేవేళకు యింటికి చేరుకున్నాడు రామన్న.

నాల్గురోజులు గడచినవి. పశువుల తోలుకొని మారుబేరానికని వెళ్లి త్వరగా వస్తానని చెప్పిపోయాడు. 'యింకా రాలేదెందుకా...' రేపో మాపో వస్తాడని ఎదురుచూస్తున్నది. రామన్న భార్య.

వారం రోజుల్లోనే, తోలుకపోయిన గేదెలను అమ్ముకొని మంచి లాభంతోనే వచ్చాడు. "బావ యిచ్చేది లేదు, నేను తీసుకుండేది లేదు. అనుకున్న పాతబాకీ యీ విధంగానైనా వచ్చింది. తీరా మిగిలిపోయిందాకా యింకేమి చేస్తాడు' తగిన సమాధానం చెప్పొచ్చు" అనుకున్నాడు.

వారము వారము బాగా లేకుండా సంతకు బావగారి వూరు వెళ్లేవాడు. నెలపైగా అయింది. సంతకు పోవటము మానుకున్నాడు.

"ఇన్ని రోజులయింది. గేదెలను అమ్ముకొని వచ్చి, పదిరోజులలో వస్తానని రానందుకు, యేమనుకుంటాడో మీ బావ." అన్నది భార్య.

అనుకుండే దేముంది; నోటుగావుంటే మటుకు వస్తుందని నమ్మకం. మనం చేసేదేముంది యెగ్గొడితే. పట్టుపట్టి వ్యవహారరీత్యా వసూలు చేయలేము.. దానికీ కొంత డబ్బు తగలెయ్యాలి. అదెక్కడనుండి వస్తుంది? నెమ్మదిమీద మంచి మాటలతోనే వచ్చే మార్గం చూడాలి"

అసలు పోకుండావుంటే అనుమానపడ్తాడని, ఓ రోజు బయలుదేరి వెళ్లాడు రామన్న.

ఇంటికిపోగానే ఒకరి నొకరు చూచి కూడా మొదట పలుకరించకుండా మౌనంగా కూర్చున్నారు. క్షణమాగి సీనయ్య యిట్లా అన్నాడు.

"త్వరగా వస్తానంటివే! యింత ఆలస్యమైన దెందుకూ? బేరము బాగా అయినట్లేనా?"

"బేరము బాగానే అయింది. యింటి గేదెను కూడా సరిగా పాలు యివ్వటం లేదని దాన్ని కూడా మారకానికి మాట్లాడి వచ్చా. వీటిని బేరమిచ్చిన చోటనే ఎడ్లను మారకానికి మాట్లాడాను. భేషయిన ఎడ్లువున్నవి. పదిరోజులైనతరువాత రమ్మన్నారు ఏ సంగతి చెపుతామని. గేదెలకు మారకంగా ఎడ్లనుగాని, డబ్బుగాని వసూలు చేసుకొని, అప్పుడే మన ఎడ్ల మారకం చేసుకోవచ్చు" అనుకున్నాను.


"సరె కాని సంతరోజు వచ్చేవాడివి ఈరోజు వచ్చావేం? ఇంటిగేదె అంటే జ్ఞాపకం వచ్చింది. దాన్ని తోలుతానంటివే. నేను అడగటం మర్చాను. అమ్మేశావన్నమాట."

"అయితేనేం బావా! రేపిపాటికి కొనలేమూ. ఏం భాగ్యం... మన గేదెలకు మారకముగా మంచి ఎడ్లజతకు ప్లాను వేసి వచ్చా. అందుకనే ఆలస్యమైనా వూరుకోవలసి వచ్చింది." అన్నట్లు చెప్పటం మరచాను. కోడెదూడకు మేత బొత్తిగా లేదు... అందుకని కాస్తో, కూస్తో, కొనుక్కుంటే మంచిది"

"కొనటం ఎందుకు? మన చొప్ప దొడ్లో వుంది. తీసుకొనిపో ఒక అరబండి: మేత లేకపోతే చిక్కిపోతుంది. పాలేరును పిలిపిస్తా బండికి వేయించుకొనిపో" అన్నాడు సీనయ్య.

మేత బండికి వేయించుకొని ప్రయాణమైపోతూ 'వారంరోజులలోనే 'చిన్ని' పెండ్లి నిశ్చయించుకున్నాము. ముందుగా చెల్లెల్ని పంపవలసింది. ఇంట్లో చేసేవాళ్లు కూడా లేరు. యిబ్బందిగా వుంది' అని బావతో చెప్పి; చెల్లెలి కొకమారు 'త్వరగా

(38-వ పేజీ చూడండి)




# 'సంసారి సుఖి - సన్యాసి దుఃఖి'

★

రచన: **కవిరావు**

గంగన్న శ్రేష్ఠి సత్రంలో
దొంగసాధు వొక డున్నాడు.
ప్రొద్దుగ్రుంకు సమయమ్మునకే
ముద్ద నడుక్కొని తినుచుండు.

ఇది యిట్లుండగ నొకనాడు
ఈదరగొట్టగ సాగింది
చిటపట చినుకులతో ముందు
చిన్న జల్లుపడ సాగింది.

సాయంత్రానికి సన్యాసి
సత్రం పంచకు చేరాడు.
గుంజ నానుకొని సన్యాసి
గంజాయ్ దమ్ములు తీశాడు.

గందరగోళముగా రైతుల్
కొందరు అటునిటు పరుగెత్తి
కొట్టాములలో తమ గొడ్లు
కట్టివేసుకొన సాగారు.

చూరు క్రిందగల సన్యాసి
చూస్తూనే కూర్చున్నాడు.
తడిసే సంసారుల జూచి
తా నిట్లని తలపోశాడు.

"ఎండకు వానకు సంసారి
బండెడు చాకిరి చేయాలి.
యోచిస్తే సన్యాసి సుఖి - ఆ
లోచిస్తే సంసారి దుఃఖి."

ఇంతలోనే గాలీ వాన
ఇంతింతై మరి యంతయ్యె
గాలివానల ధాకంకు
గంగన సత్రము కూలింది.

చలిలో పాపం సన్యాసి
చావ సిద్ధమై ఉన్నాడు.
చచ్చే చచ్చే సన్యాసి
చావు తెలివితో అన్నాడు.

"అస్తమానమూ వేసారి
హాయిగ సుఖపడు సంసారి,
కష్టము చేయంగను రోసి
నష్టము లొందును సన్యాసి."

"అందులకే సంసారి సుఖి -
అందుకనే సన్యాసి దుఃఖి."

# కాంచనద్వీపం

## రాబర్ట్ లూయీ స్టీవెన్సన్



### విచిత్రవ్యక్తి

ంచనద్వీపానికి సంబంధించిన యావత్తు కథను ఏమీ దాచకుండా పుస్తకరూపంలో వ్రాయవలసిందని జమీందారు ట్రెలానీ, డాక్టరు లివ్‌సే, ఇంకా ఇతరమిత్రులు నన్ను ప్రోత్సహించారు. అందుచేత నేనుకూడా ఉత్సాహం కలిగి నాకు తెలిసిందంతా వ్రాయడానికి పూనుకున్నాను. కాంచనద్వీపం ఉనికిపట్టునుగురించి మాత్రం నేను వెల్లడిచేయ దలుచుకోలేదు—అక్కడ ఇంకా త్రవ్వబడని ధనరాసులు ఉండడం మూలాన.

ఆ చిన్నతనంలో జరిగిన వింతైన ఘటనలు ఇప్పుడు తలుచుకుంటే, అవన్నీ నిన్న మొన్న జరిగినట్టు అనిపిస్తోంది.

మా ఊరు సముద్రతీరానికి బాగా దగ్గిర. ఊరికీ సముద్రానికీ మధ్యగా ఉండేది మా "ఎడ్మిరల్ బెన్‌బో". "ఎడ్మిరల్ బెన్‌బో" అనేది మా నాన్న నడుపుతున్న హోటలు పేరు. మా హోటలుకు చుట్టుపట్ల చాలా దూరంవరకూ ఇళ్లు ఉండేవికావు. ఎప్పుడోగాని సాధారణంగా ఆ చాయలకు ఎవరూ వచ్చేవారు కారు.

ఇలా ఉండగా ఒకరోజున మా ఇంటికి ఒక వింత మనిషి వచ్చాడు. వయస్సు అరవైపైగా ఉండవచ్చు. నల్లగా మాసిన బట్టలు, పొడుగాటిపిలక, కణతలమీంచ కత్తిగాటు, మొటుబారిన వేళ్లు, పొడుగ్గా, బలంగా, బరువుగా, అతడు మా యింటికి వచ్చాడు. చూడగానే అతడు ఏళ్ల తరబడి సముద్ర జీవితం గడిపి నావికుడని తేలిగ్గా స్ఫురిస్తుంది. అతని వెనక కూలివాడు పెద్ద ఇనప్పెట్టెను మోసుకొచ్చాడు.



"ఎవరిక్కడ" అని బల్లమీద దార్ఢ్యంగా చరిచాడు. మానాన్న లోపల్నించిరాగానే "రమ్" అనిఅరిచాడు. (రమ్‌అంటే ఒక రకమైన సారాయం.) మానాన్న గ్లాసులో రమ్ తీసుకొచ్చి ఇచ్చాడు. గ్లాసును గబాల్న ఒడిసిపట్టుకుని "ఓహో, ఓహో," అని రుచిని మెచ్చుకుంటూ నెమ్మదిగా, చాలాసేపు, ఊరించుకుంటూ తాగాడు. మధ్యమధ్య మాకేసి, మా హోటలు బోర్డుకేసి, దూరానశిఖరాలకేసి చూశాడు.

తాగడం పూర్తయింది. "బాగానే వుంది యీచోటు. ఇక్కడకి బాగా జనం వస్తూవుంటారా?" అని మా నాన్న నడిగాడు. రారని సమాధాన మిచ్చాడు మానాన్న.

"మరీ మంచిది. ఇల్లాంటి చోటుకోసమే వెదుకుతున్నాను. ఇదుగో చూడు నేస్తం! నేను ఉన్నదున్నట్టు మొహంమీద కక్కేసేమనిషిని. నాకేం అక్కర్లేదు. వేళపట్టున ఇంత తిండి, ఇంత రమ్ పడేశావంటే నీ జోలి నా కక్కర్లేదు, నాజోలి నీకక్కర్లేదు. నాపేరు-నాపేరేదైతేనేంలే- నన్ను కెప్టెన్ అని పిలుస్తూవుండు. ఏమిటలా చూస్తావ్? ఓహో అదా నీగొడవ. ఇంద, యీడబ్బు తీసుకో-" అంటూ కోటుజేబులోంచి మూడు నాలుగు బంగారు నాణాలు తీసి బల్లమీద విసిరేశాడు.

అతడు తను కెప్టెన్ (నౌకాధికారి) నని చెప్పుకున్నప్పటికీ అతని వాలంకం చూస్తే కెప్టెన్‌లాగ లేనేలేడు. మామూలు కళాసీలాగానే ఉన్నాడు. పెట్టెతీసుకువచ్చిన కూలివాణ్ణి తరవాత అడగ్గా చెప్పాడు: ఈమనిషి అవాళ పొద్దునే మెయిల్లో దిగాడట. ఊళ్లో మంచిహోటళ్లు ఏమేమున్నాయో వాకబు చేశాట్ట. ఉన్న అన్నిట్లోకీ మాహోటలే మంచిదనీ, ఎప్పుడూ నిశ్శబ్దంగా, నిర్జనంగా, సముద్రానికి దగ్గిరగా ఉంటుందనీ ఎవరో చెప్పారట. వెంటనే తనకు తగిన స్థలం ఇదేనని

అనువాదం :
శ్రీ నందూరి రామమోహనరావు

★

ఫోటోలు వాల్ట్ డిస్నీ గారి ప్రొడక్షన్స్, ఆర్. కె. ఓ. రేడియో వారి సౌజన్యంతో


వృద్ధనావికుడు మా హోటల్లోకి అడుగు పెడుతూనే పడవవాళ్ల పాట లంకించుకున్నాడు. తరవాతకూడా అనేకసార్లు అతడు ఈపాటనే తనలో తను పాడుకోవడం విన్నాను:—

రాసులకొద్దీ. రత్నాలున్నయ్
యో-హో-హో-బలె సుమ్మైనరమ్!
కిమ్మనకుండా గమ్మున తాగెయ్
యో-హో-హో-బలెసుమ్మెనరమ్!

కర్ణకఠోరంగా ఉండేదతనికంఠం. ఆ గొంతుకలో ఒకటికాదు-రెండు మూడు గొంతుకలు దేనికది విడి విడిగా పలికేవి.

"ఆపెట్టె నక్కడ దింపరా అబ్బీ," అని కూలివానికి ఆజ్ఞాపించి ఒక బల్లముందు కూర్చున్నాడు.

## స్టీవెన్సన్



స్టీవెన్సన్ 1850 వ సంవత్సరంలో ఎడింబరో నగరంలో (స్కాట్లండు) జన్మించాడు. 16 వ ఏటనుండి అతడు వ్యాసాలు, పద్యాలు వ్రాయడం మొదలెట్టాడు. 1881 లో "ట్రెజర్ ఐలెండు" నవలను "యంగ్ ఫోక్స్" అనే పిల్లల పత్రికలో సీరియల్‌గా ప్రకటించినప్పుడు దాన్నెవ్వరూ గమనించనే లేదు. రెండేళ్లతర్వాత దాన్ని పుస్తకంగా ప్రకటించడంతో దేశమంతా అతని పేరు వ్యాపించింది. అది అతని మొదటి నవల. తరవాత చాలా నవలలు వ్రాశాడు. స్టీవెన్సన్ జీవితాంతమూ అనారోగ్యంతో బాధపడుతూనే వున్నాడు. కాని ఎప్పుడూ పట్టుమని నాలుగేళ్లు ఒకచోట నిలకడగా ఉండకుండా, యూరపు, అమెరికా, ఆస్ట్రేలియా, పసిఫిక్ ద్వీపాలు సంచరిస్తూ గడిపాడు. ఆఖరి నాలుగేళ్లు మా త్రం 'సమోఆ' అనే పసిఫిక్ దీవిలో గడిపి అక్కడే 1894 లో తన 44 వ ఏట మరణించాడు. స్టీవెన్సన్ ఎప్పుడూ సరదాగా, ఉత్సాహంగా, చురుగ్గా ఉండేవాడని ప్రతీతి

నిశ్చయంచేసుకుని ఇటు వచ్చాడట. ఇంతకుమించి అతన్నిగూర్చి మాకేమీ తెలియదు.

అతడు బాగా మితభాషి. పగలల్లా చంకలో ఇత్తడి టెలిస్కోపు పెట్టుకుని, కొండ గుట్టలమీదా, సముద్రతీరానా, ఒంటరిగా తిరిగేవాడు. చీకటి పడగానే తిరిగివచ్చి భోజనశాలలో నిప్పుసెగకు దగ్గరగా కూర్చుని గ్లాసుమీద గ్లాసు రమ్ తాగేవాడు. ఎవరన్నా పలకరిస్తే పలికేవాడు కాదు. తలెత్తి గుడ్లురిమి చూసేవాడు; ముక్కుతో బుర్రుమని భయంకరంగా శబ్దంచేసేవాడు. ఈ అలవాటు గమనించి మేము కూడా అతని జోలికి పోయేవాళ్లం కాము. ప్రతి సాయంత్రం షికారునుంచి రాగానే నన్నో, మా నాన్ననో అడిగేవాడు: ఓడకళాసు లెవరన్నా ఆదోవన వచ్చారా అని. తనజాతివాడెవడూ దొరక్కపోచడంలేదేమో, అందుకని అడుగుతున్నాడేమో అని అనుకునేవాళ్లం మొదట్లో. కాని క్రమంగా తెలిసింది, నావికులెవరికీ కంట పడకుండా అతడు తప్పించుకుంటున్నట్టు. ఎప్పుడైనా నూటికీ కోటికీ ఎవడన్నా నావికుడు మా "ఎడ్మిరల్ బెన్‌బో"కు వస్తే (కోస్తారోడ్డునే బ్రిస్టల్‌నగరానికి పోయేవాళ్లు మా హోటలుకు వచ్చి విశ్రాంతితీసుకునేవాళ్లులెండి.) మన కెప్టెన్ తలుపుసందులు గుండా ముందు తొంగిచూసి ఆ వచ్చిందెవరో తేల్చుకునిగాని ఇవతలకు వచ్చేవాడు కాడు.

అతడు ఎవరికోసం భయపడుతున్నాడో నాకు తెలుసు. ఎందుకంటే ఒకసారి నన్ను చాటుకు పిలిచి చెప్పాడు: ఒంటికాలి ఓడకళాసీ ఎవడైనా వస్తే తక్షణం తనకు చెప్పవలసిందని. అలా జాగ్రత్తగా పహరా కాస్తూవుంటే ప్రతినెలా నాకు నాలుగు పెన్నీలు భత్యం ఇస్తాననికూడా వాగ్దానం చేశాడు. నేను ప్రతి ఒకటో తారీకున నా భత్యంకోసం అడిగేవాణ్ణి. అతడు బుర్రుమని శబ్దంచేసి నాకేసి నిశ్చలంగా చూసేవాడు. ఇవ్వడం ఇష్టంలేదేమోనని నేను వెళ్లిపోయేవాణ్ణి. కాని రెండు మూడు రోజులయ్యాక, నాజీతం నాకివ్వకపోతే వచ్చేనష్టం ఆలోచించుకునేవాడల్లే వుంది - మాట్లాడకుండా వచ్చి నాలుగు పెన్నీలూ నాచేతిలోపెట్టి మళ్ళీ హెచ్చరించేవాడు: "ఒంటికాలు ముండాకొడుకు వస్తేమాత్రం మర్చిపోకేం," అని.

"ఒంటికాలు పెద్దమనిషి" రోజులకు రోజులు నన్నెల్లా వేంటాడాడో మీకు చెప్పనక్కర్లేదనుకుంటాను. హోరున కుంభవృష్టిగా వర్షంకురిసే రాత్రి సమయాల్లో, ఈదురుగాలి మా కిటికీ తలుపులను దడదడా మొత్తేటప్పుడు, సముద్రపు కెరటాలు కల్లోలంగా లేస్తూ విరుగుతూ గర్జించేటప్పుడు, "ఒంటికాలు మనిషి" వెయ్యిరూపాలతో, వెయ్యివిధాలుగా నాకు గోచరించేవాడు. ఒకసారి మోకాలువరకూ కాలు తెగివున్నట్టు, మరోసారి తొడవరకూ తెగివున్నట్టు తోచేది; ఒకసారి అతడు పుట్టడమే ఒక్క కాలుతో పుట్టినట్టు, ఆకాలు బొడ్డుదగ్గిర్నించి పూరికే వేలాడుతున్నట్టు అనిపించేది. ముఖ్యంగా నిద్రపోతున్నప్పుడు ఆ రాక్షసవ్యక్తి నాస్వప్నాల చీకట్లో ప్రత్యక్షమై కొండలమీంచి కొండలమీదకి నన్ను తరిమేవాడు. నాలుగు పెన్నీలజీతం మాట దేవుడెరుగునుగాని, ఈ ఊహారాక్షసుడితో నే నెన్ని రోజులు బాధపడ్డానో చెప్పలేను.

కాని అన్నిటికంటే విపరీతంగా నన్నూ, ఇతరులను భయపెట్టింది మా కెప్టెన్ ప్రవర్తన. ఒక్కోసారి అతడు మితిమీరి తాగేవాడు; భోజనశాలలో బల్లముందు కూర్చుని చుట్టూ ఎవరున్నా లెక్కచెయ్యకుండా, గార్దభస్వరమెత్తి పల్లెపదాలు పాడేవాడు; ఇంకోసారి అందర్నీ తనచుట్టూ కూర్చోమని ఆజ్ఞాపించి, ఏమిటేమిటో రకరకాల కథలు చెప్పేవాడు; లేకపోతే తను పాడే పాటలకు వంత పాడమనేవాడు. అందరూ గజగజ వణికిపోతూ అత డేం చెయ్యమంటే అదల్లా చేసేవారు. హోటలుకు వచ్చే అతిథులు కెప్టెన్ చుట్టూ ప్రాణా లుగ్గబట్టుకు కూర్చుని, "యో-హో-హో-"లతో ఇంటికప్పు లెగిరిపోయేట్టు పాడటం నా కిప్పటికీ బాగాజ్ఞాపకం. ప్రతివాడూ తనపక్కవాడికంటే బిగ్గిరిగా పాడటానికి ప్రయత్నించేవాడు; ఎందుకంటే ఎవరన్నా గొంతు కలపనట్లు కనిపిస్తే ఊరుకునేవాడు కాదు కెప్టెన్.

పూటుగా తాగి నిషామీదున్నప్పుడు కెప్టెన్ దగ్గరలో ఉండటం అంత ప్రమాదం మరోటి లేదు; వజ్రాయుధంలాంటి చేత్తో బల్లమీద ధన్‌మని గుద్ది

"పటప్" అనేవాడు; తను కథ చెబుతుంటే ఎవరన్నా ప్రశ్న వేస్తే తారాజువ్వలాగ ఎగిరేవాడు; పోనీ ప్రశ్న వెయ్యకుండా ఊరుకుంటే. ఎవ్వరూవినటంలేదని తప్పు పట్టేవాడు. మొత్తానికి తను మస్తుగా తాగి, మత్తెక్కి నిద్రపోయిందాకా ఎవ్వర్నీ హోటల్లోంచి కదలనిచ్చే వాడు కాదు. అతని కథలు బలే భయంకరంగా ఉండేవి. హత్యలు, ఉరికొయ్యలు, సముద్రాల్లో తుపానులు, ఎడారుల్లో దెయ్యాలు, దొంగతనాలు, దోపిళ్లు-ఇవే అతని కథావస్తువులు. అతని కథల్ని, అతడు ఉపయోగించే భాషనీ, బూతుల్నీ వింటుంటే ఇంతకంటే పరమ నీచుణ్ణి దేవుడు సృష్టించలేదనిపిస్తుంది.

"ఈ లుచ్ఛాగా డెక్కడ దాపురించాడ్రా మనప్రాణాలకి? వీడిమూలాన మనహోటలుకి వచ్చే కొద్దిమందీకూడా మానుకునేట్టున్నారు," అని మానాన్న అనేవాడు. నిజానికి మొదట్లో జనం కెప్టెన్‌ను చూసి భయపడ్డారుగాని క్రమంగా వారిభయం తగ్గిపోయింది. మాపల్లెటూరి మందకొడి జీవితంలో ఈ కెప్టెన్ మూలానే కాస్త సంచలనం అంటూ కలిగింది. ఏ కొత్తదనమూ, ఏ ఉద్రేకమూ ఎరగని మావూరి యువకులు అతనిచుట్టూ మూగి ఆవిచిత్రకథలు వినేవారు. కొందరు కొందరికి అతనంటే గౌరవంకూడా పుట్టి "ఇల్లాంటి ధైర్యవంతులు, సాహసులు ఉండటం మూలానే సముద్రాలమీద ఇంగ్లండుప్రభ అలా వెలుగుతోంది," అని మెచ్చుకునేవారు.

ఒకవిషయంలో మాత్రం అతడు మమ్మల్ని నాశనంచేశాడని చెప్పకతప్పదు. వారాలు, నెలలు గడిచిపోతున్నా అతగాడు మాబసలోంచి కదల్లేదు. మొదట్లో ఏమిచ్చాడో ఇచ్చాడు; అంతే; మళ్ళీ ఒక్క పెన్నీ విదిలించలేదు. మానాన్న ఎప్పుడన్నా బాకీ సంగతి ఎత్తితే భయంకరంగా బుర్రుమని, నిశ్చలంగా చూసేవాడు. మానాన్న హడిలిపోయి అవతలికి జారుకునేవాడు. కెప్టెన్ మా ఇంటికి వచ్చిందిమొదలు, చనిపోయేవరకు అవేబట్టలు, అదేటోపీ, అవే మేజోళ్లు ఉపయోగించేవాడు. కోటు క్రమంగా చిరిగిపోయింది, కాని దాన్నే కుట్టుకుని తొడుక్కునేవాడు. చివరికి అతుకులగుడ్డతప్ప కోటు అంటూ ఏమీ మిగల్లేదు.

అతడు ఎవరికీ ఉత్తరాలు రాయడంగాని, అతని కెవరూ రాయడంగాని నేను చూడలేదు. మేడమీదిగదిలో మంచంకింద దాచిన ఇనపపెట్టెనుకూడా అతడు తెరవడం నేనెప్పుడూ ఎరగను.

కెప్టెన్‌కు ఒక్కసారే "ఎదురుదెబ్బ" తగిలింది; అదైనా ఆఖరురోజుల్లో. మానాయనకు పెద్దజబ్బు చేసింది. ఒకరోజు సాయంత్రం డాక్టర్ లివ్‌సే రోగిని చూడటానికి మాయింటికి వచ్చాడు. మా అమ్మ డాక్టరుకు భోజనం వగైరా ఆతిథ్య సత్కారాలు చేసింది అదయింతర్వాత డాక్టరు తనఇంటికి తిరిగి పోవడానికి ఉద్యుక్తుడయ్యాడు. కాని ఆయన గుర్రం గ్రామంనుండి తిరిగిరావడానికి కొంత ఆలస్యమైంది. అందుకని ఈలోగా పొగాకు పైప్ కాల్చుకోవచ్చు గదా అని ఆయన హాల్లో కాసేపు కూర్చున్నాడు. నేను కూడా ఆయన సమీపంలో కూర్చున్నాను. డాక్టరు గారి మల్లెపువ్వులాంటి బట్టలు, తేటతేట ఉట్టిపడే ప్రకాశవంతమైన ముఖం, ఆయన మర్యాద మంచితనం ఇవన్నీ చూసి, అటు ఒక మూల రమ్ తాగుతూ కూర్చున్న కెప్టెన్‌ను, అతని కంపుగుడ్డలు, దిష్టిబొమ్మ లాంటి వాలకం చూస్తే కెప్టెన్‌మీద ఎంత రోత కలిగిందో చెప్పలేను.

కెప్టెన్ ఉన్నవాడు ఉన్నట్టుండి వేళ్లతో బల్లమీద తాళంవేస్తూ తన పాతపాట ప్రారంభించాడు:—

కిమ్మనకుండా గమ్మున తాగెయ్ –
యో, హో-హో-బలెగమ్మైన రమ్!

ఈపాట మేము రోజూ వినేదే అవడంవల్ల మాకెవ్వరికి కొత్త అనిపించలేదు, కాని డాక్టర్ లివ్‌సే మాత్రం ఉలికిపడి చూశాడు. రెండుమూడు క్షణాలు కెప్టెన్‌కేసి తీవ్రంగా, చిరాగ్గాచూసి మళ్లీ నాతో కబుర్లలోపడ్డాడు. కొంతసేపటికి తనపాటను ఎవరూ లెక్కచెయ్యకపోవడం గమనించి కెప్టెన్ పాట ఆపాడు. ధన్‌మని బల్లమీద గుద్ది, "షటప్" అని పిడుగు పడ్డట్టు అరిచాడు. వెంటనే హాల్లోవున్న అతిథులు యావన్మందీ నోళ్లు నొక్కుకుని నిశ్శబ్దంగా కూర్చున్నారు. డాక్టరుమాత్రం సంభాషణ ఆపలేదు కొన్ని కొన్ని రకాల జబ్బులనుగూర్చి నాకు వివరిస్తూ మాట్లాడుతున్నాడు. హాల్లో ఆయన ఒక్కడిగొంతుకే మృదువుగా, స్పష్టంగా వినబడుతోంది. కెప్టెన్ డాక్టరువంక నిశ్చలంగా చూసి, మళ్లీ "ఎవడ్రా అక్కడ? షటప్, అని బల్లమీద చరిచాడు.

"మీరు నాతోనేనా మాట్లాడేది?" అని డాక్టరు అడిగాడు.

"ఆ, నీకే చెప్పేది."

"సార్! మీకు ఒకమాట చెప్పదలుచుకున్నాను. మీరు ఇదేవిధంగా రమ్ తాగుతూ ఉన్నట్లయితే, త్వరలో ప్రపంచంనుంచి ఒక తాగుబోతు వెధవ నిష్క్రమిస్తాడు."

కెప్టెన్ కోపం వర్ణించతరంకాదు. ఉవ్వెత్తున లేచాడు. బొడ్డులోనుంచి ఓడకళాసు ఉపయోగించే పొడుగాటిచాకు తీశాడు. "పొడిచి పారేస్తా" నని డాక్టర్ను బెదిరించాడు.

డాక్టరు కదల్లేదు; ఇదివరకు లాగే నిర్భయంగా గొంతు హెచ్చించి మాట్లాడాడు:

"ఆ చాకు ముడిచివెయ్యి. నిన్ను ఉరికంబం ఎక్కించడం నా అభిమతం కాదు."

అక్కణ్ణించి ప్రారంభమైంది వారిద్దరి మధ్యా చూపుల యుద్ధం. కళ్లలోంచి విస్ఫులింగాలు కురిపిస్తూ ఒకళ్లనొకళ్లు చూసుకున్నారు. కొంతసేపటికి కెప్టెన్ వెనక్కితగ్గాడు. చాకు ముడిచి బొడ్డులో దోపుకుని దెబ్బతిన్నకుక్క తోకముడుచుకున్నట్టు మళ్లీ కుర్చీలో కూర్చున్నాడు. అతడు కూర్చోగానే డాక్టరు ప్రారంభించాడు:

"ఇదుగో మిస్టర్! నాజిల్లాలో నీబోటి వెధవ, నీచుడు, లుచ్ఛా ఒకడున్నాడని ఇప్పటికి తెలుసుకున్నాను; గనుక రాత్రింబగళ్లు నీమీద ఒక కన్ను వేసివుంటాను. నేను వట్టి డాక్టర్నిమాత్రమే ననుకుంటున్నావేమో. నేను ఈ జిల్లాకు మేజిస్ట్రేటునుకూడా. జాగ్రత్తగా మసులుకున్నావా, సరేసరి. లేక ఇవ్వాల్టి మాదిరిగా అసభ్యంగా ప్రవర్తించావా, నిన్ను ఈప్రదేశంనుండి నూరుమైళ్ల అవతలకు గెంటించి వెయ్యగలను. అర్థమైందా నే చెప్పింది?"

ఇంతలో డాక్టర్ లివ్‌సేగారి గుర్రం గుమ్మం ముందుకు వచ్చి నిలబడింది. ఆయన వెళ్లివస్తానని చెప్పి గుర్రమెక్కి వెళ్లిపోయాడు. కెప్టెన్ మాత్రం

ఆ రాత్రే కాదు, తరవాత చాలా రాత్రులవరకూ గాఢ గుప్ గుప్‌గా కాలంగడిపాను.

## 2. నల్లచుక్క

ఆతరవాత వరసగా కొన్ని విచిత్ర సంఘటనలు జరిగి, కెప్టెన్ పీడ విరగడైపోయింది మాకు. అది శీతాకాలం; విపరీతంగా మంచు కురిసి రోజు రోజంతా చలిగాలులు వీచేవి. మా నాయన వసంత కాలంవరకూ బతుకుతాడని మా కెవ్వరికీ ఆశలేదు. రోజురోజుకీ ఆయనపరిస్థితి అధ్వాన్నమవుతోంది. నేను, మా అమ్మ హోటలు పనితో సతమతమై పోతున్నాం.

జనవరి నెలలో ఒక ఉదయం—అప్పుడే తెల్లవారింది. మంచు కురుస్తోంది; చలి కరుస్తోంది.

సముద్రం భాగమంతా తెరల్లో దాక్కుంది; కెరటాల త్రుళ్లింతలుమాత్రం వినిపిస్తున్నాయి. సూర్యుడు కొండశిఖరాలనుంచి తొంగిచూస్తున్నాడు. మా కెప్టెన్ మామూలుకంటె పెందరాళే లేచి, సముద్రపు ఒడ్డుకి బయల్దేరాడు. బుజానికి కెలిస్కోపు, నడుముకు వంకరకత్తి తగిలించుకున్నాడు. అతడు కొండమలుపు తిరిగేవరకూ నే నలాగే అతనివంకే చూస్తున్నాను. మలుపు తిరుగుతూ ఖాండ్రించి ఉమ్మేసి బిగ్గరిగా ఏదో బూతుమాట అన్నాడు. డాక్టర్ లివ్‌సే ఆ రోజున తన్ను ఎదుర్కొన్నందుకు అతనికింకా కోపం తీరలేదని అనుకున్నాను నేను.

అమ్మ మేడమీద మా నాన్నకు పరిచర్యలు చేస్తోంది. నేను భోజనశాలలో ఏదో పనిమీద వున్నాను. ఇంతలో హాలు తలుపులు తెరుచుకుని ఒక మనిషి లోపలికి వచ్చాడు. అతన్ని అంతకు ముందెప్పుడూ నేను చూడలేదు. మధ్య వయస్కుడు; కొట్లాటల్లో ఆరితేరినవాడిలా కనిపించలేదు; ఓడ

(35-వ పేజీ చూడండి)



అతడు బల్లమీద ఆనుకుని రహస్యంగా అడిగాడు: "నా స్నేహితుడు బిల్ లోపలున్నాడా?"

# కీర్తి

ఒక గ్రామములో సూరయ్య శెట్టి అనే ఆయన వ్యాపారం చేస్తుండేవాడు. అతడు పరమ పిసినిగొట్టిపీనారి. పిల్లికి బిచ్చంపెట్టడు. అందువలన ఆవూరిలోని ప్రజలందరికి ఆ శెట్టిగారంటే పరమ అసహ్యం!

బజారులో ఎక్కడా దొరకని వస్తువులు, ముఖ్యంగా గవర్నమెంటువారు కంట్రోలుపెట్టిన వస్తువులు ఆయనకొట్లో దొరుకుతూ ఉంటాయి. కాని అధికమైన ధరలు. ఆయనధరలు చూస్తుంటే ఎప్పుడూ యుద్ధంజరుగుతూ ఉన్నట్లేవుంటుంది. ఈ విధంగానే చాలడబ్బు సంపా

సన్యాసివచ్చాడు. ఆయన గొప్ప మహిమ కలవాడని అందరూ చెప్పుకొంటున్నారు. దరిద్రులకి డబ్బు, పిల్లలు లేనివారికి పిల్లలు, దీర్ఘరోగులకి సంజీవిలాంటి మందులు యిచ్చి అందరి కోరికలు నెరవేరుస్తున్నాడని ఆ గ్రామమంతా ప్రాకిపోయింది. తండోప తండాలుగా ప్రజలుపోయి చూచి వస్తున్నారు.

ఈ విషయం మన సూరయ్య శెట్టిగారికి తెలిసింది. బాగా చీకటి పడ్డాక జనసంచారం పూర్తిగా తగ్గిన తరువాత బయలుదేరాడు శెట్టి...సన్యాసి నివసించే ఆశ్రమానికి. ఆశ్రమం నిశ్శబ్దంగా వుంది.

## శ్రీ సుంకర లక్ష్మీనారాయణరావు

దించాడు శెట్టి. కాని ఏమి లాభం? తాను తినడు; ఇతరులకి పెట్టడు. తనకి బంధువులుగాని తోడబుట్టువులుగాని సంతతిగాని ఎవ్వరూ లేరు. మరి ఆడబ్బు ఎవరిపరం చేద్దామని? ఎందుకూ యింత తాపత్రయం? అయినప్పటికీ యింకాడబ్బు సంపాదించాలనేడుబలాటం. అలాంటపుడు ప్రజలకి ఆయనంటే ఎందుకు ఈర్ష్యగా వుండదు?

ఒకరోజు ఆ గ్రామానికి వక సన్యాసి లోపల జపంచేసు కొంటున్నాడు.

ఆశ్రమంలోనికి ప్రవేశించి నమస్కరించి నిలుచున్నాడు శెట్టి. సన్యాసి శెట్టినిచూసి "ఎవరుమీరు" అన్నారు. "నేనొక వ్యాపారస్తుణ్ణి ...నా పేరు సూరయ్య శెట్టి అంటారు ...స్వామీ...చిరకాలంబట్టీ నాకొక కోరికవుంది. తమలాంటి మహాత్ముల సహాయం కోరి పరితపిస్తున్నాను. ఇప్పుడు నా అదృష్టం పండింది. తమ మహిమునిని తమ దర్శనం చేసికొన్నాను"......శలవయితే మనవిచేసికొంటాను" అంటూ ఎంతో వినయంగా మాట్లాడాడు. "సరే చెప్పవచ్చు" అన్నాడు సన్యాసి. శెట్టి నాలుగువైపులచూసి వణుకుతున్న కంఠ స్వరంతో......"బంగారం తయారు చేయాలని వుంది స్వామీ "అనేశాడు. "చేయగలంకాని శెట్టీ" ఆపని చేయడానికి నీలాంటివాడు పనికిరాడు "అన్నారు నిశ్చలంగా సన్యాసి. "అంటే స్వామీ" ప్రశ్నించాడు శెట్టి. "అంటే సంసారసుఖాలు విడిచిపెట్టి కొన్ని పుణ్యకార్యాలుచేసి నీవు వక సన్యాసిగా మారితేనే తప్ప... సువర్ణయోగంచేయలేము"అన్నారు సన్యాసి. "అది ఎంతపని స్వామీ మనం బంగారం తయారుచేయగలగాలి కాని...ఎన్ని పుణ్యకార్యాలయినా అవలీలగాచేసి పారవేయ

వచ్చు...మరి ఎలా ప్రారంభించమంటారు" అన్నాడు శెట్టి. "ధనలక్ష్మీపూజ, బీదలకు అన్నవస్త్రదానాలు, బ్రాహ్మణులకు గోదానం...యివన్నీ ముందుగా చేస్తేనే తప్పనీకు సువర్ణయోగం పట్టదు." అన్నారు సన్యాసి.

శెట్టికి ఇదంతా గోలగావున్నా బంగారం తయారు చేస్తున్నామనే ధీమాతో, యింతకి పదిరెట్లు డబ్బు సంపాదించ గలమనే నమ్మకంతో పుణ్యకార్యాలు ప్రారంభించాడు

శెట్టి చేసే దాన ధర్మాలతో ఆగ్రామం కళకళ లాడుతోంది. అతి దూర దేశాలనుంచి గూడా బిచ్చగాళ్ళు, సన్యాసులు, బ్రాహ్మణులు వస్తున్నారు. బీదా బిక్కీ క్రొత్తబట్టలు కట్టుకొని కడుపునిండా తిని శెట్టిపేరు చెప్పుకొని తీరనిహాయి ననుభవిస్తున్నారు. బ్రాహ్మణులు గోవులను తోలుకొని పోతున్నారు. ఎక్కడచూసినా శెట్టిపేరే.

ఇక యింట్లో లక్ష్మీపూజ, సత్యన్నారాయణ వ్రతం మొదలైన పూజలతో మంగళ వాయిద్యాలతో, గ్రామ ప్రజలతో మారుమ్రోగుతుంది. అటువంటి పిసినిగొట్టి శెట్టికి ఇటువంటి త్యాగశక్తి కలగడం ఆసన్యాసి మహిమయేనని చెప్పుకొంటున్నారు. ఎలాగైతేనే శెట్టి సంపాద నంతా బంగారం తయారుచేయాలనేపిచ్చి నమ్మకంతో హారతికర్పూరంలాహారించిపోయింది

మరుచటి రాత్రి బంగారం తయారు చేయడానికి అన్నీ తయారుచేసి కొంటున్నారు. తెల్లవారగనే రహస్య ప్రదేశానికి పోయి ప్రయోగం ప్రారంభిస్తారు. ఆరాత్రి శెట్టికి నిద్రపట్టలేదు. "బంగారపు కడ్డీలు - రైలుపట్టాలంత పొడుగుని యింకా ఎంతోలావు...అంతా బంగారమే...అని తలపోస్తున్నాడు.

తెల్లవారింది. స్నానం ముగించుకొని తొందర తొందరగా శెట్టి ఆశ్రమం చేరుకున్నాడు. ఆశ్రమం నిశ్శబ్దంగావుంది. లోపలికి ప్రవేశించాడు. ఎవ్వరూ లేరు. సన్యాసిలేడు. ఆశ్రమమంతా ఖాళీగావుంది. శెట్టికి వణుకుపుట్టింది. "స్వామీ" అన్నాడు బిగ్గరగా ..... చివరిసారిగా ఆశ్రమ మంతా పరికించాడు. ఒక మూల మాత్రం పసుపుగుడ్డ మూటవుంది. దానిని విప్పి చూశాడు. అదొక శుభలేఖ. దానిలో యిలావుంది.

శెట్టిగారూ!

ప్రపంచ చరిత్రలో బంగారం తయారు చేసింది మీ రొక్కరే... అదే కీర్తి ...కీర్తి కంటే మించిన బంగారం.....ఎక్కడవుంది? యుగయుగాలవరకూ మీ కీర్తి కస్తూరిలా పరిమళిస్తూ వుంటుంది. మానవునికి కావలసింది యీ బంగారమే. ఆబంగారం......వట్టిమాయ. ఆమాయలోపడి కొట్టుకు పోకుండా వచ్చి కాపాడిన సన్యాసిని నేను. సెలవు.

మరి ఇప్పుడు శెట్టి సన్యాసేగా...సంసారి కావడానికి చాలా కాలం పడుతుంది. అందువలన మిగిలినజీవితం సన్యాసిగానే గడపడానికినిశ్చయించుకొన్నాడు శెట్టి. ★

# కంది పచ్చడి

కర్నూల్లో వెంకయ్య పంతులు అనే ఒకాయన వున్నాడు. అతనిభార్య బహు గయ్యాళిది. ఆమె సాధారణంగా కోపంవస్తే, భర్తను చివాట్లు వేయడం, మొట్టికాయలు మొట్టటం, బుగ్గలు సాగదీయటం, అందరికీ తెలిసినదే. ఒక్కొక్కప్పుడు మహా కోపంవస్తే చింతబరికెతో బాదటంకూడాకద్దు. అతడు భార్యావిధేయుడు. ఎప్పుడైనా కోపంవచ్చి తెంపుచేసుకొని తిడదామన్నా, నోటిదాకా వచ్చి ఆగిపోయేది. ఎప్పుడైనా, తన పరిస్థితిని తలుచుకుని తనకే జాలికలిగి కుమిలి పోతున్నప్పుడు, తనకన్నా, హీనంగా జీవితంగడిపిన, పురాణ కాలం నాటివాళ్లను తలుచుకుని శాంతిచెంది, కొంచెం తృప్తిపడే వాడు.

అసలు తనకే రోజూ, ఏదో విధంగా చివాట్లు పెట్టందే సవ్యంగా అన్నంపెట్టదు. దానికితోడు వారం రోజులు కొకసారైనా, అతిథులు, గాని చుట్టాలుగాని, వస్తుంటారు. ఎవరైనా బంధువులు వాళ్లఇంటికి వచ్చిననాడు, పంతులుగారి ముఖం చూడాలి! ఆయనను చూస్తే ఆయనకేకాదు, మనకే ఏడు పొస్తుందనుకోండి. ఆవేళల్లా దిగులుగా దీనంగా వుంటాడు. భార్య బంధువుల నలుగురి ముందూ ఎలాంటి అభాసు చేస్తుందోనని ఆయన భయం.

ఎప్పుడెప్పుడు మిన్నువిరిగి మీద పడుతుందోనన్నట్టుంటాడు. ఇంట్లోంచి పెద్దగా మాటలు వినిపించినా ఉలిక్కిపడతాడు.

ఒక రోజున ఆయన ప్రాణం మీదకువచ్చినట్లు బంధువొకాయన వొచ్చాడు. వచ్చిన పెద్దమనిషిని పొమ్మనడం ఎల్లా? సరే ఆరోజున, భార్యకు, కోపంరాకుండా, చేతికీ, కాలికీ తోడుపడుతూ, మధ్య మధ్య మొట్టి కాయలతోసహా, చివాట్లు తింటూ, ఆమధ్యాహ్నం మాట దక్కించాడు.

ఇంక రాత్రిభోజనం దగ్గర ఒక చిత్రం జరిగింది. భోజనంలోకి అరటి కాయకూర వండి, చారు పెట్టింది కాని పచ్చడిలేదు. వచ్చిన పెద్దమనిషికి పచ్చడిలేకుండా భోజనం పెట్టడమేమిటనుకున్నాడు పంతులు.

మధ్యాహ్నం చేసిన "కంది పచ్చడి" కాస్తవుంది. అది ఇద్దరికీ, సరిగ్గా సరిపోదు. కొద్దిగా తక్కువవుతుంది. అన్నందగ్గర, ఒకరికివేసి, రెండవ వారికి వెయ్యకపోతే మర్యాదగా వుండదు.

ఏమీ పాలుపోక పంతులు మట్టి గోడవైపు చూస్తూ ఆలోచిస్తున్నాడు. భార్యని ప్రత్యక్షంగా పచ్చడి చెయ్యమని చెబుదామంటే అమ్మో...ఇంకేమైనా వుందీ, ప్రొద్దుటి నుండీ, దక్కించుకొన్న మర్యాద కాస్తా పోతుందేమో! చివరికి తెగించి, అదైనా ఆమెతో మాట్లాడుతున్నట్లు కాకుండా గోడ వైపు ముఖంపెట్టి "నాకైతే ఏమి వేసుకునితిన్నా ఫరవాలేదు కాని అవతల పెద్దమనిషి ఒకడున్నాడయ్యే, ఎల్లాగంట' (కాస్సేపాగి) పోని (చిన్నదీర్ఘంతీసి) ఆపచ్చడికి తోడు, ఇంకా కాస్త కందిపప్పు... రుబ్బితే," అంటూ ప్రశ్నార్థకంగా చూశాడు, గోడవైపు.

వెంటనే భార్య తన్నే అలా అంటున్నాడని గ్రహించి, "అవు



నవును మీకేం కాస్త పప్పల్లేనే వుంటుంది. రుబ్బలేక నేను ఛస్తాను. అసలే నాచెయ్యి బెణికింది. ఇప్పుడు నావల్లగాదు. కావలిస్తేమీరు రుబ్బుకోండి." అని విసురుగా చెప్పింది. పంతులుగార్కి పప్పు రుబ్బటం, చేతగాదు. ఏమి చెయ్యాలా అనుకొంటూండగా, ఆయన భార్యకు ఒక చక్కని వుపాయం తట్టింది. "నేను, ఆయనకు సరిపడగాపచ్చడి వేసి మీకు ఒక్కరవ్వ వేస్తాను. మీరు మళ్ళీ అడుగవద్దు. అలా అడుగకుండా ఉంటే పచ్చడి సరిపోతుంది." అని చెప్పింది. వెంకయ్యగార్కి ఈ ఆలోచన బాగా నచ్చింది. ఇంత చక్కని ఆలోచన తట్టినందుకు భార్యను పొగిడాడు.

సరే భోజనాలు అవుతున్నాయి. వచ్చిన ముసలి పెద్దమనిషితో వెంకయ్యపంతులు రాజకీయ, ఆర్థిక, ఆంతరంగిక క్లిష్ట సమస్యలను చర్చించడంలో, మరపు వచ్చి, వున్న కాస్త పచ్చడీ కలుపుకుంటూ, "ఏమేవ్ కాస్త పచ్చడివెయ్యి," అన్నాడు. కాని, భార్య కళ్లను చూడగానే సంగతి గ్రహించి, "ఏమేవ్, చాల్చాల్లే, వెయ్యద్దు, చాలావేశావే, నేనుచూసుకోనన్నాలేదు." అని సర్దిచెప్పాడు. కాని గుండెల్లోదడ ఏమాత్రం తగ్గలేదు. ఆ పెద్దమనిషి ఇదిచూసి లోలోపల నవ్వుకున్నాడు.

ఆ చెంబులు పగలేసుకోవడాలు, తలుపు ధడాలున వెయ్యటం చూడగానే ఏదో గొప్ప తుపాను రాబోతోందనే భయంతో, ముచ్చెమటలు పోసినాయి పంతులికి.

గోజూ ఆలస్యంగా భోంచేసే పంతులుగారు, మూడు నిమిషాలలో కానిచ్చి, ఇవాళ అతిథితోపాటు, చెయ్యి కడుక్కునేందుకు బయటకు వచ్చాడు. ప్రతిరోజూ వెంకయ్యగారు చెయ్యి కడుక్కునే ప్రదేశంలో, ఆముసలి పెద్దమనిషి చెయ్యి కడుక్కుంటున్నాడు. వెంకయ్య పంతులు కొంచెం దూరంలో చెయ్యి కడుక్కొని లోపలికి వెళ్ళిపోయాడు.

ఆస్థలమంతా చీకటి, చీకటిగా వుంది. ఆ ముసలి బ్రాహ్మణుడు, కళ్లు సరిగ్గా కనపడక, చీకటిలో తడుముకుంటూ వెళ్ళి చెయ్యి కడుక్కుంటున్నాడు.

మూడు నిమిషాలూ, మూడు యుగాలలాగా, గడిపి, వచ్చే కోపాన్ని, సంబాళించుకోలేక అవస్థపడుతూ, తొందరగా సమయం ఎప్పుడు, దొరుకుతుందా, ఎప్పుడు అవసరనైవేద్యం వడ్డిద్దామాఅని, (మహానైవేద్యం రేపు వడ్డించవచ్చు) తొందరపడుతున్న పంతులుగారి భార్య ఇంత అమూల్యావకాశం, లభిస్తే జారవిడుస్తుందా?

ఆ చెయ్యి కడుక్కునేది తన భర్తేనని అభిప్రాయపడి, ఎడమచేతిలోని చెంబు క్రిందపెట్టి, కుడిచేతిలోని ఎంగిలాకులు క్రిందపారేసి రుసరుస లాడుతూ, తనలావుపాటి

శరీరంతో గబగబ నడచి వెళ్ళి, ఆయన బుగ్గలు నులుముతూ "కంది పచ్చడి అడుగవద్దంటే, ఎందుకు అడిగారు? అడగవద్దన్నానా లేదా, అన్నానా లేదా," అని ఇంకా బుగ్గలు నులుమసాగింది.

ముసలాయన, నిర్ఘాంతపోయి, కాస్సేపటికి, తెప్పరిల్లి, "ఇదేమిటమ్మా, నన్ను కొడుతున్నావు? నేను నీ భర్తను కాను. బాబోయ్ వదిలిపెట్టు, నీకు దణ్ణం పెడుతాను. వదలవమ్మోయ్" అని అరుస్తూ ఒక్క తోపుతో వెనక్కి వెళ్ళిపడ్డాడు.

కాని ఆవిడ కోపావేశంలో ఒళ్లు మరిచి, "ఏమిటీ, ఏమిటన్నావ్ అవును, నువ్వు నా మొగుడివి కాదు మొద్దువి. నీకు సిగ్గనేది... (మాట మధ్యలో ముసలాయన కేక రావయ్యోయ్. నీ పెళ్లాం, నన్ను" చంపుతోంది. అని కేకలు.")

లోపల సావిట్లో పచార్లు చేస్తూ, ఈగండం గడిస్తే...అంటూ వెయ్యి దేవుళ్లకు మొక్కుకుంటున్న పంతులుగారు విని, ఒక్క అంగలో అక్కడికి వచ్చి, "ఇదేమిటే నీ మొహంమండ, ఆయనను పట్టుకొని కొడుతున్నావు నేను అక్కడ లేనే, సావిట్లోవున్నాను." అని ముసలాయనను లేవదీస్తూ, "నీకు సిగ్గనేది ఏకోశానా లేదుటే, ఆయన గనుక పోనీగదా అని వూరుకొన్నాడు. నేనైతే నుగ్గునుగ్గు చేసేద్దును" అని భార్యను చివాట్లువేస్తూ ఆయనను లోనికి తీసుకు వెళ్లాడు. వచ్చిన బంధువు తేలిగ్గా వూరుకోలేదు. దంపతులిద్దరినీ తూర్పార పట్టాడు. పంతులి అసమర్థతను నిందిస్తూ, ఒక్క క్షణం వుండకుండా ఆయన వెళ్లి పోయాడు.

వెంకయ్యగారు తన మర్యాద చెడకుండా, ఆయన ముందు తన భార్యను చెడామడా తిడుదామనుకున్నాడు. వెధవది. ఆయన అన్ని మాటలంటూంటే గుటకలు మింగుతూ కూర్చున్నాడే గాని, నోటివెంట మాటవస్తేగా, వెధవది, "కందిపచ్చడి" ఎంతపని చేసింది !!!

ఆ రాత్రి వంట యింటిలోనుండి సణుగుళ్లు గొణుగుళ్లు వినిపించినా, వినపడనట్లూరుకొని "ఇప్పుడు కాదు నీ పని" రేపు అనుకొని తెల్లవారగానే భార్యని ఏవిధంగా హృదయం చిక్కబట్టుకొని దండించాలో ఆలోచిస్తూ నిద్రపోయాడు.

ఏమయితే నేం. ఆవిడ ఏ మర్యాద పోయిందని భర్తని కొట్టబోయిందో ఆమర్యాద పూర్తిగా పోయింది. ★

# కాంచన ద్వీపం

(29-వ పేజీ తరువాయి)

కళాసీవలెకూడా లేదు; కాని అతనివద్ద సముద్రపు వాసనకొడుతున్నట్లే అనిపించింది.

"ఏం కావాలి?" అని అడిగాను.

"రమ్," అన్నాడా మనిషి. నేను గ్లాసు పట్టుకుని లోపలికి వెళ్ళబోతున్నాను. అతడు నన్ను దగ్గిరికిరమ్మని సంజ్ఞచేశాడు. నేను ఉన్నచోటే ఆగాను.

"దగ్గిరికిరా నాయనా. ఒక్కమాట చెప్పాలి."

నేను దగ్గిరికి వెళ్లాను. అతడు బల్లమీద ఆనుకుని రహస్యంగా అడిగాడు:

"నా స్నేహితుడు బిల్ లోపలున్నాడా?"

నాకు బిల్ ఎవడో తెలియదని, కెప్టెన్ అని మేముపిలిచే మనిషిమాత్రం మా హోటల్లో ఉంటున్నాడనీ చెప్పాను.

"నా స్నేహితుడు బిల్ ఉన్నాడే, వాడికి కెప్టెన్ అని పిలిపించుకోవడం ఒక సరదాలే. ఒక చెంప మీద కత్తిగంటు ఉంటుంది, కుడి చెంపమీద. అవునా? ఎప్పుడూ రమ్ము సారాలో మునిగితేల్తూ ఉంటాడు. కదూ? ఆ. ఇప్పుడు చెప్పు. నానేస్తం బిల్ లోపలున్నాడా?"

బయటికి షికారుగా వెళ్లాడని చెప్పాను.

"ఎటువేపు వెళ్లాడమ్మా, బీచివేపా, ఇటువేపా?"

నేను కెప్టెన్ వెళ్లినదిక్కు చూపించాను. "సరే" అనిమాత్రం అన్నాడు ఆ కొత్తమనిషి. హాలును, ద్వారాలను, కిటికీలను జాగ్రత్తగా పరీక్షించాడు. ఒక కన్నుమాత్రం సింహద్వారం కేసివేసే ఉంచాడు. అతని ధోరణిచూస్తే ఎలుకలకోసం పొంచివున్న జంగురుపిల్లి జ్ఞాపకంవచ్చింది. నేను కెప్టెన్ వస్తున్నాడేమో చూద్దామని వాకిట్లోకి వెళ్లాను. వెంటనే ఆ కొత్తవాడు నన్ను లోపలికి వచ్చెయ్యమని ఆజ్ఞాపించాడు. నేను "వస్తానులే" అన్నట్టుగా అక్కడేనుంచున్నాను. దాంతో అతని ముఖం కోపంతో కందగడ్డలాగైంది. "రావేం" అని గద్దించాడు. నేను భయపడి తక్షణం లోపలికివచ్చాను. అతడు మళ్లీ మామూలు మనిషైపోయాడు. ప్రేమగా నాజుట్టు నిమురుతూ, "నువ్వు చాలా మంచివాడవమ్మా. నాకు సరిగ్గా నీలాంటికొడుకే ఉన్నాడు. అచ్చు నీలాగే ఉంటాడు. కాని చూడు. మా అబ్బాయి నే నేది చెబితే అది వింటాడు. పిల్లలు పెద్దవాళ్లేం చెప్పినా చెయ్యాలి. లేకపోతే చెడిపోతారు. బిల్ గాడితో నువ్వెప్పుడన్నా పడవలో ప్రయాణంచేసివుంటే తెలిసేది. వాడిమాట వినకపోతే తలబద్దలుగొట్టేయడమే వాడిపద్ధతి. ఆ, అడుగో వస్తున్నాడు నానేస్తం. ఆ పాతటెలిస్కోపూ, వాడూ తయారు. అబ్బాయ్, నేను లోపల గదిలో దాక్కుంటాను. వాడు రాగానే కాస్త బెదరగొడదాం. వెధవ నన్నాసిని చూసి చాలా ఏళ్లయింది—" అంటూ కొత్తమనిషి నన్నుకూడా లోపలికి తోశాడు. నన్ను అడ్డంపెట్టుకుని తలుపుచాటున దాక్కున్నాడు. నేను "ఇదంతా ఏమిట్రా" అని భయపడ్డమాట వాస్తవం. కొత్తమనిషికూడా భయపడుతున్నట్టు అతని ముఖం చూస్తేనే తెలుస్తోంది. నడుముకు తగిలించుకున్న వంకరకత్తిని బైటికితీసి రెడీగా పట్టుకున్నాడు.

కెప్టెన్ హాల్లోకి ప్రవేశించాడు; తలుపులు భద్రంగా మూసి అటూ ఇటూ చూడకుండా మేడ మెట్లకేసి వెడుతున్నాడు.

"బిల్!" అనిపిలిచాడు కొత్తమనిషి వణుకుతూ.

కెప్టెన్ గిరుక్కున వెనక్కి తిరిగి మమ్మల్ని చూశాడు. చూస్తుండగానే అతని ముఖం పాలిపోయింది. కళ్లలో అర్థంకాని భయం ప్రవేశించింది. చీకట్లో దెయ్యాన్నో, తాచుపామునో చూసినవాడిలా తయారయ్యాడు.

"బిల్! మర్చిపోయావా, నీ పాతకాలపు నేస్తాన్ని."

"నల్లకుక్క!!—" అన్నాడు కెప్టెన్.

"ఆ, నల్లకుక్కనే. నా మారు పేరుకూడా జ్ఞాపకముందీ? నువ్వు 'బెన్‌బౌ' హోటల్లో మకాం చేశావని తెలిసి చూసి పోదామని వచ్చాను. బిల్లీ, ఎన్నాళ్లైందిరా మనిద్దరం కలుసుకుని? ఎల్లాగైనా

ఆరోజులే మంచివనుకో. అప్పుడుండే ఉషారేదీ ఇప్పుడు."

"అరేయ్ నల్లకుక్కా! నే నిక్కడున్నట్టు ఎవరు చెప్పారోగాని, రానేవచ్చావు. సరే. ఇదుగో ఇక్కడే వున్నాను; ఏం చేస్తావో చేసుకో. ఏం చెబుతావో చెప్పుకో."

"అదేమిట్రా బిల్, నేను రాకరాకవస్తే, అంత తలబిరుసుగా మాట్లాడుతావ్? ముందు ఈ అబ్బాయి చెరోగ్లాసు రమ్ము తెస్తాడు. కాస్త రుచి చూసి, తాపీగా కూర్చుని పిచ్చాపాటీ చెప్పుకుందాం."

నేను రమ్ముగ్లాసుల్తో తిరిగివచ్చేసరికి, ఇద్దరూ బల్లవద్ద చెరోవైపునా కూర్చున్నారు. నల్లకుక్క తెరిచిన ద్వారానికి దగ్గిరగా కుర్చీ వేసుకుని ఒకపక్కగా కూర్చున్నాడు. అవసరమైతే పారిపోవడానికి వీలుగా కూర్చున్నట్లు తోచిందినాకు.

నల్లకుక్క నన్ను అవతలకు పొమ్మని ఆజ్ఞాపించాడు.

"అబ్బాయ్, చాటునించి విందామని అనుకుంటున్నావేమో, జాగ్రత్త!" అని హెచ్చరించాడు. నేను లోపలికివెళ్లి పోయాను.

చాలా సేపటివరకూ నేను విందామని ఎంత ప్రయత్నించినా వారిమాటలు వినిపించలేదు. గురగురమని రొదమాత్రం వినవచ్చింది. కాని క్రమంగా మాటలు జోరెక్కాయి.

"ఉహూ, ఉహూ, ఉహూ. ఉహూ అంటే ఉహూయే. ఏం లాభంలేదు. నేనివ్వను," అని కెప్టెన్ కఠినంగా అనడం వినిపించింది.

హఠాత్తుగా బూతులు, తిట్లు, ఇతర శబ్దాలు చెలరేగాయి. బల్ల, కుర్చీ ధన్‌మని తిరగదోయబడినై. కత్తులు ఖంగు ఖంగుమని మోగినై.

"బాబోయ్," అని బాధతో కూడిన కేక వినిపించింది. మరుక్షణంలో నల్లకుక్క బైటికి ఉడాయించాడు. కెప్టెన్ కత్తి ఝుళిపిస్తూ వెంటబడి తరుముతున్నాడు. నల్లకుక్కకు ఎడమ బుజంనుంచి రక్తం ధారలుగా కారుతున్నది. గేటు తలుపుదాకా పరిగెత్తి కెప్టెన్ కత్తివిసిరాడు. అది తగిలివుంటే నల్లకుక్క అక్కడే నిలువునా చీలిపోయేవాడు. కాని తలుపుకు పైగా వేళ్లాడుతున్న మాహోటలు బోర్డుకు తగిలింది కత్తి.

రోడ్డుమీద పడగానే నల్లకుక్క బుజంమీది గాయాన్నికూడా లెక్కచెయ్యకుండా పరుగులో తనకుగల ప్రావీణ్యాన్ని ప్రదర్శించాడు. కెప్టెన్ కాసేపటివరకు బోర్డుకేసి చూస్తూ అక్కడే నిలబడ్డాడు. చివరికి ఇంట్లోకి తిరిగివచ్చాడు.

"దెబ్బతగిలిందా, కెప్టెన్?" అని అడిగాను.

"జిమ్! రమ్ తీసుకురా," అన్నాడతడు. నిలబడలేక అటూ ఇటూ తూలుతూపోయి గోడ నానుకున్నాడు. "నేనిక్కణ్ణించి త్వరగా మూటాముల్లె కట్టెయ్యాలి," అని రెండు మూడుసార్లు గొణుక్కున్నాడు.

నేను రమ్ముకోసం పరిగెత్తాను. ఆకంగారులో ఒక గ్లాసుబద్దలు కొట్టాను. ఇంకోగ్లాసులో గబగబా రమ్మునింపి తీసుకు రాబోతుండగా హాల్లో ధడేలుమని శబ్దమైంది. వచ్చిచూస్తే కెప్టెన్ సాష్టాంగంగా నేలమీదపడిపోయి వున్నాడు. ఇంతలో ఈగలభా అంతా విని మా అమ్మ మేడమీదనుండి కిందికి పరుగెత్తుకుంటూ వచ్చింది. మేమిద్దరం సాయంపట్టి కెప్టెన్ ముఖం పైకెత్తగలిగాము. కష్టంగా ఊపిరి పీలుస్తున్నాడు; కళ్లుమూసుకునే ఉన్నాయి; ముఖం వివర్ణమై భీకరంగా వుంది.

"ఏమిట్రా నాయనా ఈగొడవంతా? ఈ దరిద్రపుగొట్టు ముండాకొడుకు మనకెక్కడ దాపు

రించాడురా?" అని మా అమ్మ గోలచేసింది.

కెప్టెన్‌ను ఏం చెయ్యాలో మాకు తోచలేదు. ఎక్కడ దెబ్బతగిలిందో కనిపించనన్నా లేదు. రమ్ము పోస్తే తెలివి వస్తుందేమోనని నోరు తెరవాలని ప్రయత్నించాముగాని పళ్లు గట్టిగా కరుచుకుని ఉన్నాడతను.

ఇంతలో డాక్టర్ లివ్‌సే తలుపుతోసుకుని లోనికివచ్చాడు. ఆయన మానాన్న కెల్లావుందో చూసి పోవడానికి వచ్చాడు. డాక్టర్ను చూడగానే మాకు ప్రాణం లేచివచ్చింది.

"డాక్టర్, ఏం చేద్దాం? ఇతడు దెబ్బతిని పడిపోయాడు," అంది మా అమ్మ.

"దెబ్బా? దెబ్బలేదు ఏం లేదు. నేను ఇదివరకే చెప్పాను, తాగుడు మానకపోతే మూర్ఛరోగం ఎక్కువౌతుందని. శ్రీమతి హాకిన్స్! మీరు మేడమీదికి వెళ్లి మీ ఆయనను కనిపెట్టి ఉండండి. ఇక్కడ జరిగిందేమీ చెప్పకండి. నేను ఈ తాగుబోతుగాడి వ్యర్థజీవితాన్ని కాపాడ్డానికి శాయశక్తులా పనిచేస్తాను. జిమ్! పళ్లెంలో కాసిని నీళ్లు తీసుకురామ్మా."

నేను పళ్లెంలో నీళ్లు తీసుకు వచ్చేసరికి డాక్టరు కెప్టెన్ కోటుచేతులు పైకి ఎగదోశాడు. బలిష్టమైన చేతిమీద వరసగా పచ్చబొట్లు ఉన్నాయి. ఏమి టేమిటో బొమ్మలు, "బిల్లీబోన్స్" అని అక్షరాలు పచ్చబొట్లుగా పొడిచివున్నాయి. బుజానికి సమీపంలో, ఉరితీయబడుతున్న మనిషిబొమ్మ వేయబడివుంది. ఆబొమ్మనిచూపిస్తూ డాక్టరు "తనకు పట్టబోయేగతిని ఇతను ముందే గ్రహించి ఈ బొమ్మ వేయించినట్టున్నాడు. బలేగావుంది," అన్నాడు. తరవాత నాకేసి తిరిగి "జిమ్! నీకు నెత్తురుచూస్తే భయమా?" అన్నాడు.

"లేదండి"

"అచ్ఛా. చూడు, ఈపళ్లెం ఇల్లా పట్టుకో," అంటూ తనచాకుతీసి కెప్టెన్ చేతిమీద గంటువేశాడు. ఒకనరం తెగింది. నెత్తురు చాలాకారింది పళ్లెంలోకి. కెప్టెన్ మెల్లిగా కళ్లు తెరిచి చుట్టూచూశాడు. డాక్టర్ను చూసి గుర్తుపట్టి కోపంగా మూలిగాడు. తరువాత నన్నుచూసి కాస్త తేరుకున్నాడు. వెంటనే ముక్కుతో బుర్రుమని శబ్దంచేస్తూ లేవడానికి ప్రయత్నించాడు.

"ఏడీ నల్లకుక్క?" అని అరిచాడు కెప్టెన్.

"ఇక్కడ నల్లకుక్కాలేదు. తెల్లకుక్కా లేదు. నువ్వు రమ్ తెగతాగినట్టున్నావు; నేను చెప్పినట్టుగానే స్మారకం తప్పిపడిపోయావు. నా కిష్టం లేకపోయినా, డాక్టర్నిగనక, శ్మశానంలోకి ఒకఅడుగు వేసిన నిన్ను ఇవతలకు లాక్కొచ్చాను. సరేకాని మిస్టర్ బోన్స్—

"నాపేరు బోన్స్‌కాదు," అని కెప్టెన్ అడ్డం వచ్చాడు.

"కాకపోవచ్చు. బిల్లీ బోన్స్ అని నే నెరిగిన సముద్రపుదొంగ ఒకడుండేవాడులే. నిన్ను చూస్తే వాడు జ్ఞాపకంవచ్చాడు. నీ పేరు నాకు తెలియదు గనుక బోన్స్ అనే నిన్ను పిలుస్తాను. సరే, నీ కొక్కమాట చెబుతాను మళ్లీ. ఒక గ్లాసెడు రమ్ తాగితే నీకేం ఫర్వాలేదు. కాని ఒకటి తాగితే ఇంకోటి తాగుతావ్. ఇంకోటితాగితే మరోటి తాగుతావ్. అంచేత నేను పందెంకాసి చెబుతున్నాను—నువ్వాట్టే రోజులు బతకవని. అర్థమైందా? చచ్చిపోతావ్ కొద్దిరోజుల్లో. చచ్చి, వేరే చెప్పక్కర్లేదు ఏ లోకానికి పోతావో. లే, నుంచో. ఈసారికి నీపక్కదాకా తీసుకు వెడతాను. నడు."

అతిప్రయాసమీద కెప్టెన్‌ను నిలబెట్టి, మేడమెట్లు ఎక్కించి, మంచంమీద పడుకోబెట్టాము. తలుపులు మూస్తూ డాకరు మళ్లీ అన్నాడు: "మిస్టర్ బోన్స్! జాగ్రత్త. మళ్లీ నేను చెప్పలేదనుకునేవ్."

తరవాత డాక్టరు మా నాన్నను చూడటానికి వెళ్లాడు. నేనుకూడా ఆయనవెంట వెళ్లాను.

"ఆ, ఇప్పటికేం ఫరవాలేదు. చాలా నెత్తురు లాగేశాను. కనక కొంతకాలందాకా రోగం తిరగబెట్టదు. వారం రోజులవరకూ వాణ్ణి కదలకుండా చూడండి. కాని ఈసారి మళ్లీ మూర్ఛవచ్చిందో, చచ్చాడన్నమాటే. నేనేకాదు, దేవుడుకూడా వాణ్ణి రక్షించలేడు," అని చెప్పాడు డాక్టరు.

(ఇంకావుంది.)

# పాత బాకీ

(22-వ పేజీ తరువాయి)

రావాలిసుమా' అని హెచ్చరించి బండి కట్టించుకొని బయలుదేరాడు.

పెండ్లిపిలుపు అయింది కాని, పెండ్లికి యివ్వమన్న డబ్బు బావను అడగలేదు రామన్న. పెండ్లిఖర్చుకు కావాలన్నాడే, అడిగితే దెందుకో! ఆ సంగతి నే నెందుకు యెత్తాలి. అడగందే మంచి' దనుకున్నాడు సీనయ్య.

నాల్గురోజు లుండనగానే ముందుగా చెల్లెల్ని పంపమని, బావనుకూడ త్వరగా రమ్మనమని కబురంపాడు రామన్న. మర్నాడే చెల్లెలువచ్చింది. పెండ్లిపనులు సిద్ధంచేసుకొని వున్నారు. తనకున్న తాహతుప్రకారము పెండ్లిప్రయత్నాలు చేసుకున్నాడు. అంతా పెండ్లి అడావిడిలో వున్నారు.

రెండవరోజు పెండ్లి అనగా సీనయ్య కూడా వచ్చి చేరాడు. అనుకున్న లగ్న నిశ్చయంరోజుకు పెండ్లివారు చేరుకున్నారు. ఉదయం పదింటికల్లా 'చిన్ని'ని పెండ్లికూతురును చేశారు. బాజాభజంత్రీలతో క్లుప్తంగా పెండ్లిజయప్రదంగానే జరిగింది.

మూడునిద్రలు కాగానే ఎటువారటు వెళ్లారు, సీనయ్యకూడా భార్యతో ప్రయాణమౌతున్నాడు. 'అందరూ ఒక్కసారే వెళ్లితే యింట్లో యేమీ తోచదు' అని బలవంతము చేయగా, భార్యను వుంచి తనొక్కడే వెళ్లాడు.

అదృష్టపు రోజులేమో! పసిబిడ్డ పుట్టిన ప్పటినుండి గొడ్ల బేరముగాని, సంసారవిషయములలో గాని కలిసి వస్తున్నది రామన్నకు. కూతురిపెండ్లి చేసుకున్నాడు. బావధర్మాన పాతబాకీ వచ్చినట్టే. వృద్ధిలోకి వస్తున్న కోడెదూడ యింట్లో వుంది. ఇంకేమి కావాలి. ఈ పెట్టుబడిమీదనే మారుబేరాలు చేస్తూ ఒకదానికొకటి కూడేసుకొని వ్యాపారము సాగిస్తున్నాడు. ఈ సంగతి బావతో చెప్పాలనుకున్నాడు.

చెల్లెలు వచ్చి చాలా రోజులయింది. తను బావగారి వూరుపోక యెన్నో రోజులయింది. అందుకని చెల్లెల్ని తీసుకొని బావగారి వూరు వెళ్లాడు. ఆరోజు అచ్చటనే వుండక తప్పిందికాదు.

భోజనానికి యింకా ఆలస్యమున్నదని, మిద్దెమీదికి వెళ్లి కూర్చున్నారు. మాటల సందర్భంలో వ్యాపారం విషయాలు చర్చకు వచ్చాయి. అంతలో భోజనానికి పిలుపు వచ్చినందున క్రిందికివచ్చినారిద్దరు.

భోజనానంతరము వరండాలో అరుగుమీద కూర్చొని చుట్టలు వెలిగించారు. వర్షం వచ్చే సూచనలుండి, చలిగాలిగా వున్నదని వరండాలోనే పడక ఏర్పాటు అయింది.

"డబ్బుసంగతి చెబితే యేమనుకుంటాడో బావ; ఎప్పటికైనా చెప్పాలిగా. మర్మమేముంది యిందులో" అనుకొని

"అయిదువందల దాకా గేదెల బేరానికి యిచ్చావు. వాటివల్లనే. చేతిలో పైసాలేని సమయములో పెండ్లియిబ్బందికి వాడుకున్నా. చిల్లరఅప్పులు పీక్కుతింటుంటే కొంత ఖర్చు అయింది. ఖర్చునపడివున్నా. సంసారం గడవటంకూడా కష్టంగా వుంది- ఈ సమయంలో ఈ సంగతి చెబుదామని వచ్చా నీ వేమనుకుంటావో అని." అని ప్రాధేయపూర్వకంగానే చెప్పుకున్నాడు.

"బాగానే వుందోయ్ యీ యెత్తు! దానికని దీనికని బాకీ వసూలుచేసినట్టుందే? 'నాకు యివ్వవలసింది యివ్వమని' ఖచ్చితంగా అడుగుతే యివ్వనన్నానా? మొన్న యీమధ్య అడిగితే పత్తి అమ్మి యిస్తానన్నాగా. నీసొమ్ము నాకెందుకు? కష్టపడి వ్యాపారం చేసుకుంటుంటే, దాంట్లో వచ్చే లాభంతో నీసంసారం గడుస్తుంటుంది. నీకు యివ్వవలసిన డబ్బు, అంతగా యిబ్బందిగా వుంటే యివ్వొచ్చు. లేకపోతే నా యిబ్బంది సిబ్బందులకు ఆసరగా వుంటుందనుకున్నా. నాదేం పోయింది- నేను మునిగింది లేదుగా! కావలసినది మాటా మంచీ. నాలుగు రోజుల్లో యిద్దామనుకున్నదేగా" అన్నాడు ధర్మదాతలాగ.

"అడిగితే అంత కష్టమెందుకు బావా!... వూరికే యిస్తున్నట్టు విసుక్కుంటున్నావ్? కష్టార్జితపు డబ్బు నీవద్ద వుంచుకొన్నది. కోపగించుకొని తగవులాడే దేముంది దీంట్లో. పెండ్లికి యితరత్రా ఖర్చునపడి వున్నా. సంసారం గడవాలి యింకా. ఇది కూడా నీ చలవే అనుకుంటా; తతిమ్మా రెండువందలు యిచ్చావంటే తీరిపోతుంది పాతబాకీ. ఏదో సామెతగా వున్నది మన వ్యవహారము." అని ఖచ్చితంగానే అడిగేశాడు.

"ఎప్పుడో ఒకప్పుడు కొద్ది కొద్దిగా యిస్తూ కాలయాపన చేద్దామనుకుంటే 'గూగూ' వాడిలాగా పాతబాకీ యుక్తిగా లాగేశాడే చేతికి చిక్కిందనీ :. చేసేదేముంది? ... ఎట్లాగూ అయిదువందలు చేజారిపోయినవి. వడ్డీ పెరగట మెందుకు. నోటు నోటుగా ఎందుకుండాలి. చెల్లు వేయించుకోవాల్సిందే" అనుకున్నాడు సీనయ్య.

చాలా ప్రొద్దుపోయిందాకా డబ్బు వ్యవహారంతోటే కాలము వెళ్లబుచ్చారు. నిద్ర ఆపుకోలేక సీనయ్య మాట్లాడుతూనే నిద్రపోయినాడు. గడచిన విషయాలు ఆలోచిస్తూనే రామన్న కూడా తల వాల్చాడు.

రాత్రంతయు వాన తుప్పరలు పడుతూనే యున్నవి. తెల్లవారు ఝామునకు చినుకులు ఆగిపోయిననే కాని, చలిగాలి వీచుచున్నది. నల్లని మేఘములు ఆకాశము నలముకొని తెల్లవారినప్పటికి సూర్యరశ్మి లేక మునిమునిచీకటిగానే వున్నది.

తెల్లవారిందని లేచి కూర్చున్నాడు రామన్న. అప్పటికే బారెడు ప్రొద్దెక్కింది. త్వరగా లేచి కాలకృత్యములు తీర్చుకొని ప్రయాణ మౌతున్నాడు. యింతలోనే సీనయ్యకూడా లేచి గబగబా ముఖం కడుక్కొని, బావమరది చెప్పకుండా పోతాడేమోనని, త్వరగా వచ్చి కూర్చున్నాడు.

"కొద్దో గొప్పో బేరంలో లాభం వస్తుంటుంది. అయిదువందలు గేదెలకు ఖర్చుపెట్టి యిచ్చానాయె. యింకేం కావాలి! ఇంకా డబ్బు అడుగుతున్నావేమోయ్? నేనిచ్చేది లేదు, నీవు తీసుకునేది లేదు. నీ కివ్వాల్సినదానికన్నా ఎక్కువగానే ముట్టింది. నీకు తెలియదూ తిన్నవాడివి. నోటు చెల్లేసిపో" అన్నాడు.

"పేచీ పెట్టుకోకుండా యింతటితో ఈ పాడుపీడ వదిలిందనుకున్నాడు." రామన్న.

"సరే నీయిష్టమువచ్చినట్లు కానియ్యి బావా. నేను నీమాట కాదన్నానా'" అని నోటు చెల్లువేసి యిచ్చాడు.

తగవులాటదాక ముదరక సవ్యంగానే ఒప్పందాలు జరిగాయి చేసేది లేక. 'మొండి బాకీ, పాతబాకీ వసూలైందని' రామన్న, 'అయిదు వందలతో, ఏడువందల రూపాయిల నోటు చెల్లు అయిందని' సీనయ్య, యిద్దరూ తృప్తిపడ్డారు అంతటితో.

రామన్న మూటముల్లె సర్దుకొని బయలుదేరాడు, ఇంటికి పోదామని. చెల్లెలి బలవంతముమీద 'చల్దిఅన్నం వుంది, తిని పొమ్మంటే' అన్నం తిని "అమ్మాయి రంగమ్మా! బావధర్మమంటూ, 'చిన్ని' పెండ్లి జరిగింది. అప్పులుంటే తీరిపోయినవి. పిల్లవాడు పుట్టిన ఘడియ-కోడెదూడ వచ్చిన వేళా విశేషమేమో! నా సంసారం చక్కబడి, నాలుగురాళ్లు సంపాదిస్తున్నా. మొండి కేసుకొని నీళ్లొదులుకున్న 'పాత బాకీ' వసూలయింది తల్లీ! యిక నేను పోయివస్తా" అంటూ యింటిదారి బట్టాడు రామన్న.

★

# సినిమా చిత్రాలలో వాతావరణం

సినిమా చిత్రాలకు కథ ఎంత అవసరమో ఆ కథకు వాతావరణం అంత అవసరం.

మామూలుగా పుస్తకాలలో గాని, పత్రికలలో గాని మనం చదివే కథలలో వాతావరణానికి సంబంధించిన వర్ణనలు వగైరా కొద్దిగా మాత్రమే ఉన్నప్పటికీ కథ చదివి ఆనందించగలుగుతాం. కథ పల్లెటూరికి సంబంధించినదనగానే పల్లెటూరి వాతావరణం యావత్తూ మన కళ్లకు కట్టినట్టవుతుంది. పశువుల దొడ్డి అనగానే కట్టివేసిన పశువులూ, వాటి మెళ్లో గంటలూ, అవి మేత మేసే చప్పుడూ, శ్వాస విడిచే చప్పుడూ, తోకలతో జోరీగల్ని తోలుకోవటమూ, గడ్డిమోపులూ, కుడితితొట్లూ అన్నీ స్ఫురిస్తాయి. అందుచేత మామూలు కథకులు వాతావరణాన్ని కథ చెప్పటానికి అవసరమైనమటుకే క్లుప్తంగా వర్ణిస్తారు.

ఈ సౌకర్యం సినిమాకథకు లేదు. సినిమాకథలో కథనం లేదు. పాత్రల సంభాషణలు తప్ప వేరే మాటలుండవు. అందుచేత సినిమా కథ తాలూకు వాతావరణం ప్రేక్షకుడు ప్రత్యక్షంగా చూడవలసిందే.

ప్రస్తుతం మన చిత్రాలలో వాతావరణం తరుచు సంతృప్తికరంగా ఉండటం లేదు. దీనికి మూడు కారణాలుంటున్నాయి. కొన్ని చిత్రాలలో ఇది అసమగ్రంగా ఉంటున్నది. మరి కొన్ని చిత్రాలలో తప్పుగా ఉంటున్నది; కొన్ని చిత్రాలలో వాతావరణం కథను రక్తికట్టించటానికి అనుకూలంగా వినియోగపడటం లేదు.

ఏ రాజభవనమో చూపిస్తారు. అందులో ఎంత కథ నడిచినా ఒక పరిచారకుడుగాని ఒక దాసీగాని కనిపించదు. కొన్ని కొన్ని సినిమా రాజభవనాల్లో రాజూ, రాణీ, కూతురు (లేక కొడుకు) తప్ప మరో పురుగుండదు. రాజును పిలుచుకురావటానికి రాణీ స్వయంగా వెళ్లుతుంది. చితికిపోయిన జమీందార్ల వెంట కూడా అరడజనుమంది నౌకర్లుంటారు గాని సినిమారాజులు నౌకరుకు నోచుకోకపోవటం కద్దు. ఈ రాజులు బయటికి వెళ్లవలసినప్పుడు కాలినడకనే పోతారు గాని వాహనాలుండవు. ఎప్పుడన్నా గుర్రం ఎక్కితే రాజు కొడుకు ఎక్కుతాడు గాని రాజుగారెక్కరు. ఇది అసమగ్రవాతావరణం.

తప్పుడు వాతావరణంకూడా ఉంటుంది. రైతు ఇల్లంటారు. అది రైతు ఇల్లని ఏ పల్లెటూరి వాడూ అనుకునేటట్టుండదు. రైతు ఇంట ఉండే వస్తువులేవీ అందులో ఉండవు. రైతు ఇంట ఉండనివి చాలా ఉంటాయి. పల్లెటూరి వాతావరణం తెలియనివారు సినిమా చిత్రాలు తీయటంవల్ల ఇట్లా జరుగుతున్నదనుకోవటానికి, బస్తీ వాళ్ల ఇళ్లూ, పట్నం వాళ్ల ఇళ్లూ చూసినప్పుడు కూడా అసహజమైన వాతావరణం చూపుతున్నారు. వీటినిగురించి ప్రత్యేకమైన ఉదాహరణ ఇవ్వనవసరం లేదు. నూటికి 99 చిత్రాలలో మనం ఇళ్లనుకుని చూసేవి ఎవరి ఇళ్లూ కావు.

ఇటువంటి విషయాలలో నూటికి నూరుపాళ్లు సహజత్వం ఉండటం సాధ్యమూ, వాంఛనీయమూ కూడానూ. ఈ సహజత్వం ఒక్క ఇళ్లవిషయంలోనే కాదు. స్టూడియో ఆవరణలో వేసుకునే బహిరంగ ప్రదేశ దృశ్యాలన్నిటిలోనూ ఉండాలి. సామాన్యంగా ఇప్పుడు స్టూడియో ఫ్లోర్‌లోనే అడవులూ, తోటలూ, కొండలూ, వీథులూ కొలనులూ, పొలాలూ మొదలైనవి నిర్మిస్తున్నారు. ఇవి కూడా వాస్తవికంగా ఉంటేతప్ప లేకపోతే కథకు తగిన వాతావరణం పూర్తిగా ఏర్పడదు.

వాతావరణం కేవలం పరిసరాలపైనే ఆధారపడనవసరం లేదు. పొలాల్లో కోతలు కొయ్యటం, కుప్పలు నూర్పటం, ధాన్యం తూర్పారబట్టటం, ఏతాం తోడటం, నాట్లు వెయ్యడం మొదలైనవి చెయ్యటంలో కూడా వాస్తవికత స్ఫురించాలి. సాధారణంగా సినిమాలలో కోతలు కొయ్యటానికి వచ్చేవారికి పాటలు పాడటమూ, దరువు ప్రకారం మెలికలు తిరగటమూ, అభినయం చెయ్యటమూ తెలిసినట్టుగా కోత కోయటం తెలీదు. ఇదంతా సరి అయిన వాతావరణం కింద జమకాదు.

కథ తాలూకు వివిధ సన్నివేశాలకు తగ్గ వాతావరణం కల్పించటం ఒక ఎత్తూ దాన్ని ఉపయోగించుకుని సన్నివేశాలను రక్తి కట్టించుకోవటం మరొక ఎత్తూనూ. వాతావరణాన్ని దుర్వినియోగ పరచుకోవటమూ, సద్వినియోగం చేసుకోలేకపోవటమూ కూడా ఉంటుంది. కథ యొక్క అవసరాలకు మించి వాతావరణాన్ని సృష్టించి దానికోసం కథను నిలిపిపెట్టటం తప్పు. కథ మరింత రక్తికట్టేటందుకు వాతావరణాన్ని పూర్తిగా ఉపయోగించుకోలేకపోవటం మరొక తప్పు.

మన చిత్రాలలో ఏ వీధినాటకాలో, జాతర్లో, కోయవాళ్లో వచ్చినప్పుడు వాళ్ల ఆర్భాటాలతో అనేక వందల అడుగులు వృధాచేసి కథ సాగకుండా చెయ్యటం చూస్తూనే ఉన్నాం. వాతావరణాన్ని పూర్తిగా ఉపయోగించుకోలేకపోవటం కూడా అప్పుడప్పుడూ జరుగుతున్నది. ఉదాహరణకు "పాతాళభైరవి" తీసుకోవచ్చు. ఇందులో భీభత్స, భయానక దృశ్యాలు సమృద్ధిగా ఉన్నాయి. వీటికి తగ్గ వాతావరణం కూడా ఉన్నది. మంత్రాల మర్రీ, కత్తుల సారంగమూ, బొడ్డు దేవరా, పాతాళభైరవి ఆలయమూ, మొసలి కొలనూ, భూతాలూ, దేవతలూ, నరబలీ మొదలైనవి ఉన్నాయి. నేపాళ మాంత్రికుడి దుస్తులలోనూ, గుహలలోనూ, మంత్రాల మర్రి బోదెలోనూ కొన్ని వికారాకారాలు సూచించబడ్డాయి. వీటన్నిటినీ సరిగా "లైట్" చేసి సందర్భోచితంగా

[illegible]

[illegible]

[illegible]

# ప్రపంచ చలన చిత్రోత్సవం

[illegible]

[illegible]



[illegible] "పెళ్ళి చేసి చూడు" చిత్రంలో ఒక సన్నివేశం.

27 వరకు, న్యూఢిల్లీలో డిసెంబరు 28 నుండి జనవరి 3 వరకు, కలకత్తాలో జనవరి 4 నుండి జనవరి 10 వరకూ ప్రదర్శనోత్సవాలు కొనసాగుతాయి.


ప్రపంచంలో చలనచిత్రాలు ఉత్పత్తి చేసే 25 ప్రధాన దేశాలు ఉత్సవంలో పాల్గొంటాయి. ఆయా దేశాలు 1950 అక్టోబరు 1 నుండి ఉత్సవ ప్రారంభం వరకూ ఉత్పత్తిచేసిన ఫిల్ములలో నే ఉత్తమమైన వాటిని ఎంచి ప్రదర్శిస్తారు.

చలనచిత్రాల పోటీలో ప్రదర్శింపబడదగిన ఉత్తమ చిత్రాలను నిర్ణయించేందుకు కొందరు నిర్ణేతలను నియమిస్తారు. ప్రదర్శింపబడిన ప్రపంచచిత్రా లన్నిటిలోను ఉత్తమోత్తమ చిత్రాన్ని నిర్ణయించేందుకు మరికొందరు నిర్ణేతలను నియమిస్తారు. బహుమతులు ప్రపంచ ఉత్తమ చిత్రానికి, ఉత్తమ దర్శకునికి, ఉత్తమ నటికి, ఉత్తమ నటునికి, ఉత్తమ ఛాయాగ్రాహకునికి ఇవ్వబడతాయి. ఆసియాదేశాల ఉత్తమ చిత్రానికి, భారతీయ ఉత్తమ చిత్రానికి, కూడా ప్రత్యేక బహుమతు లివ్వబడతాయి. (సోవియెట్ రష్యా ఆసియా దేశాల్లో చేర్చబడింది.)

ఉత్సవం ఏర్పాటులు చేయడానికి ఒక సంఘం నియమింపబడింది. దీనికి కేంద్ర సెన్సారుబోర్డు అధ్యక్షుడైన క్లిఫర్డ్ అగర్వాలా అధ్యక్షుడు. ఎస్. కె. పాటిల్, చందూలాల్ షా, వి. శాంతారాం, ఎస్. ఎస్. వాసన్, హెచ్. ఎమ్. రెడ్డి మొదలైన ప్రముఖు లిందులో సభ్యులు. హెచ్. ఎం. రెడ్డి గారు మద్రాసులో ఉత్సవపు ఏర్పాట్లకు అధ్వర్యం వహిస్తారు.

ఫిల్ముపరిశ్రమలో అంతర్జాతీయ ఖ్యాతి పొందిన సెసిల్ బి. డిమిల్, సర్ అలెగ్జాండర్ కోర్డా, వాల్ట్ డిస్నీ, చార్లీ చాప్లిన్, ప్రఖ్యాత నటి ఇన్‌గ్రిడ్ బెర్గ్‌మన్, ప్రఖ్యాత నటుడు సర్ లారెన్స్ ఒలీవియర్, అతని భార్య, నటి వివియన్ లీ, ప్రసిద్ధ రచయితలు, జర్నలిస్టులు ఉత్సవానికి ఆహ్వానింపబడ్డారు.

వివిధ దేశాల్లో చలనచిత్రపరిశ్రమ ఏ విధంగా అభివృద్ధి పొందుతున్నదీ భారతీయులు గ్రహించడానికి, భారతీయ చలనచిత్ర పరిశ్రమ పరిస్థితిని ఇతర దేశీయులు గ్రహించడానికీ, వీలు కలుగజేసే ఇటువంటి ప్రదర్శనోత్సవాన్ని ఏర్పాటు చేస్తున్నందుకు భారత ప్రభుత్వాన్ని అభినందించవలసి వుంది. ★



నవయుగవారి "జ్యోతి" ప్రారంభోత్సవ దృశ్యం.

# సినిమా వార్తలు

సెప్టెంబరు 10 న మద్రాసు వాహినీ స్టూడియోలో నవయుగవారి తొలిసాంఘిక చిత్రం "జ్యోతి" కి ప్రారంభోత్సవం జరిగింది. విజయా ప్రొడక్షన్స్ మేనేజింగ్ డైరెక్టరయిన బి. నాగిరెడ్డిగారు కామెరా "స్విచ్ ఆన్" చేశారు. ప్రారంభోత్సవానికి అనేకమంది తారలూ, నిర్మాతలూ, ఇతర పెద్దలూ విచ్చేశారు. ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నవారు పి. విష్ణువర్ధనరావు గారు, డైరెక్షను చేస్తున్నవారు శ్రీధర్ గారు. జి. వరలక్ష్మి, కృష్ణకుమారి, రామచంద్ర కాశ్యప, శ్రీ రామమూర్తి, దువ్వూరి రాధ, మిక్కిలినేని మొదలైనవారు నటిస్తున్నారు.

# దెబ్బకి దెయ్యం జడుస్తుంది; కాని పారిపోతుందా?

(10 వ పేజీ తరువాయి)

లేదు. వెళ్లి ఆ పోలీస్ స్టేషన్లో చెప్పిరా!"

"కాదు నాన్నా!"

"మరేమిటి?"

"వాడు వాట్ని పట్టుకోపోయేడు."

"అవును. అలా అని ఊరుకోగలమా?"

"పోలీసుతో చెప్పి లాభం లేదు. ఊళ్లో నాలుగువూళ్లా కావలస్తే వెతికొస్తాను."

"ఈ యెండలోనా?" అంది అమ్మ.

"ఎండా లేదు వానా లేదు. వెళ్లడమే. అణాలా దమ్మిడీలా, ఊరికే విడిచిపెట్టెయ్యడానికి? తాతల్నాట్నించీ వొస్తున్న సొమ్ము." అన్నారు నాన్న.

"ఇన్నాళ్లూ మనకి రుణం ఉంది వాడుకున్నాం."

"ఆ అపశకునం మాటలే ఆడకండి. చిన్నా, వెళ్లి ముందు నాలుగుచోట్లా వెతుకు. తరవాత వాడి ఆనమాళ్ళూ అవీ పోలీస్ స్టేషన్లో చెప్పిరా." అన్నారు నాన్న.

చిన్నబాబు సైకిలు తీసుకెళ్తున్నాడు.

"ఒరే, కావలస్తే ఆ నోటుబుక్కు తీసుకుపో. మళ్లా అక్కడ జ్ఞాపకం రాకపోతే కష్టం."

"జ్ఞాపకం ఉంది."

తమ్ముడు వెళ్లిపోయాడు.

"ఏందారమ్మ నాకు? పిడికుచ్చుల్లాంటి సామాను. చిన్న చిన్న కన్నాలుంటే మాత్రం ఏదో వాడుకయిపోతూంటే కోతిలాగ వాడి యెదాన్న కొట్టేం!" అంది అమ్మ.

"ఊరుకుందూ, ఇంక నీ గోల పడాలి!" అన్నారు నాన్న.

"అన్నీ కలిపి ఎన్ని రూపాయలుంటాయి నాన్నా!" అన్నది చెల్లి.

"అవిప్పుడు కొనడానికి మనలాంటివాళ్లెవరూ లాభం లేదు...వాడు చూశా, నల్లిపో యేటప్పుడు మా మంచి టోపి! అన్నాడు!"

"జౌనాను." అన్నాడు వీడు.

"వెధవ యింత వుద్దేశం అంటుందని మనకేం తెలుసూ? యిదా టోపీ అంటే అర్థం?" అన్నారు నాన్న.

"టోపీ యేమిటే?" అంది అమ్మ.

"వాడు, గిన్నెలూ అవీ పట్టుకుపోతున్నప్పుడూ దస్తాగిన్నె నెత్తిమీద బోర్లించుకుని, మా మంచి టోపీ - అన్నాడు! అదీ వాడి వుద్దేశం!"

"మరి ఉత్తిదేనన్నా! మరి వాడు రాడు!" అన్నాడు వీడు.

"కాని దొంగతనం చెయ్యడానికి మా గొప్ప వుపాయం కనిపెట్టేడు సుమా! ప్రతీ వాడూ నమ్మి వస్తువిస్తాడు. ఈ డాయించే యవద్దు." అన్నారు నాన్న.

"సరిపోయింది." అంది అమ్మ.

వీధిలోంచి ఎవరో వచ్చారు.

"ఏమిటి చేస్తున్నారు?" అంటూ వచ్చిందావిడ.

"ఏమీ లేదమ్మా. పొద్దున్న గిన్నెలూ బిందెలూ బాగుజేస్తానంటూ ఓ దొంగవధవ వొస్తే వాడికి ఓ బిందే ఓ గంగాళం ఓ మూడు గిన్నెలూ యిచ్చేం. అవి పట్టుకు వాడెక్కడికో పారిపోయాడు. అన్నీ అయినాక అనుకుంటున్నాం." అంది అమ్మ.

"ఎన్నీ, ఎన్నీ?" అంది ఆవిడ.

"ఎన్నయితే నేమమ్మా? ఓ నూరూ నూటపాతిక రూపాయల సొమ్ము ఆ వెధవకి సమర్పించుకున్నాం. ఇక్కడే చెరువుగట్టు మీదే వుంటానన్నాడు. వెతికితే కనపడ్డు."

"ఆ యెర్ర జుబ్బావాడేనా, తలపాగా తెల్లటిది!"

"ఆఁ - వాడేనమ్మా!" అంది అమ్మ ఆశగా.

"మీకూ చేశాడూ, సరి!"

"ఏమమ్మా అలా అంటున్నారు?"

"నేనూ ఓ బింద యిచ్చానులెండి. మా అల్లుడితో ఓ అర గంటలో వొచ్చేస్తానన్నాడు. ఇక్కడే చెరువుగట్టుమీదే వుంటానన్నాడు. మా అల్లుడు వెళ్లి చూస్తే కనపడ్డు. అన్ని వీధులూ వెతికొచ్చేట్ట."

"మీరేం అంత చీమ కుట్టినట్టు మాట్లాడతారు? విచారం లేదా?" అన్నాడు వీడు.

"లేకపోవడమేం? ఉంది. చెప్పుకుంటే యేం లాభం పోయిన తరవాత?" అందావిడ.

"బాగా చెప్పారు! మరేమిటి సంగతులు? ఏం పనిమీదొచ్చారా, రండి లోపలికి!" అంది అమ్మ లోపలి కెళ్తూ. చెల్లి కూడా వాళ్లతో లోపలి కెళ్లింది.

మరో అయిదు నిమిషాల్లో చెల్లి కాఫీ పట్టుకొచ్చింది.

"మాశావురా బాబూ, కాఫీ నల్లగా వుంది!"

"పాల్లేవు నాన్నా, ఉన్నవన్నీ పోసినా యిలాగే వుంది!" అంది చెల్లి.

"అది గాదు. పొద్దున్న దింతోనే కదా ఈ గిన్నెలు పోవడం ఆరంభమైందీ అని!"

"అంటే?" అంది చెల్లి.

"పాలు గిన్నెలో పోసి పొయ్యిమీద పెడితే కారిపోయాయి. తరవాతనే గదా ఆ వధ వొచ్చాడు!"

వీధిలో తమ్ముడి అలికిడి అయింది. సైకిలు ఇంట్లో పెడుతూ "ఒక్క పోలీసు స్టేషనుకే వెళ్లేను. మిగతా వీధులు తిరగలేదు. వాడెలాగా దొంగని నాకు తెలుసు" అన్నాడు.

అలికిడి విని, లేక కలిసి చేసేపని అయిపోయినో, అమ్మ, ఆవిడ స్నేహితురాలూ వొచ్చేరు.

"ఏంరా బాబూ, ఎక్కడికెళ్లొచ్చేవు?" అంది అమ్మ.

"పోలీసుస్టేషను కెళ్లి వాడి ఆనమాళ్లు చెప్పొచ్చాను. అదంతా తిరగడం దండుగని పించి వొచ్చేశాను."

"మంచిపని చేశావు నాయనా, ఒకవేళ తిరిగినా లాభం ఉండేదు. మా అల్లుడు ఊరంతా తిరిగి తిరిగి యిప్పుడొచ్చేడు." అంది ఆవిడ.

"మీ అల్లుడేందుకు......" అంటున్నాడు తమ్ముడు.

"వాళ్లవీ పోయేయిట!" అన్నాడు వీడు.

"వాళ్లకి పెట్టేడు టోపీ!" అన్నారు నాన్న.

"ఒరే చిన్నా! మనింటిదగ్గిర, నువ్వు వాడి బుర్రమీద దస్తాగిన్నె బోర్లించాక 'మా మంచి టోపీ' అనలేదురా వాడు?"

"అంటే?"

"అదే! మనల్ని చెప్పి టోపీ కొట్టాడు!"

*　　*　　*

తలుపుతోసి నాన్న లోపలి కొచ్చేరు. ఆ చేత్తో రెండో తలుపు కూడా తోసి "రా!" అని ఎవరోన్ని ఆజ్ఞాపించారు. వీడూ తమ్ముడూ "మరామత్తులవాడు కాబోలా" అన్నట్లు ఒకళ్లవే పాకళ్లు చూసుకున్నారు.

కాని వచ్చిన వ్యక్తి మరామత్తులవాడు కాదు.

"ఒరే మీ అమ్మని పిలు."

తమ్ముడు వెళ్లాడు.

"దింపు."

నాన్న తీసుకొచ్చిన మనిషి నెత్తిన ఒక గోలెం ఉంది. ముగ్గురూ కష్టపడి దింపారు. గోలెంలో ఇత్తడి గిన్నెలూ, బిందె, కొత్తవి ఉన్నాయి.

అమ్మ చెల్లీ చిట్టిగాడూ వొచ్చారు.

"ఇవేమిటండీ యివన్నీను! అయ్యో సౌభాగ్యమా! ఇవన్నీ యెందుకండీ కొన్నారూ?" అంది అమ్మ

నాన్న కూలివాడికి డబ్బులిచ్చి పంపేశారు.

"మాశావురా పెద్దాడా,—దేనికీ గిన్నె లేదు; కొనండీ అని రోజూ యెంత మొర పెట్టినా కొన్నారు గాదు. ఇప్పుడు దెబ్బకి దెయ్యం జడిసినట్టు—" అంది అమ్మ.

వొంగి, గోలెంలో వస్తువుల్ని బైటికి తీస్తోంది అమ్మ.

"ఎంత బావున్నాయండీ గిన్నెలు? ఇదేమిటీ, ఇంత పల్చగా రేకుల్లా వున్నాయి? చవగ్గా వొచ్చేయని కొనేశారేమిటి? చవగ్గా వొచ్చిందని గుడ్డిదాన్ని పెళ్లాడితే నెలకి మూడామాల కుండలుపగల గొట్టిందిట."

"అవి మాత్రం చవగ్గా వున్నాయేమిటి? ఏదో, ఇబ్బంది తీరుస్తాయి గదా అని. ఆ సెట్టు చూడు. అందులో అడుగు గిన్నె అన్నం వొండుకోడానికి. మీదది కాఫీతాగడానికి. అంటే కాఫీ తాగే దగ్గిర్నుంచి అన్నం వొండుకోడంవరకూ కావల్సిన గిన్నెలున్నాయన్నమాట."

"బావుంది. ఎంతైంది వీటన్నిటికీ?"

"ఎంతయితేనేం?"

"ఈ బిందేమిటి ఇంత బరువుగా వుంది!"

"నాలుక్కాలాలపాటు మనుతుంది గదా అని!"

"బావుంది. మరి గిన్నెలు మనక్కర్లేదా యేమిటి?"

"ఆ సెట్టంతా కలిపి పందొమ్మిది రూపాయలన్నర. మొత్తం ఎనిమిదిగిన్నెలు. బాగు లేదూ? ముద్దు ముద్దుగా కూడా వున్నాయి."

"బావుంది. ముద్దుగా ఉండడం దేనికి? దామకోడానికా? వాట్ని అమ్మపొయ్యి మీద పెట్టే రేప్పొద్దున్నకే కన్నాలు పడి పోతే యెలాగ?" అన్నాడు తమ్ముడు.

చెల్లీ చిట్టిగాడూ గిన్నెలు చూస్తున్నారు.

"వొదలండ్రా, అబ్బ, ఏదొచ్చినా విడ్డూరమే. అయితే ఈ బిందెంత?"

"ఇరవై ఏడురూపాయలన్నర."

"ఓరి బాబోయ్!" అన్నాడు చిట్టిగాడు.

"అంత డబ్బు పెట్టికొనకపోతే ఏమండీ? చిన్న బిందె ఒకటి కొనుక్కుంటే ఏదో మన అవుసరం తీరిపోయేది."

"చిన్న బిందెలయినా ఏం తక్కువ ఖరీదులో ఉన్నాయనా? పదిహేనురూపాయల కొక రేకుబిందె చూపించాడు. అది కొంటే మూడ్రోజులకి సరిగదా అని మరో పదిపోతే పోయేయని ఇదే కొన్నాను."

"అవునివాళ మీకింత డబ్బెక్కడిదీ?"

"ఆ ప్రశ్న అడగొద్దని కొన్నిలక్షలసార్లు చెప్పాను."

"సరే. ఎరగమా యేమిటి? అప్పు తెచ్చుంటారు ఎక్కడో‌ను - చెప్పేదేమిటి?"

"ఈగోలెం పట్టికెళ్లి అవతల పారెయ్యండ్రా. వాడుకొనే నీళ్లు దాంట్లో పోసుకుంటే ఉంటాయి. పొద్దున్న తోడుకుంటే సాయంకాలందాకా వుంటాయి!"

"ఎంత?"

"రూపాయి."

"ఏం? గంగాళం కొనకపోయేరూ?"

"కొనలేకపోయేను. పదండి"

అమ్మ ఇటు ఇలా వెళ్తోంది; వీధి గుమ్మంలోంచి "బాబూ!" అని కేక వినపడ్డది.

బిందెలమరామత్తులవాడు!

నాన్న కుర్చీలోంచి లేచి ఉగ్రులై పోయేరు.

"రాస్కెల్! ఇంతసేపుబట్టీ ఏం జేస్తున్నావురా! ఒకగంటలో యిస్తానన్నావు నీదేం నాలికా తాటిపట్టెరా? చెరువుగట్టు మీద చేట్టుకిందని చెప్తావు నీకేమన్నా భయమూ భక్తీ వున్నాయా? నిన్నా! ఉండు, ఒరే చిన్నా, సైకిలేసుకు వెళ్లి పోలీసుని తీసుకురా, దురద తీర్చేస్తాను!"



అన్నారు పచారు చేస్తూ.

వాడు జడుసుకుని "తప్పే అయిపోయింది బాబూ! అన్నాడు.

"తప్పా, తప్పన్నరా, ఇలా ఎంతమందిని మోసం చేస్తున్నావు?"

"తమురు చమించాల బాబూ, దగ్గిరని సెప్తేగాని ఎవరూ సామాన్లియ్యరని అలా సెప్పినాను.

అంతేగాని తముర్ని మోసం సెయ్యాలని ఎలా గనుకుంటాం బాబూ! తప్పుగాదు! యియాల బామ్మన సొమ్ము దొంగతినంగా పిడికెడు దిన్నామంటే రేపు మాపిక లెగిరి పోవు బాబూ?" అన్నాడు వాడు వినయంగా.

అమ్మ, చెల్లి, తమ్ముడు, వీడు-ఆశ్చర్య పడి చూస్తున్నారే కాని కదలిక లేదు మాట లేదు. చిట్టిగాడు వాడు తెచ్చిన గిన్నెల్ని పైనా లోపలా చూస్తున్నాడు.

"అయితే మరి ఆలస్యం ఎందుకు చేశావ్?" అన్నారు నాన్న.

"కంటసెమ్మంటులో బెట్టినాంబాబూ. బండిడు సామాన్లానయి. అయన్నీ ఒక్కపాలే తీసుకురావాలగాని తముర్దొకపాలీ అల్లారి దింకోపాలీ తేగలమా బాబూ?

ఎండ వేళప్పటికే మాట్లయిపోనయి తమరివి. కాని యింకా బండిడు సామాన్లు న్నయి. అయన్నీ సేస్తప్పటికే యేల యింది."

నాన్న మరేం అనలేదు. "చూసుకోవే, సరిగ్గా వున్నాయోలేదోను!" అన్నారు. అమ్మ గిన్నెలదగ్గర కొచ్చి చూస్తోంది.

"నీపేరు నిజంగా తాలతంలచ్చు మయ్యో?" అన్నాడు తమ్ముడు.

"తప్పుగాదు. బాబూ, అలాటి మాయలా?"

"బాగానే వున్నాయి." అంది అమ్మ.

"మధ్యాన్నం ఒంటి గంటప్పుడు చెట్టు కింద మాస్తే లేవు. ఊరంతా సైకిలుమీద వెతికాను. ఎక్కడా కనిపించలేదు. పోలీస్ స్టేషను కెళ్లి నీపేరూ ఆనమాళ్ళూ అన్నీ చెప్పొచ్చాను." అన్నాడు తమ్ముడు.

వాడు నవ్వాడు.

ఒక అరనిమిషంవరకూ ఏం మాటలు లేవు.

"బాబూ నా డబ్బిప్పియ్యరూ, ఇంకా సామాన్లున్నాయి!" అన్నాడు వాడు.

"ఇచ్చిరా చిన్నా, నీదగ్గిరున్న దాల్లోది రెండున్నర!" అన్నారు నాన్న.

తమ్ముడు డబ్బు తీసి ఇచ్చాడు. వాడు వెళ్లిపోయాడు.

"ఇప్పుడు తెప్పించిన కొత్తగిన్నెలూ అవి నా చేర్రా?"

"ఊఁ"

"ఏవి, యిలా పట్రండి!"

"ఎందుకూ?"

"అవి పట్టుకెళ్ళి బోషాణప్పెట్లో దాచండి. యివే వాడుతూండండి."

"అదేమిటండీ?" అంది అమ్మ దిగులుగా.

"పాతవి గట్టిగా వున్నాయిగా, కొత్త వెందుకు కరాబు చెయ్యడం?"

"మరైతే యెందుకవి కొనుక్కోడం?"

"ఇవి లేవనుకొని కొన్నాం. ఉన్నాయి గాబట్టి దాస్తాం."

"ఇవి చాలవని చెప్పటం లేదూ రోజూను"

"రోజూ చెప్తున్నావు గాని సరిపుచ్చు తున్నావుగా, అలాగే చెయ్యి."

"సరిపుచ్చడం అంటే ఇదివరకు పప్పుకీ కూరకీ పులుసుకీ అన్నిటికీ ఒక్కటే గిన్నె వుండేది. ఇప్పుడు మూడుగిన్నెలూ వాడితే ఉన్నవి నాలుగూ నాలుగు రోజులు మనుతాయి." అంది అమ్మ.

"ఎలాగో; నిన్నటివరకూ ఎలా సరిపుచ్చేరో అలాగే వుంచండి. ఆ బిందే, ఈ గంగాళమూ, ఆ సెట్టుగిన్నెలూ పెట్లో దాచండి. ఊ ఏదుంటే అదిఅతిరగయ్యాకమే

కద! గంగాళానికి బదులు గోలెం వాడండి. మిగతావన్నీ మామూలే!"

"సెట్టుగిన్నెల్లో తియ్యండి నాన్నా, పులుసుకీ పప్పుకీను!" అంది చెల్లి.

"రెండూ లేదు ఒకటీ లేదు. కొత్తవుంటే యింకెప్పుడెన్నా పనికొస్తాయి. ఇదివరకెలా వాడుతున్నారో అలాగే వుండండి. కొత్తవి పెట్లో పెట్టండి. ఏమిరా, పెద్దా చిన్నా, అలా మాస్తారు? ముందు అవి దాచండి!" అన్నారు నాన్న.

అమ్మ అభిమానంగా "దాచుకోండి? మీ అప్పగిన్నె లెవరికీ అక్కర్లేదు!" అంది. ★

# అమ్మ

(15-వ పేజీ తరువాయి)

"సామర్లకోటా? మొదట్నించీ అక్కడేనా?"

"ఆఁ. అక్కడే. మీ దేవూరండి?"

"మాదీ సామర్లకోటే నాయనా!" అనేసి ఆవిడ వంటింటివేపు వెళ్లింది.

నేనూ ఆశ్చర్యంలో మునిగాను. ఏమిటీ పరమరహస్యం? సామర్లకోటావిడ బెంగాలీ వాడైన బిమల్ ముఖర్జీకి భార్య కావడ మేమిటి? - ఇంతకీ ఏ కులమో, ఏ నాయుళ్ల తాలూకో కమ్మవాళ్ల తాలూకో అయితే కాకూడ దేమిటి? - బ్రాహ్మలే అయితే మటుకు? చదువుకున్నావిడ గదా!... ఏమో! ఎలాటి మైత్రో మరి!

ఆవిడ తిరిగొచ్చింది. "ఆఁ. మరి బెంగాలీ ధారాళంగా మాట్లాడేస్తున్నావే! ఇంత ఎలావొచ్చిందీ?" అన్నది.

"మూడేళ్లబట్టి కలకత్తాలోవుంటున్నాను బంగాలీ నేర్చుకోవాలన్న కుతూహలం కూడా వుండేది మొదట్లో అంచేత వచ్చేసింది."

"అంతే అంతే, ఉద్దేశం ఉంటే దారీ వుంటుంది:"

"మరి మీరు మాత్రం? మీరు బెంగాలీ వాళ్లని నమ్మడానికి ఒక్క సెనకనుకూడా అలస్యం చెయ్యలేదు నేను! వేషం, భాష ఆచారాలు - టీ - అన్నీ!"

"మడిగట్టుకో. పద."

చాలాసంతోషంతోనూ తృప్తితోనూ లేచాను. ఎంత ఆత్మీయత! ఎరగనిచోట యిద్దరు తెలుగువాళ్లం కలుసుకున్నంత మాత్రాన తెలుగుగడ్డలో మళ్ళా కాలు పెట్టినంత తృప్తిగా వుంది. ఒక్క నిమిషం కాదు - ఒక్క సెకండుకూడా ఇంక బంగాలీ మాట్లాడం కదా! జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసీ అన్నారు!

అయితేమటుకు - ఏ విషయాన్నీ వొదిలి పెట్టకుండా మాకు దొరికిన ప్రతీ విషయాన్నీ చర్చించాం. నాన్నసంగతి ఆవిడ అడగనూలేదు నేను చెప్పనూలేదు. ఇంక ఆవిడ సంగతీ నేను అడగలేదు.

*　*　*　*

"నువ్వింక లాడ్జిలో ఉంటే ఒప్పుకునేది లేదు."

"అదేమిటి? ఎక్కడుంటేమాత్రం స్నేహం పోతుందటండీ? పైగా యెంత దూరమని? మీయింటి పక్కనేగద! దానీ దానిచేత కబురంపినా వొస్తానే!"

"అబ్బే! అలా ఏంపనికిరాదు. నువ్వు మాయింట్లో మకాం పెట్టాల్సిందే! ఇంత మహారాజ భవనాన్ని ముఖర్జీగారు నాకు రాసిపోయారు. ఇదంతా నాకెందుకు? నా కొక్కర్తెకీ ఇంతెందుకు? నువ్వూ యిక్కడ వుండాల్సిందే."

"మీకేమన్నా పిచ్చా?"

"అవున్లే. ఇంకో రెండు నిబంధనలున్నాయి. నువ్వు నన్ను పిన్నీ అని పిలవాలి. ఏమండీ యేమిటి? ఎవర్నో పిల్చినట్టుగా!"

"అలాగేలెండి."

అలాగేలెం డేమిటి. లెండీ పొండిన్నూ! అలాగే పిన్నీ అనాలి. అను!"

"అలాగేలెండి."

"అదుగో మళ్ళా! అను ముందు!"

"అలాగే పిన్నీ!"

"ఇంక మరొకటుంది. నువ్వు హోటలుకు స్వస్తిచెప్పి మా యింట్లోనే భోంచెయ్యాలి."

"ఈనెల పూర్తయిపోనీండి. వొచ్చే ఫస్టు నించీ అన్నీ చేస్తాను."

"అలా ఏం పనికిరాదు. ఇప్పట్నుంచే ఆరంభించాలి. ఇద్దరం ఒక్కదేశం వాళ్లం - ఒక్క వూరివాళ్లం - దేశంకాని దేశంలో కలుసుకుంటే ఒక్కచోట వుండాలి గాని వేరే వేరే యేమిటి? ఏ పరిస్థితులన్నా అడ్డొస్తే పోనీ అనుకోవచ్చు. ఇప్పు డేమీ అడ్డు లేదు గా!"

"బాగుందండీ బలవంతం!"

"అదుగో......బాగుందండీ యేమిటి మళ్ళాను! బాగుంది పిన్నీ అనాలి."

"రూమ్ ఖాళీ చేసి వొచ్చెయ్యడాని కభ్యంతరం లేదుగాని, హోటలువాడికి అంతా ఎడ్వాన్సు యిచ్చేశాను. ఒట్టి వేస్టయిపోతుంది. అందుచేత ఫస్టునించీ మీయింటికొస్తాను."

"ఎన్ని రూపాయ లిచ్చావు ఎడ్వాన్సు?"

"ముప్పై."

"నేనిస్తాను తీసుకో మరో ముప్పై. సరా?"

"బాగానే వుంది"

* * *

సరిగా ఆవిడ విషం తీసుకున్న నాటి నించి వారం గడిచింది. ఈ అనుభవంలోని కొత్తదనాలకి ఆశ్చర్యపడటం నించి యింకా తెములుకోలేదు. కొత్త సంగతులు జరుగ నారంభించినట్టు స్ఫురించింది.

నేను ముఖర్జీగారింటికి నా సరంజామా అంతా మార్చుకున్నాను. భోజనం వాళ్లింట్లో చెయ్యడం మొదలు పెట్టినదగ్గిర్నుంచీ ఆవిడే వంటచేస్తున్నారు. అది నాకు పడలేదు. "హోటల్ లో తురకవాడి చేతి కూడు కూడా తిన్నాను; నాకోసం ఆగర్భ శ్రీమంతులు మీరెందుకు శ్రమ పడతారు?" అన్నాను.

"తప్పని సరైనప్పుడు తురక వాడే కాదు మ్లేచ్ఛుడు వండినా తినవచ్చు. కాని బ్రహ్మడివి నువ్వు, బ్రాహ్మలదాన్ని నేనూ - ఊరికే దాసీదాని చేతికూడెందుకు తినాలీ?" అన్నదావిడ.

ఆ మర్నాడు వంటయిపోగానే "నువ్వివాళ ఫస్తు బ్రాహ్మణ పద్ధతిలో భోంచెయాలి. మడికట్టుకు వండాను. స్నానంచేసి పటుపంచకట్టుకురా!" అన్నదావిడ నా స్టడీలోకొచ్చి.

"బాగానేవుంది." అని నేను నవ్వుకున్నాను.

స్నానంచేసి పట్టుపంచకట్టుకుని వంటింటికి వెళ్లాను. ఆవిడ వడ్డిస్తోంది. "వచ్చాను పిన్నీ!" అన్నాను.

"రా! కూర్చో!"

వెళ్లి కూర్చున్నాను. పద్ధతేమో ఆంధ్ర బ్రాహ్మణ పద్ధతేగాని కూర ఎలాగ? ఏదో యథాశక్తి ఆంధ్రత్వమని సమర్థించుకుని కలుపుకున్నాను.

కొద్దిగా తిన్నాను. ఇంతలో దాసీది ఏదో పనిమీద వంటింట్లో కొచ్చేసింది. ఆవిడ ఉగ్రురాలైపోయి తిట్టేసింది. దాసీది నవ్వుకుంటూ వెళ్లింది.

"పోనిద్దురూ పిన్నీ!"

"ఆఁ పోనిస్తారు! మనం యివాళే సరిగ్గా బ్రాహ్మణ్యాం అవలంబించడ మేమిటి-ఇదీ యివాళే చెయ్యడ మేమిటి?"

నా నడుం మీంచి చుట్టూ కప్పుకున్న తువాలు జారిపోతోంది. తీసి పీట మీద పెట్టాను. విసుగ్గా ఏదో మాట అన్నాను.

నెయ్యి కావాలన్నాను. ఆవిడ మాట్లాడ లేదు. తల ఎత్తి చూశాను. ఆవిడ ముఖం జేవురించుకు పోయింది. ఎందుకో!

"అదేమిటి పిన్నీ అలావున్నారు?"

"ఏం లేదు. ఏం కావాలి నీకు?"

"నెయ్యి."

"నీ గుండెల మీద పెద్ద మచ్చ ఏమిటి?"

"పుట్టుమచ్చ."

"గుండెలమీద పుట్టుమచ్చ అదృష్టంట గదూ!"

"ఏమో నాకు జ్యోతిషం తెలీదు."

తరవాత ఏమీ మాటలు జరగ లేదు. అయినా భోజనంనుంచి చాలా హాయిగా తృప్తిగా లేచాను.

"పిన్నిగారూ, మీకివాళ ఓ సంగతి చెప్తున్నాను—చిన్నప్పట్నుంచీ మమ్మల్ని—అంటే నా సవితి అక్కయ్యనీ, నన్నూ, మా చెల్లెల్నీ తమ్ముణ్ణీ అన్నమాట—మా నాన్నే పెంచారు. నాకు మా అమ్మంటే జ్ఞాపకమే లేదు. మా నాన్న మా అమ్మ చచ్చిపోయిన దగ్గిర్నుంచీ ఎంతో విసుగ్గా ఉండేవారసలు. ఎన్నడూ మాతృత్వమంటే ఎరగం. అలాంటి నాకు మా చచ్చిపోయిన అమ్మను జ్ఞాపకం తెప్పించారు. మీరివాళ. అన్నాను.

"మీ అమ్మ చచ్చిపోయిందా?"

"ఆ సంగతి మా నాన్న నడుగుతే లేదంటారు. కాని మా అక్క స్వయంగా అమ్మ ఆత్మహత్య చేసుకోడం చూసిందట."

"బహుశా ఒకలై ఉంటుంది. మీ నాన్నగారు మీ అమ్మను నానా యిబ్బందులూ పెట్టి వుంటారు! అందుకని ఆవిడ-అంటే మీ అమ్మ చచ్చిపోయుంటుంది."

"అలా అంటే ఎన్నడూ నే నొప్పుకోను. నాన్నంత మంచి వాళ్లు నూటికో కోటికో ఉంటారు. ఇప్పు డెవరన్నా సామర్లకోట వెళ్లి సుబ్రహ్మణ్యం పంతులుగారు ఎలాంటి వారని అడిగి కనుక్కుంటే అంత మంచి వారు మరి వుండరంటారు."

పిన్నిగారు మరి మాట్లాడలేదు. నిట్టూర్పు విడిచి అక్కణ్ణించి వెళ్లిపోయింది, అన్నం తినకుండా గదిలోకి ఎందుకు వెళ్లారా అన్న ప్రశ్న పుట్టింది. కాని లెక్క చెయ్యక నా స్టడీకి పోయి, బట్టలు వేసుకుని, పుస్తకాలు తీసుకుని కాలేజీకి వెళ్లిపోయాను.

* * *

కాలేజీనుంచి మూడు గంటల తరవాత రావలసిన వాణ్ణి గంట అయిపోయిన వెంటనే బయలుదేరి వచ్చేశాను. మిగతా రెండు గంటలూ శెలవు.

ఇంటికొచ్చి ఏం చూశాను!

పిన్నిగారు గదిలో మంచం మీద పడుకుని ఉంది. భోజనం చేసిన ఆనవాళ్లు ఏమీ కనపడటంలేదు. దాసీది ఎంత వెతికినా కనిపించలేదు. చివరికి అదీ ఓ చోట దిగాలు పడి కూచుని కనిపించింది.

"బాబూ! వొచ్చారా? పదండి, మీరు చెప్తే తింటారేమో! అమ్మగారు నేనెంత బతిమాలినా అన్నం తినడంలేదు." అంది.

కాని నేనూ ఎంతో అడిగినా ఆవిడ అన్నం తినలేదు. నాకు ఏ సంగతీ అర్థం కావడం లేదు. అడిగితే జవాబు చెప్పదు. చాలా గాభరా పడ్డాను. ఆత్మహత్యా ప్రయత్నం జరిగిన నాటి మర్నాటినుంచీ ఆవిడ చూపిస్తున్న ఉల్లాసానికీ, నేటి ఆ ప్రవర్తనకీ ఎంత మాత్రమూ సంబంధం కనపడలేదు. ఈ విచిత్ర వ్యక్తి వైనం ఏమిటా అని సతమతమవ సాగాను.

"పిన్నీ! నావల్ల ఏమయినా నేరముంటే క్షమించండి. తెలియక చేసి ఉంటాను." అన్నాను. అయినా ఊరట కలగలేదు. నే నేమీ చెయ్యందే!

"నీ వల్ల ఏమీ నేరం కాదు నాయనా!" అని మాత్రం అన్నారావిడ. ఇంకే ప్రశ్నకీ జవాబు చెప్పలేదు.

గదిలోంచి బైటికొచ్చి దాసీదానితో "ఏమైంది? నీకూ తెలీదా?" అన్నాను.

దాసీది బుర్ర వంచుకుని "ఈ సంగతంతా

మళ్ళా ఆవిడ ఏదన్నా ప్రమాదం తల పెట్టేందుకొచ్చింది." అన్నది.

"అదెలా అవుతుంది? నువ్వు లేవా నేను లేనా?"

"ఉండి ఏం చెయ్యగలం లెండి."

"సంగతేమిటి?"

"చెపితే నొచ్చుకోరుగద?"

"ఎందుకు నొచ్చుకుంటానూ?"

"ఆవిడ మిమ్మల్ని కన్నతల్లి. మీ నాన్న గారి రెండో భార్య."

సరిగ్గా ఈ సమయానికి దాసీ దాన్ని ఆవిడ పిల్చింది. అది భయంగా వెళ్ళిపోయింది. వెనకాలే వెళ్ళకుండా ఉండలేక పోయాను.

అమ్మ దాసీ దాన్ని పిలుస్తున్నట్టే. అది గమనించి నేను పొమ్మన్నాను. మరి అమ్మ... బిమల్ ముఖర్జీగారి భార్య అయిన దెలాగ? ఇంతకీ ఈ సంగతి నిజమేనా?... కాకేం జేస్తుంది?"

ఏమైతే నేం? ఆవిడ పూజ్యనీయురాలైన నా తల్లి. పాపాలేమన్నా చేస్తే అవి ఆవిడవే గాని నా తల్లివి గ [illegible]

మంచంమీ[illegible] కూర్చుని "అమ్మా!" అని పిల్చాను. శబ్దం [illegible]గా రాలేదు.

అలా మూడు నాలుగు సార్లు పిలిస్తేగాని పలకలేదు.

"ఏమీ భయపడవలసిన అవసరం లేదు. నువ్వు నా తల్లివే అయితే ఎలాగూ తల్లివే. ఒకటి రెండు పాపాలు చిన్నా పెద్దా అందరం చేస్తాం. కించపడక నా సందేహాలు తీరుస్తావా?" అన్నాను నెమ్మదిగా.

అమ్మ మాట్లాడలేదు.

"సంగతి నిజమే అయితే నీకీ అజ్ఞాతవాసం లేనికి? ఇంటికి పోదాం. నాన్న నిన్ను ఆదరించగలరు."

"మీ నాన్నగారు నన్నింకా మరిచిపోలేదా?"

"లేదు. నువ్వు ఏనాడో తిరిగొస్తావని చెల్లినీ తమ్ముణ్ణీ ఊరడిస్తున్నారు కూడాను. సంగతేమిటో చెప్పవూ?"

అమ్మ మళ్ళా మాట మానేసింది.

సంగతి తెలుసుకోవాలని నా కున్న కుతూహలంతో ఎన్నో సార్లు అడిగాను. కాని అమ్మ పెదవి కదిపితే ఒట్టు.

చివరికి తాళాలిచ్చింది. బీరువా తెరుచుకోమంది. చీరెల అడుగున పుస్తకం తీయమంది. నా గదిలోకి తీసుకుపోయి చదువుకోమంది.

* * *

అది "కళంకిని చరిత్ర." వ్రాసింది ఎవరో స్త్రీ.

తను పట్నంలో పెరిగిన వ్యక్తి. చిన్నతనం పోక మునుపే ఒక రెండో పెళ్ళి ఆయనకిచ్చి వివాహం చేశారట. ఈ ప్రపంచంలో అనేకమంది స్త్రీలకు తమ కేది కావాలో తెలియక అసంతృప్తిలో బాధపడతారట. అందులో తానొకతె.

ముగ్గురు పిల్లలు కలిగాక కూడా ఆ భర్త మీద ఏమీ అభిమానం సంపాదించలేక పోయింది. మళ్ళా ఆయన చెడ్డవారు కాదు. చాలా మంచివారే. ఆ జీవితం ఎలాగో అంతమైతే చాలుననిపించే అసంతృప్తిలో ఉంది ఆ వ్యక్తి.

ఎవరో వచ్చారు, భర్త మిత్రుడు. ఆయనతో యింకో ఆయన వచ్చారు. బంగాళీ జాతివాడు. అక్కడ వ్యర్థమై, అర్థ విహీనమైన మన స్తత్వ విశదీకరణం ఉంది. చివరికి ఆ బంగాళీ జాతి వానితో ఈ వ్యక్తి లేచిపోయి వస్తుంది; ముగ్గురు పిల్లలనూ భర్తనూ వదిలి.

కలకత్తాలో అడుగుపెట్టిన మర్నాటి నించీ తృప్తిలో, తొలిరోజుల సుఖంలో బంగారు నగలు కరుగుతున్నా లెక్క చెయ్యలేదు. కాని పోను పోను బంగారునుమించిన బంగారు-ఆ నిరుద్యోగి బంగాళీ ఆయన ఒక చీటీ మాత్రం వుంచి మాయం కావటం చాలా దుఃఖ జనక ఘట్టం.

ఆ తరవాత, బంగాళీ భాష న్నా సరిగా తెలియని ఆమె, ఇంటికిపోస్తే ఉమ్మేతారని భయం కల ఆమె, జీవితానికి గడవక ఎంత బాధపడిందీ, ప్రస్తుతం కలకత్తాలో అతి భాగ్యవంతుల్లో ఒక తెగా ఉంటున్నది. పూర్వం మానానికి వెలకట్టుకుని కట్టుకోకుండా ఎంత నైచ్యానికి పాల్పడవలసి వచ్చిందో-అదంతా వర్ణింపబడి వుంది.

చివరికి-సామెతలక్కూడా అందనట్టు బిమల్ ముఖర్జీ గారికంట ఆ వ్యక్తి పడటం ఆయన ఈమెను తన సర్వస్వంగా ప్రేమించడం, బంధువులకు కూడా దూరమై తన యావదాస్తినీ ఈమె పేర పెట్టడం వర్ణింపబడ్డాయి.

పాపం-ఆ వ్యక్తి తన చరిత్ర సుఖాంతమనీ ఆఖరి ఘట్టం బిమల్ ముఖర్జీ గారి అమర ప్రేమేననీ అనుకుని అక్కడ గీత పెట్టి దైవం అనే పదార్థానికి జోహార్ చెప్పింది.

ఆనక ఆ పేజీ విడిచిపెట్టి మళ్ళా వణుకుతున్న హస్తమొకటి వ్రాసింది. ఇంకెందుకు? అంతా అర్థమైంది. ఈ తాజా కలంగాధ తెలిసిందే. మరి చదవవసరం లేదు.

* * *

మాతృత్వపు విలువ మర్మ చరిత్రతో నశించింది.

కాగితాలు తెచ్చి "ఆవిడ" మీద గిరవాటు వేశాను. నిశ్చేష్టురాలైంది.

దాసీ దాన్ని పిలిచి నా స్టడీ అంతా పక్కింటి గదిలోకి మార్పించాను- అప్పటికప్పుడు వాళ్ళతో మాట్లాడి వీలైతే మరో దూరపు చోటకి పోదామనుకున్నాను. ఉద్రేకం-కోప శిఖరం అటు వెళ్ళింది.

అమ్మకు ఒక మాట కూడా యివ్వడం అనవసర మనిపించింది.

* * *

సాయంకాలం ఏడయింది. చదువుకుందికి పుస్తకం విప్పాను. దాసీది వచ్చింది. భోరున ఏడుస్తూ "అమ్మగారు విషం తిన్నా" రంది. వెళ్ళాను కాని అప్పటికే అంతా మించిపోయింది. ★

# కౌంట్ ఆఫ్ మాంట్ క్రిస్టో

(7-వ పేజీ తరువాయి)

"విందు ఎక్కడ? శాంప్ ఎలిషీలో మీ యింట్లోనా?" అన్నాడు విల్‌ఫర్ట్.

"కాదండి. ఆట్వీల్‌లో నాకింకొక ఇల్లుంది. ఆయింట్లో."

"ఆట్వీల్ లోనా? ఏవీధిలో" అన్నాడు విల్‌ఫర్ట్.

"ఫాంటేన్ వీధిలో 28 వ నంబరు ఇల్లు."

"అయితే మీరు సెంట్ మిరాన్ ఇంటిని కొన్నారా?"

"అది మీ మామగారి ఇల్లా? నాకు తెలియదే"

"అవును. అది వాలంటిన్ తల్లికి చెందిన ఇల్లు" అంది హిలాయ్స్, "కాని చిత్రమేమిటంటే ఆ యింటిలో ఉండడానికి నాభర్త కిష్టంలేదు. ఆ ఇంటిని చూడనైనా చూడరు."

"చిత్రమే" అన్నాడు మాంట్‌క్రిస్టో.

"నాకు ఆట్వీల్ ప్రాంతం నచ్చదండి" అన్నాడు విల్‌ఫర్ట్. అతని మాటలలో తొట్రుపాటు కనపడింది.

"కాని మీకు నచ్చలేదని నావిందుకు రావడం మానకండి."

"లేదు. మానను—కాని ప్రయత్నిస్తాను కదా" అన్నాడు విల్‌ఫర్ట్ తడబడుతూ.

"అల్లాఅంటే కుదరదు. శనివారంనాడు సరిగ్గా ఆరుగంటలకి మీకోసం నిరీక్షిస్తాను. మీరు రాకపోతే, ఇంతకాలమూ ఆఇంట్లో ఉండకపోవడానికి ఏ కారణమో ఉంటుందని నేననుకోవలసి వస్తుంది. ఆ యింటిలో ఏమైనా జరిగిందా? దయ్యాలున్నాయా? లేక వాస్తు శుభంకాదా?"

"అబ్బెబ్బె అదేమీ లేదు. తప్పకుండా వస్తాను." అన్నాడు విల్‌ఫర్ట్ భీతితో.

"అయితే ఇంక నే వెడతాను."

"మీ రప్పుడే వెళ్ళిపోవాలా? కొంతసే పుండలేరా?" అంది హిలాయ్స్ విల్‌ఫర్ట్.

"నన్ను క్షమించాలి. వెళ్ళాలని నిశ్చయించుకున్నాను. కారణం తెలిస్తే మీరు నవ్వవచ్చు. టెలిగ్రాఫ్ చూడాలని ఉంది. ఇప్పుడు వెళ్ళి చూడాలి. ఎన్ని వందలమైళ్ళ దూరమైనా వార్తలెంత వేగంగా వెడతాయో గమనించాలి."

"అయితే త్వరగా వెళ్ళండి చీకటిపడితే టెలిగ్రాఫ్ గోపురం తాళంవేసి ఉద్యోగులు వెళ్ళిపోతారు" అన్నాడు విల్‌ఫర్ట్.

## 61

కాని—మాంట్‌క్రిస్టో ఆ సాయంత్రం వెళ్ళలేదు. ఆ మరునాడు వెళ్ళాడు. టెలిగ్రాఫ్ గోపురం ఒక చిన్నకొండపైనుంది. (ఈ కథాకాలంనాటి టెలిగ్రాఫ్ ఏర్పాట్లకీ, ఈనాటి తంతివార్తకీ చాలా తేడా ఉంది. ఆ రోజులలో కొండలపైననో లేక మైదానాలలోనో ఎత్తైన గోపురాలు నిర్మించి, వానిపైన సాలీపురుగు ఆకారంలో ఆరేసి కాళ్ళ ఇనుపచట్రాలు కట్టి, ఆ చట్రాలు తిప్పుతూ సంజ్ఞలద్వారా వార్తలు పంపేవారు—అనువాదకుడు) అక్కడ కొండచుట్టూ కంచెకట్టి ఉంది. కంచెకి ఒకచోట చిన్నగేటుంది. గేటుదాటి మాంట్‌క్రిస్టో లోనికి ప్రవేశించాడు. కంచెలోపల చిన్న కూరగాయలతోట ఒకటుంది. ఏభైఏళ్ళ వ్యక్తి ఒకడు ఒక పాదుకు పందిరికట్టి తీగను పైకి పాకిస్తున్నాడు.

"తోటపని చేస్తున్నట్లున్నారు" అన్నాడు మాంట్‌క్రిస్టో.

తోటమాలి కంగారుపడి లేచి నిలబడ్డాడు. "ఈపూటకి నా పనయిపోయిందండి. అందుకని తోటలోకి వచ్చానండి." అన్నాడు.

"ఫరవాలేదు భయపడకు. నేను తనిఖీ అధికారిని కాను. టెలిగ్రాఫ్ చూడాలని వచ్చానంతే" అన్నాడు మాంట్‌క్రిస్టో.

"ఓ!" అన్నాడు తోటమాలి. "మీకు టెలిగ్రాఫ్ చూపిస్తానుండండి. ఇంకా పదినిమిషాలు వ్యవధి ఉంది. నేను ప్రభుత్వానికి రెక్కలమ్ముకున్నాను. ఏదో కొద్దిసేపు వ్యవధిదొరికింది కాబట్టి ఈపాదుసంగతి చూస్తున్నాను. అయితే నాకొక మాట చెప్పగలరా? పొలమెలుకలు గుమ్మడికాయల్ని తినేస్తాయా?"

"తింటాయి."

తరవాత ఇద్దరూ తోటల్ని గురించీ ఎలకల బాధల్ని గురించీ కొంతసేపు మాట్లాడారు. పదినిమిషాల వ్యవధిపూర్తికాగానే తోటమాలి చేతులు కడుక్కున్నాడు. అతనికి వార్తలు పంపడంకంటె తోటపెంచడం ఎక్కువ ఇష్టమని మాంట్‌క్రిస్టో గ్రహించాడు. "రండిగోపురం ఎక్కుదాం" అన్నాడు తోటమాలి.

గోపురంలో మూడు అంతస్తులున్నాయి. మొదటి అంతస్తు గదిలో పార, పలుగు ఉన్నాయి. రెండో అంతస్తులో చుట్టిన పడక ఒకటుంది. మూడో అంతస్తుపైన ఇనుపచట్రం ఉంది.

"వార్తలు సంకేతాలవల్ల తెలుసుకుని తిరిగిపంపడం కష్టమైన పనా?" అన్నాడు మాంట్‌క్రిస్టో.

"అది నేర్చుకోడం సులువేకాని, నిత్యం ఇక్కడే కూచుని ఇదే పనిచెయ్యడం మాత్రం కష్టమండి."

"నీ జీతమెంత?"

"సాలుకి వెయ్యిఫ్రాంకులు."

"అదేం సరిపోతుంది?"

"బొత్తిగా చాలదండి."

మూడో అంతస్తు ఎక్కి మాంట్‌క్రిస్టో చూశాడు. గోపురానికి రెండువైపులా దూరాన ఇటువంటే రెండుగోపురాలూ వానిపైన ఇనుపచట్రాలూ కనపడ్డాయి. "ఏర్పాటు చక్కగా ఉంది. కాని జీవితమంతా ఈ చట్రందగ్గిర గడపడం చాలా కష్టం" అన్నాడు.

"నిజమేనండి కొత్తలో నాకు మెడ నొప్పి పెట్టేది. క్రమంగా అలవాటయింది."

"సెలవు లుంటాయా నీకు?

"మంచుపడుతూ, చూపు ఆనకపోతే ఆరోజు మాకు సెలవే."

"ఎన్నాళ్ళనించి పనిచేస్తున్నావు?"

"పదేళ్ళనుంచి."

"నీ వయస్సు?"

"ఏభైఅయిదేళ్ళు."

"ఉద్యోగం విరమించడానికింకెన్నాళ్ళు పనిచెయ్యాలి?"

"మొత్తం పాతికేళ్ళు."

"తరవాత పించను ఎంత ఇస్తారు?"

"మొత్తం అయిదువేలిస్తారు."

"టెలిగ్రాఫ్‌కి సంబంధించిన ఈ సంకేతాలకి అర్థాలు నీకు తెలుసునా?"

"అర్థాలు తెలియవు."

"పోనీ తెలుసుకోవాలని ఎప్పుడూ ప్రయత్నించలేదూ?"

"లేదండి. ఆబాధకూడా ఎందుకు?"

"మరి నీకు వచ్చే సంకేతా లేవిటి?"

"కొత్తవార్త లేవీ లేవనీ, నీకు గంట వ్యవధే ఉందనీ, రేపు అనీ ఇటువంటివే నాకు వచ్చేసంకేతాలు. అవే నేను ఇంకొకరికి పంపుతాను. ఆ సంకేతాలకి అర్థాలు నాకు తెలియవు."

"అదీ తెలుసుకోడం సులువే. కాని అదుగో చూడు కుడి పక్క చక్రం కదులుతోంది."

"అవునవును"

"ఏమిటి అత నిస్తున్న సంకేతం ?"

"సిద్ధంగా ఉన్నావా అని నన్ను అడుగుతున్నాడు."

"నువ్వేం సమాధా నమిస్తావు ?"

"సిద్ధంగా ఉన్నానని సమాధానం ఇస్తాను! నే నిచ్చే సమాధానమే, నా ఎడమపక్క చక్రానికి సంకేతం అవుతుంది."

"చిక్కగా ఉంది."

"ఇంక అయిదు నిమిషాల్లో వార్త పంపుతాడు చూడండి."

"నీకు తోటపనంటే ఇష్టం కాదూ ?"

"అదంటే నాకు ప్రాణమండి."

"అయితే ఈ గోపురంలో ఇలా ఉండిపోడంకంటె స్వంత తోట ఒకటి కొని పెంచుకోరాదూ ?"

"నాకే తోటఉంటే ఇంక వేరే స్వర్గం అక్కర్లేదండి."

"నీకు కుడిచేతివైపు గోపురం సంకేతం ఇస్తుంటే, నువ్వు చూడకుండా పరధ్యానంతో ఉన్నావనుకో. అప్పు డేమౌతుంది?"

"ఏమౌతుంది. అతనిచ్చే సంకేతాల్ని ఎడమవైపు గోపురానికి నే నివ్వలేకపోతాను."

"అప్పుడు ?"

"అప్పుడు నాకు జరిమాన విధిస్తారు."

'ఎంత ?'

'నూరు ఫ్రాంకులు'

'ఒక వేళ నువ్వు సంకేతం మార్చి ఇస్తా వనుకో అప్పుడు?'

'అది వేరు. నాకు ఉద్యోగం పోతుంది. పింఛనుపోతుంది. అందువల్ల అటువంటి వెప్పుడూ చెయ్యనండి'

"నీకు పదిహేనేళ్ళ జీతమూ ఇప్పుడే ముట్టుతుందనుకో, అప్పుడూ అలా చెయ్యవా ? ఆలోచించు"

"అంటే ? పదిహేను వేల ఫ్రాంకులికా ?"

"అవును. పదిహేను వేల ఫ్రాంకులు, అర్థమయిందా ?"

"ఆగండి. కుడివైపున ఏదో సంకేత మిస్తున్నాడు. చూడనివ్వండి."

"అటు చూడకు. ఇటు చూడు."

'ఏమిటివ్వి? బాంకునోట్లా?'

"అవును. పదిహేను వేలు."

"ఎవరి దీ డబ్బు?"

"తల్చుకుంటే నీదే !"

"నాదా ?" అన్నాడు తోటమాలి, ఆశ్చర్యంలో మునిగి పోయాడు.

"అవును నీదే. నీదే ఈ డబ్బు."

"ఆగండి, కుడివైపు గోపురంపైన ఇంకోసారి సంకేతం ఇస్తున్నాడు. చూడనివ్వండి."

"అక్కర్లేదు నువ్వటు చూడకు. ఇది చూడు," అంటూ మాంట్ క్రిస్టో బాంకునోట్లు అతని చేతిలో పెట్టాడు. "ఇంతే కాదు. నీకు పదిహేను వేలతో భృతి గడవదు."

"పరవాలేదండి, ఉద్యోగం ఊడిపోదుగా దీనికి? జరిమానా మాత్రం విధిస్తారు."

"అది కాదు. నీకు ఉద్యోగం కూడా పోతుంది. నువ్వు సంకేతంమార్చి ఎడమవైపు గోపురానికి కొత్తసంకేతం ఇయ్యి."

"మీరు మరీ బలవంతపెడుతున్నారు."

"ఫరవాలేదు. నిన్నింకా బలవంతపెట్టగలను" అంటూ మాంట్ క్రిస్టో మరొక నోట్లకట్ట తీశాడు. "ఇదిగో పైన మరో పది వేలు. పదిహేను వేలు నీకు చాలదు. అయిదు వేలతో ఒక తోట ఇల్లు కొనుక్కో. మిగతా ఇరవై వేలపైనా సాలుకి వెయ్యి ఫ్రాంకులు వస్తుంది నీకు."

"ఇప్పుడు నన్నేం చెయ్యమంటారు ?"

"అదేం కష్టం కాదు. ఇదిగో ఈ కాగితంమీదున్న మూడు సంకేతాలు ఎడమవైపు గోపురానికి పంపు."

తోటమాలి కాగితం చూశాడు. ఆ ప్రకారం సంకేతా లిచ్చాడు. ఈ చక్రంలో మార్పు బోధపడక కుడివైపుకున్న చక్రం పిచ్చిగా తిరగడం మొదలుపెట్టింది. తోటమాలికి పిచ్చెత్తింది కాబోలని కుడివైపు చక్రం తిప్పుతున్నవా డనుకున్నాడు. కాని కొత్త సంకేతాల్ని ఎడమవైపు గోపురంపైనున్న చక్రం అందుకుని అదే రీతిగా ఆవలి గోపురాని కిచ్చింది. ఆ సంకేతాలు తిన్నగా ఫ్రెంచి ప్రభుత్వపు ఆంతరంగిక శాఖామంత్రికి చేరాయి.

"వెళ్లు. నువ్వింక భాగ్యవంతుడవైనావు" అన్నాడు మాంట్ క్రిస్టో తోటమాలితో.

"నిజమే. కాని ఎంత అపరాధం జరిగింది!" అన్నాడు తోటమాలి.

'ఫరవాలేదు. నువ్వు అటువంటి సంకోచం పెట్టుకోకు. దీని వల్ల నువ్వు ప్రజలకి మహోపకారం చేసినవాడవైనావు.

ఇది జరిగిన అయిదు నిమిషాలలో ఒకవార్త టెలిగ్రాఫ్ ద్వారా ఆంతరంగిక మంత్రికి చేరింది. వెంటనే డిబ్రే బగ్గీ తెప్పించుకుని డాంగ్లర్ ఇంటికి వెళ్లాడు. ఆందోళనతో హెర్మినా డాంగ్లర్‌ను కలుసుకుని 'నీభర్త స్పానిష్ ఋణపత్రాలలో డబ్బు ఏమైనా పెట్టుబడి పెట్టారా ?' అని అడిగాడు.

'పెట్టారు. దాదాపు అరవైలక్షల ఫ్రాంకులుంది.'

"వెంటనే ఆ పత్రాల్ని ఏధరకైనాసరే, నష్టానికైనాసరే అమ్మివెయ్యమని చెప్పు."

"అదేం ? ఎందుకు ?"

"స్పెయిన్ రాజవిరోధి డాన్ కార్లోస్ నిర్బంధంలోనుంచి తప్పించుకుని స్పెయిన్ దేశంలో దిగాడు."

హెర్మినా క్షణంకూడా జాప్యం చెయ్యలేదు. భర్తవద్దకు పరుగెత్తి సమాచారం చెప్పింది. డాంగ్లర్ వెంటనే తన ఏజంటుకి కబురు పంపాడు. ఆ పత్రాలు అమ్మినతరవాత చూసుకుంటే ధరలు పడిపోయి డాంగ్లర్‌కి అయిదులక్షలు నష్టం వచ్చింది. కానయితే స్పానిష్ పత్రాలు వొదిలి పోయాయని డాంగ్లర్ సంతోషించాడు. ఆరోజుసాయంకాలం ఒక పత్రికలో ఈవార్త పడింది! "డాన్ కార్లోస్ తప్పించుకుని స్పెయిన్ దేశానికి తిరిగి వచ్చాడు. బార్సిలోనాలో విప్లవం వచ్చింది. అక్కడ ప్రజలు అతన్ని బలపరుస్తున్నారు." మరునాడు ఉదయం మరొక పత్రికలో ఈ వార్త పడింది. "డాన్ కార్లోస్ తప్పించుకువచ్చాడనీ, బార్సిలోనాలో విప్లవంవచ్చిందనీ నిన్న సాయంత్రం ఒక పత్రిక ప్రకటించినవార్త అబద్ధం. దీనికి టెలిగ్రాఫ్ వార్తలు పంపడంలో ఎక్కడో జరిగిన ఒక పొరపాటు కారణం. "ఈ వార్త పడిన వెంటనే స్పానిష్ పత్రాల ధర హెచ్చింది. అంటే డాంగ్లర్‌కి అయిదు లక్షలు లాభం రావడానికి బదులు అయిదు లక్షలు నష్టం వచ్చిందన్నమాట.

Edited, Printed & Published by S. Sambhu Prasad at the Andhra Patrika Press, 7, Thambu Chetty St., Madras.

త్వరలో వెలువడనున్నది.

ప్రసిద్ధ ఫ్రెంచి నవలాకారుడు

అలెగ్జాండర్ డ్యూమా

రచించిన

# కౌంట్ ఆఫ్ మాంట్ క్రిస్టో

(మొదటిభాగం)

అనువాదం:

సూరంపూడి సీతారామ్

ఆంధ్రపత్రిక సచిత్రవారపత్రికనుండి పునర్ముద్రితము.

వెల: మూడున్నర రూపాయలు

---

ప్రకాశకులు:

ఆంధ్రగ్రంథమాల,

మద్రాసు 1.